


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 206

సోమవారం 17-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

"రైతు కష్టం తెలిసిన మీ బిడ్డగా ఈ మూడేళ్ళలో ప్రతి అడుగు రైతన్నలకు తోడుగా వారిని ఆదుకునే దిశగా వేయడం జరిగింది.. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఆలోచనలు చేశాం.. చరిత్రను మార్చే విధంగా విప్లవాత్మక మార్పులు గ్రామ స్థాయిలోనే తెచ్చి గొప్ప పథకాలకు శ్రీకారం చుట్టాం.. క్రమం తప్పకుండా క్యాలెండర్ ఇచ్చి, క్యాలెండర్‌లో నెల చెప్పి ఖచ్చితంగా, క్రమం తప్పకుండా పథకాలు అమలు చేస్తూ అందులో భాగంగా నేడు "వైఎస్సార్ రైతు భరోసా - పిఎమ్ కిసాన్" రెండో విడత అమలు చేస్తున్నామని సగర్వంగా మీ బిడ్డగా తెలియజేస్తున్నాను"..

- మీ ముఖ్యమంత్రి
వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

వరుసగా నాలుగో ఏడాది..
రెండో విడతగా...

వైఎస్సార్ రైతు భరోసా -PM KISAN

ప్రతి ఏటా 3 విడతల్లో రూ.13,500 ల రైతు భరోసా సాయం.. నాలుగో ఏడాది మొదటి విడతగా ఈ మే నెలలో ఖరీఫ్ కు ముందే రైతన్నలకు ఒక్కొక్కరికి రూ.7,500 ల చొప్పున ఇప్పటికే అందజేశాం..

నేడు రెండో విడతగా పంట కోతకు, రబీ అవసరాలకు ఒక్కొక్కరికి మరో రూ. 4,000 ల చొప్పున 50.92 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ. 2,096.04 కోట్లను నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో బటన్ నొక్కి నేరుగా జమ చేయనున్న గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్. జగన్ మోహన్ రెడ్డి..

వచ్చే సంక్రాంతి రోజుల్లో ప్రతి రైతన్నకూ ఇక మూడో విడతగా మరో రూ. 2,000 అందించనున్న జగనన్న ప్రభుత్వం..

దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతన్నలతో పాటు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ కౌలు రైతులు, RoFR (అటవీ), దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతన్నలకు కూడా "వైఎస్సార్ రైతు భరోసా" క్రింద ఏటా రూ.13,500 రైతు భరోసా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే.. ప్రతి ఏటా 50 లక్షలకు పైగా రైతన్నలకు ప్రతి ఏటా సుమారు రూ. 7,000 కోట్లు రైతు భరోసా సాయంగా అందిస్తున్నాం..

ఇప్పుడు అందిస్తున్న సాయం రూ. 2,096.04 కోట్లతో కలిపి ఈ మూడేళ్ల నాలుగు నెలల్లో జగనన్న ప్రభుత్వం రైతన్నలకు అందించిన మొత్తంలో కేవలం "వైఎస్సార్ రైతు భరోసా" సాయం మాత్రమే రూ. 25,971.33 కోట్లు..



చెప్పిన దాని కన్నా ముందుగా.. మాట ఇచ్చిన దానికన్నా మిన్నగా రైతన్నలకు సాయం..

మ్యానిఫెస్టోలో చెప్పింది	- ఏటా రూ. 12,500 X 4సం॥ = రూ. 50,000
జగనన్న ప్రభుత్వం ఇస్తున్నది	- ఏటా రూ. 13,500 X 5సం॥ = రూ. 67,500
రైతన్నకు చెప్పినదాని కన్నా మిన్నగా అదనంగా అందిస్తున్న మొత్తం	రూ.17,500

రైతు భరోసా క్రింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికీ ఏడాదికి అందిస్తున్న రైతు భరోసా సాయం రూ.13,500...

మొదటి విడత	ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ. 7,500
రెండవ విడత	అక్టోబర్ నెలలో ఖరీఫ్ పంట కోత సమయంలోనూ, ఇంకా రబీ అవసరాల కోసం రూ. 4,000
మూడవ విడత	ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ, జనవరి నెలలో రూ. 2,000

వర్గాల వారీగా "వైఎస్సార్ రైతు భరోసా" సాయం

కేటగిరి	లబ్ధిదారులు	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
బి.సి	24,61,000	12,113.11
ఎస్.సి	5,23,000	2,653.04
ఎస్.టి	3,92,000	1,771.13
మైనార్టీలు	60,000	320.68
కాపు	7,85,700	3,793.44
ఇతరులు	10,16,300	5,319.93
మొత్తం	52,38,000	25,971.33



ఇది జగనన్న ప్రభుత్వం నేటి వరకు రైతన్నలకు అందించిన సాయం...

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో)	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	52.38	25,971.33
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	44.28	6,684.84
ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	20.85	1,795.40
ధాన్యం కొనుగోలు (నేటి వరకు)		45,899.63
ఇతర పంటల కొనుగోలు (నేటి వరకు)		7,156.00
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ		27,000.00
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ		2,500.00
పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపుకు..		1,700.00
శనగ రైతులకు బోనస్		300.00
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	13.58	1,264.24
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.32	85.47
వైఎస్సార్ యంత్ర సేవా పథకం		690.87
విత్తన సబ్సిడీ		1,008.33
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (మనం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలతో సహా)	65.65	1,282.11
మనం చెల్లించిన గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు		960.00
గత ప్రభుత్వ కరెంటు బకాయిలు (మనం మన మీద వేసుకున్నవి)		8,845.00
గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు (మనం చెల్లించింది)		384.00
మొత్తం సాయం		1,33,526.92

గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ పథకాల ద్వారా ఈ మూడేళ్ల నాలుగు నెలల్లో రైతన్నలకు జగనన్న ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి దాదాపు రూ. 1,33,526.92 కోట్లు

తేడా గమనించండి..!!

గతంలో ..

1. వేళాపాళ లేకుండా రైతులకు విద్యుత్ సరఫరా, నాణ్యత లోపం కారణంగా ట్రాన్స్ ఫార్మర్ లు కాలిన పరిస్థితి...
2. అరకొరగా విత్తనాలు, ఎరువుల పంపిణీ.. మార్కెట్ యార్డుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా, రోజుల తరబడి పడిగాపులు కాసినా సకాలంలో అందని దుస్థితి..
3. గతంలో బీమా క్లెయిమ్ లు ఎప్పుడొస్తాయో, ఎంతొస్తాయో, ఎంతమందికొస్తాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి..!
4. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. అయిన వారికే పరిహారం.. రైతన్నలు క్షేత్ర స్థాయి ఉద్యోగుల చుట్టూ తిరిగి ఏళ్ల తరబడి ఎదురుచూసినా నష్ట పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి.. అరకొరగా అందే ఆ పరిహారానికి కూడా మధ్యవర్తులు, దళారులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి.. 2017-18, 2018-19 నాటికి ఎగ్గొట్టిన ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము రూ. 2, 558.07 కోట్లు.. సున్నా వడ్డీ పంట రుణాల బకాయిలు రూ.1,282 కోట్లు, ధాన్యం సేకరణ బకాయిలు రూ. 960 కోట్లు, విద్యుత్ బకాయిలు రూ. 8,845 కోట్లు, విత్తన బకాయిలు రూ. 384 కోట్లు
5. ఏడాది పొడవునా కరవు.. ఐదేళ్లలో 1,623 కరవు మండలాల ప్రకటన..
6. రైతులకు గిట్టుబాటు కల్పించాలనే ఆలోచన లేదు. మార్కెట్ లో ధరలు పడిపోతే కనీసం పట్టించుకున్న నాథుడే లేడు.. అరకొరగా పంటలకు మద్దతు ధరలు ప్రకటించినా సరిగా అమలు చేసిన పాపాన పోలేదు..

మరి మన జగనన్న ప్రభుత్వంలో..

1. మన ప్రభుత్వంలో ఉచితంగా పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా..
2. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతన్నకు గ్రామంలోనే గడప వద్దనే నకిలీలకు తావులేకుండా ప్రభుత్వంచే ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల పంపిణీ.. రైతన్నకు ప్రతి అడుగులోనూ తోడుగా విత్తనం నుండి పంట విక్రయం వరకు మన గ్రామంలోనే..
3. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతన్నలపై ఒక్క రూపాయి కూడా ఆర్థిక భారం లేకుండా పూర్తి ప్రీమియం బాధ్యతను జగనన్న ప్రభుత్వమే తీసుకుని.. సాగు చేసిన ప్రతి ఎకరాన్ని ఈ క్రాప్ లో నమోదు చేయించి.. బీమా పరిహారపు సొమ్ము కూడా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా ఒక సీజన్ పరిహారం మరుసటి ఏడాది అదే సీజన్ రాక ముందే క్రమం తప్పకుండా చెల్లిస్తున్న మన జగనన్న ప్రభుత్వం..
4. మరి, మనందరి జగనన్న ప్రభుత్వంలో మన గ్రామంలోనే మన ఆర్బీకేల ద్వారానే పంట వేసినప్పుడే ఈ-క్రాప్‌లో నమోదు చేయించి శాస్త్రీయంగా, అర్హులెవ్వరూ మిగిలిపోకుండా పంట నష్టాల అంచనా.. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ ఆర్బీకేలలో అర్హుల జాబితా ప్రదర్శించి మరీ ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం..
5. ఏడాది పొడవునా వర్షాలు.. సమృద్ధిగా పంటలు.. ఒక్క కరవు మండలం ప్రకటించే పరిస్థితి కూడా రాలేదు దేవుడి దయతో..
6. మరి జగనన్న ప్రభుత్వంలో పసుపు, మిర్చి, ఉల్లి, అరటి, బత్తాయి, 5 రకాల చిరుధాన్యాలతో సహా 26 పంటలకు పంట వేసినప్పుడే మద్దతు ధరల ప్రకటన.. మార్కెట్ లో పోటీ పెంచి, రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించేలా, ఆర్బీకేల ద్వారా కనీస గిట్టుబాటు ధరకు పంటల కొనుగోలు చేసేందుకు చర్యలు.. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు..

శ్రీ కాకాణి గోవర్ధన రెడ్డి, వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు 17 అక్టోబర్, 2022 నాడు ఉదయం 11 గంటలకు వైఎస్సార్ రైతు భరోసా-PM Kisan క్రింద రైతన్నల ఖాతాల్లో లబ్ధి జమ చేసే కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సన్నిధి

సూక్తి సుధ

- సంతోషకరమైన జ్ఞాపకాలు ఎప్పుడూ విచారకరంగా మారవు. కానీ విచారకరమైన జ్ఞాపకాలు కాలక్రమేణా ఆహ్లాదకరమైన జ్ఞాపకాలుగా మారచ్చు.
- ఆనందానికి కారణం ఉంటే, అది ఎక్కువ కాలం ఉండదు. ఎటువంటి కారణం లేకుండా ఆనందం ఉన్నప్పుడు, అది ఎల్లప్పుడూ ఉంటుంది.
- ఎలాంటి పరిస్థితుల్లోనైనా మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనే సాధన చేయండి. వాదించి మనుషులను, వేధించి మనసుని ఎప్పుడూ గెలవలేం.



ప్రేమ ధ్వజం

నా మీద ప్రేమను ధ్వజముగా ఎత్తెను (పరమ గీతము 2:4) సొలొమోను మహారాజు బైబిల్‌లోని 'పరమగీతము' అనే గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథంలో కనబడే ప్రియుడు ప్రభువైన యేసుక్రీస్తుకు సాదృశ్యం. ప్రియురాలితో పోల్చబడిన సంఘం కోసం దేవుడు ఒక ధ్వజాన్ని నిలువబెట్టడం ఆశ్చర్యంగా లేదూ? దాని పొడవు వెడల్పులు ఎంత? దాని ఎత్తు, లోతు ఎంత? సరిగ్గా చెప్పాలంటే... మనము కొలవలేనంత! అవును నీవు, నేను కొలవలేనంత బ్రహ్మాండమైన ధ్వజాన్ని భూమికి నడిబొడ్డున దేవుడు నిలిపాడు.

చరిత్రలో ఇంతకు ముందెన్నడు ఎవ్వరూ ఇటువంటి ధ్వజాన్ని నిలువబెట్టలేదు. అది భూమికి ఆకాశానికి మధ్య నిలువబెట్టబడిన సిలువ ధ్వజం. నలుదిక్కుల నుండి మనుష్యులను తన దగ్గరకు ఆహ్వానిస్తుంది. ఆ ధ్వజం దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరూ పరమ పునీతులయ్యారు. పాప పంకిలమైన తమ బతుకులను మార్చుకున్నారు. పరమాత్ముని యందు భక్తిపారవశ్యంతో పావనపరచబడ్డారు. క్రీస్తు నిలిపిన ఆ ధ్వజానికి సాటియైనది మరొకటి ఎక్కడా కనిపించదు.

ప్రేమ ధ్వజం దగ్గర కక్షలు, కార్పణ్యాలు లేవు. ప్రతీకారేచ్ఛ అసలే లేదు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న విమర్శలకు సమాధానం లేదు. కేవలం మౌనమే! అది చేతకానితనం కాదు. ప్రేమించడం చేతకాని మనిషికి శిక్షణ ఇవ్వడం... మాదిరి చూపడం.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను (యోహాను 3:16). ఎంతో అను మాటకు అంతు లేదు. పరము నుండి కిందకు దించింది, మరణం పొందునంతగా యేసుప్రభువును ప్రేరేపించింది ఆ ప్రేమయే. తన దగ్గరకు వచ్చే ఎవ్వరినైనా వారి స్థాయిని అంతస్తును చూడని ప్రేమ క్రీస్తు ప్రేమ. మన దౌర్భాగ్య స్థితి పూర్తిగా తెలిసినప్పటికి అవేమీ తనకు తెలియనట్టుగా మనలను ప్రేమించే నిష్కళంక ప్రేమ అది. ఆ ప్రేమను వర్ణించడం ఎవ్వరికి కలలోనైనా సాధ్యం కాదు.

ప్రేమ ధ్వజం దగ్గర కక్షలు, కార్పణ్యాలు లేవు. ప్రతీకారేచ్ఛ అసలే లేదు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న విమర్శలకు సమాధానం లేదు. కేవలం మౌనమే! అది చేతకానితనం కాదు. ప్రేమించడం చేతకాని మనిషికి శిక్షణ ఇవ్వడం... మాదిరి చూపడం. ప్రేమ ధ్వజం దగ్గర డంబం లేదు. తాను చేయలేని పనిని దేవుడు ఎప్పుడూ చెప్పలేదు. తాను చేయగలిగే దానిని చేయకుండా దాచలేదు. ఆయన నిర్మలుడు, సంపూర్ణుడు గనుక ఆయన కార్యాలన్నీ సంపూర్ణమైనవే. మనకు వలే కార్యాలను అసంపూర్ణంగా చేయువాడు కాదు. దేవుని ప్రేమను అర్థం చేసుకోగలిగే మనస్సు కోసం ఎన్నడైనా ప్రార్థించావా? ఆ ప్రేమలో స్థిరపడితే చాలు... బద్ధుడవైతే చాలు నీ జీవితం ధన్యం. ద్వేషం అనేది కాలిపోయే చెట్టులాంటిది. ఏ పక్షి (ఆశీర్వాదం) దానిమీద వాలదు. క్రీస్తు ప్రేమ ధ్వజం వద్ద మోకరిల్లి జీవితాన్ని ప్రేమమయం చేసుకుంటావా? దేవునికి విరోధమైన భావాలను తలకెక్కించుకొని జీవచ్ఛవంలా ఉండిపోతావా? ఆలోచించు.

– డా॥ జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

మంచి మాట

అతి అనర్థమే!

'అతి సర్వత్ర వర్జయేత్' అంటే అతి ఎల్లవేళలా విడిచిపెట్టాలి అని పెద్దలు ఏనాడో చెప్పారు. అతి అన్న మాటకు ఎక్కువగా, అధికంగా, అవసరమైన దానికన్నా అని అర్థం. అవసరానికి మించినది ఎక్కువ ఏ విషయంలోనూ కూడదని దీని తాత్పర్యం. మన నడతలో, ఆహార్య ఆహారాదులలో, భాషణ, భూషణాది విషయాలలో ఒక హద్దు, నియమం ఒక పరిమితి ఉండాలి. అంతకుమించి పోరాదు.

పరిమితి, హద్దు అనేవి ప్రకృతికే కాదు, మనిషి జీవితానికి అవసరం. అవి మనకొక క్రమాన్ని, హద్దును ఏర్పరచి జీవితం, సత్సంబంధాలు హాయిగా కొనసాగేటట్టు చేస్తాయి. మనిషి నాగరికతను, సంస్కారాన్ని సూచించేవి దుస్తులు. సభ్యతతో సమాజంలో సంచరించటానికి



చక్కని వస్త్రధారణ కావాలి. అవి మనకు ఒక హుందాను, నిండుదనాన్ని ఇవ్వాలి. సరైన కొలతలతో ఉన్న దుస్తులు మన ఒంటికి చక్కగా అమరుతాయి. అందాన్ని స్తాయి. పరిమాణంలో అతి ఎక్కువగా లేదా అతి తక్కువగా ఉన్న ఉడుపులు చూపరులకు ఇబ్బందిని కలిగిస్తాయి.

ఆహారం మన శరీరానికి శక్తినిస్తుంది. ఉత్సాహాన్నిచ్చి మన పనులు చేసుకునేందుకు దోహదం చేస్తుంది. ఆహారం మనకు అందించే కేలరీలు శరీరానికవసరమైన స్థాయిలో ఉంటే చక్కని ఆరోగ్యం. ఇవి అతిగా ఉంటే ఊబకాయం. పనులు చేసుకోవటం కష్టమవుతుంది. అలాగే వీటి సంఖ్య తగ్గితే అనారోగ్యమే. ఈ కేలరీలను నియంత్రించుకోవాలంటే జిహ్వను అదుపులో పెట్టుకోవాలి. 'నాలుక కోరుతోంది కాబట్టి తింటాను' అనే వాళ్ళ ఆరోగ్యం పాడైపోతుంది. అందుకనే మితమైన లేదా సరిపడా ఆహారం తీసుకోవాలి.

అలసిన శరీరం మళ్లీ శక్తిని పుంజుకుని, మరుసటి రోజు పనులకు ఆయత్తమవాలంటే నిద్ర మనకు చాలా అవసరం. సేదతీరిన కాయం కొంత సమయం తరువాత చైతన్యవంతమవుతుంది. మన దినచర్య లోకి వెళ్ళమని సూచిస్తుంది. కొంతమంది అవసరమైన సమయంకన్నా ఎక్కువసేపు నిద్రపోతుంటారు.అటువంటివారిలో ఒక మందకొడితనం వస్తుంది. శరీరంలో చురుకుదనం తగ్గి చైతన్యం మటుమాయం అవుతుంది. ఈ దురలటువాటు మన జీర్ణ వ్యవస్థను ఛిద్రం చేస్తుంది అందుకే అతినిద్ర చేటు అని వివేకవంతులు చెప్పారు.

'కేయురాణి న భూష యంతిం' అన్న శ్లోక భావార్థం ఇదే.

పెద్దలు, పండితులు, మహానుభావుల సమక్షంలో ఒదిగి, వినమ్రంగా ఉండాలి. వినయంతో సంచరించాలి.

ఇది వారి జీవితానుభవాన్ని, విద్వత్తును, ఘనతను గుర్తెరిగి ప్రవర్తించటం. కొందరు అవసరానికి మించిన వినయాన్ని చూపిస్తారు. అది ధూర్తుల లక్షణం. వీరి అతివినయపు లక్ష్యం ఒక స్వార్థ ప్రయోజనమే.

వినయాన్ని చూపుతూనే మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. అపుడే దానికొక ఒక గౌరవం, ప్రశంస.

అతిపరిశుభ్రత వల్ల సమయం, శక్తి వృథా. అతి ప్రేమ, కాముకత, అహంకారం, జాత్యహంకారం వల్ల ఎందరో, ఎన్నో దేశాలు నాశనమయ్యాయో చెప్పే చరిత్ర పాఠాలు విందాం.

మనిషికి మాత్రమే ఉన్న అద్భుత ఆలోచనా శక్తి అతణ్ణి జంతుప్రపంచం నుండి విడివడేటట్టు చేసింది. భాషను కనుగొనేటట్టు చేసింది. దీనికితోడు, సృష్టిలో ఏ ఇతరప్రాణికి లేని అతడి స్వరపేటిక, నాలుక, ఊపిరితిత్తుల కుదురైన అమరిక అతడి భావోద్వేగాలను వ్యక్తం చేసే గొప్పసాధనమైంది. సందర్భానికి కావలసిన అర్థవంతమైన మాటలను మనలో ఎంతమంది వాడగలరు? వేళ్ళమీద లెక్కపెట్టగలిగే వారే కదా! చాలామంది అధిక ప్రసంగం చేసేవారే. కుశలత, ఔచిత్యత, వివేచనలతో సందర్భశుద్ధిగా భాషించే వాళ్ళు మనలో చాలా తక్కువమందే. ఈ వదరుబోతుల వల్ల కాలహరణమే కాక సంభాషణ పెడదారి పడుతుంది. అందుకే మాట్లాడటం ఒక కళ అన్నారు. అది కొందరికే అలవడుతుంది. అపుడు భాషణం గొప్ప భూషణమే అవుతుంది.

– బొడ్డపాటి చంద్రశేఖర్, ఆంగ్లోపన్యాసకులు

గురువాణి

ఆ నలుగురు...

అది మంచి పని కానీయండి, చెడ్డపని కానీయండి. మంచి పని చేస్తే కీర్తి వస్తుంది. మనిషి వృద్ధిలోకి వస్తాడు. చెడ్డ పని చేస్తే అపకీర్తి వస్తుంది, పాడయిపోతాడు. అయితే ఒక పని జరిగింది అన్నప్పుడు ఆ పని వెనుక నలుగురు ఉంటారంటుంది శాస్త్రం. ఎవరా నలుగురు! చేసేవారు, చేయించేవారు, ప్రేరేపించేవారు, ఆమోదించేవారు. జరిగిన పనికి వచ్చిన ఫలితాన్ని.. వాటి వలన వచ్చే పుణ్యం కావచ్చు, పాపం కావచ్చు సమానంగా పంచుకుంటారు.

ఒక్కోసారి చెడ్డపని జరగకుండా ఆపే ప్రయత్నం కూడా మంచిపనే. మంచి పని జరగకుండా చూడడం తప్పు. చెడ్డ పని జరగకుండా చూడడం ఒప్పు. శాస్త్రం మీద నమ్మకం ఉండాలి. పదిమంది క్షేమాన్ని కోరగలిగిన గుణం ఉండాలి. భవిష్యత్తులో ఆపదలు రాకుండా ఉండాలన్న దీర్ఘదృష్టిని పొంది ఉండాలి. ఇవన్నీ ఉంటే తప్ప చెడ్డపనిని ఆపడం సాధ్యం కాదు.

మొదట చేసాడు కనుక. తరువాత లోభాన్ని గెలిచాడు కనుక కర్త గొప్పవాడయ్యాడు. నాకేం అవసరం, నేనెందుకు చేయాలి? అన్న భావనలను దాటడం గొప్ప లక్షణం. అంతమంది చెయ్యకుండా కూర్చున్నారు కదా...నేనే ఎందుకు చేయాలి... అని ఎవరికి వారు అనుకొన్నప్పుడు లోకంలో అందరికీ పనికొచ్చే పనులు ఎలా జరుగుతాయి !!! పదిమందికి పనికొచ్చే ఒక నీటి సౌకర్యం, ఒక బాట సౌకర్యం కల్పించాలి... అన్న సంకల్పం రావడమే గొప్ప. అది నెరవేరాలంటే దానికి ఖర్చు పెట్టాలి. అది అర్ధ రూపాయి కావచ్చు, ఆరుకోట్ల రూపాయలు కావచ్చు. నేనెందుకు చేయాలి అన్న భావన వదిలి ఆ పని చేయడానికి సిద్ధమయ్యాడు అంటే లోభాన్ని గెలిచినట్లే. అందుకని ఆ పని తాలూకు ఫలితంలో నాలుగోవంతు ఆయనకు లభిస్తుంది.

తరువాత– చేయించేవాడు. ఆ పనిని ఎవరు చేయగలరో గుర్తించి తాను వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి తాను కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రోత్సహించాడు. ఆ పని జరిగితే కీర్తి నాకు కాకుండా చేసిన వాడికి దక్కుతుందనే అసూయ కొద్దీ చేయకుండా తప్పుకుంటే చేసేవాడికి బలం ఉండదు. అలాకాక తాను కూడా ధైర్యంగా ముందుకడుగు వేసాడు కాబట్టి అసూయను గెలిచాడు. సంకుచితమైన ధోరణిని వదిలి... చేస్తున్న వాడి హితాన్ని, అందరి హితాన్ని కోరాడు కనుక ఆయనకూ నాలుగో వంతు ఫలితం.

మూడవవారు– ప్రేరేపించిన వారు. కర్త తటపటాయిస్తూ కాలాన్ని వృథా చేయకుండా, త్వరగా మొదలు పెట్టు అంటూ, దాని అవసరాన్ని గుర్తు చేస్తూ వెంటబడి ప్రేరేపించబట్టి ఆ పని సకాలంలో పూర్తయింది కాబట్టి వీరికి కూడా నాలుగో వంతు ఫలితం దక్కుతుంది.

ఆమోదించిన వాడు – యుక్తాయుక్త విచక్షణతో, శాస్త్రీయ దృక్పథంతో ఈ పనిమంచిదే, చెడ్డది మాత్రం కాదు, మంచే జరుగుతుంది, చేయవచ్చు అని అంగీకారం తెలిపితే చేసేవాడికి ఇక ఆ పనిలో మరే సందేహం ఉండదు, కనుక ఆమోదించినవాడికి కూడా నాలుగో వంతు లభిస్తుంది.

ఇది తెలిస్తే ఏ పని అయినా ఉత్సాహంగా ముందుకు సాగుతుంది.. నేనేం చేయగలనండీ అని అడుగులు వెనక్కి పడవు. మంచి పనికి ఈ నలుగురు గట్టిగా ఇలా నిలబడాలి, అప్పుడే సమైక్యతతో ఏదయినా సాధించగలం.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా



ఈశాన్ సూర్య, కోన వెంకట్, మోహన్‌బాబు, ఛోటా కె.నాయుడు, విష్ణు, అనూప్ రూబెన్స్

సినిమానే నా ఊపిరి – మంచు మోహన్ బాబు

"సినిమానే మన ఊపిరి అని మా గురువు దాసరి నారాయణరావుగారు అనేవారు.. అలా సినిమానే మా ఊపిరి.. నా ఊపిరి. కళామతల్లి మాకు భోజనం పెట్టింది. 'జిన్నా' సినిమా గొప్ప హిట్ సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని నటుడు, నిర్మాత మంచు మోహన్ బాబు అన్నారు. విష్ణు మంచు హీరోగా, పాయల్ రాజ్‌పుత్, సన్నీలియోన్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'జిన్నా'. ఈశాన్ సూర్య దర్శకత్వం వహించారు. అవ్రామ్ భక్త మంచు సమర్పణలో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జిన్నా జాతర' పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో మంచు మోహన్ బాబు మాట్లాడుతూ–''జిన్నా'లో విష్ణు ఎంతో రిస్కీ షాట్స్ చేశాడు.. జీవితంలో అలాంటి సన్నివేశాలు చేయడం మంచిది కాదని చెప్పాను. 'ఢీ' కంటే పది రెట్ల హిట్‌ని 'జిన్నా' అందుకోవాలి. విష్ణుని ఛోటా కె.నాయుడు అద్భుతంగా చూపించాడు. మంచి మ్యూజిక్ ఇచ్చిన అనూప్‌కి థ్యాంక్స్. అరియానా–వీవీయానా ఇంత అద్భుతంగా పాడతారని కలలో కూడా ఊహించలేదు. ఈ సినిమా ద్వారా సూర్య గొప్ప డైరెక్టర్ కావాలని కోరుకుంటున్నా. నాకు ఎన్నో హిట్ పాటలకు డ్యాన్స్‌లు సమకూర్చిన ప్రభుదేవా 'జిన్నా'లో విష్ణుకి నృత్యరీతులు సమకూర్చారు.. మా ఫ్యామిలీలో ఒకడిగా, మాపై ఉన్న గౌరవంతో తను డబ్బు తీసుకోకుండా చేసినందుకు థ్యాంక్స్'' అన్నారు.

విష్ణు మంచు మాట్లాడుతూ–''జిన్నా' సినిమాకి ముందుగా కోన వెంకట్‌గారికి థ్యాంక్స్. ఛోటాగారితో ఎప్పటి నుంచో పనిచేయాలని అనుకుంటున్నాను.. ఇప్పుడు కుదిరింది. 'జిన్నా' నా మనసుకి బాగా దగ్గరైన సినిమా. నా కెరీర్‌లో బెస్ట్ మ్యూజిక్ ఇచ్చిన అనూప్ రూబెన్స్‌కి థ్యాంక్స్. అరియానా–వీవీయానా తొలిసారి అయినా అద్భుతంగా పాడారు. ఇంత మంచి సినిమా ఇచ్చిన సూర్యకి థ్యాంక్స్. అందరూ మా సినిమాని చూసి, మమ్మల్ని ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అన్నారు.

'జిన్నా' కథా రచయిత జి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ–''జిన్నా' రషెస్ చూసినప్పటి నుంచి ఒక బ్లాక్‌బస్టర్ వైబ్ నా చుట్టూ తిరుగుతోంది.. ఇది వందశాతం నిజం. సినిమా బ్లాక్ బస్టర్. ఇండస్ట్రీలో హిట్ చూసిన ఎవరైనా సరే.. అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, మోహన్ బాబు, చిరంజీవిగార్లు.. ఎవరైనా ఫ్లాప్ చూస్తారు.. కానీ, ఫ్లాప్‌ని ఎదుర్కొనే దమ్ము ఉండాలి. ఆ దమ్ము మోహన్‌బాబుగారి ద్వారా విష్ణుకి వచ్చింది.. తను ఎదుర్కొన్నాడు.. 'జిన్నా' తో బ్లాక్ బస్టర్ కొడతాడు'' అన్నారు.''జిన్నా' సినిమా కాదు.. మా అన్నయ్య(మోహన్‌బాబు)గారు నాపై పెట్టిన బాధ్యత. ఈ చిత్రం వందశాతం ప్రేక్షకుల్ని సంతృప్తి పరుస్తుంది'' అన్నారు చిత్ర క్రియేటివ్ ప్రొడ్యూసర్, స్క్రిప్ట్ రైటర్ కోన వెంకట్. ఈ సమావేశంలో సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, నటులు అలీ, చమ్మక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు – ఆది సాయికుమార్



మిర్నా మీనన్, ఆది, దిగంగన, రాధామోహన్, ఫణికృష్ణ

"'క్రేజీ ఫెలో' సినిమాకి అన్ని చోట్ల నుండి అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. మౌత్ టాక్ చాలా బాగుంది'' అని హీరో ఆది సాయికుమార్ అన్నారు. ఫణికృష్ణ సిరికి దర్శకత్వంలో ఆది సాయికుమార్ హీరోగా, దిగంగనా సూర్యవన్షీ, మిర్నా మీనన్ కథానాయికలుగా నటించిన చిత్రం 'క్రేజీ ఫెలో'. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేకే రాధామోహన్ మాట్లాడుతూ– ''క్రేజీ ఫెలో' విజయం యూనిట్ అందరిది. మా బ్యానర్ ద్వారా ఆదికి మంచి సక్సెస్ ఇచ్చినందుకు హ్యాపీ'' అన్నారు ''మంచి సినిమా వస్తే థియేటర్‌కి వస్తామని 'క్రేజీ ఫెలో'తో మరోసారి రుజువు చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు ఫణికృష్ణ. ''మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు దిగంగనా సూర్యవన్షీ, మిర్నా మీనన్.

టైటిల్‌కి వేళాయె!



బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి 'అన్నగారు', 'వీరసింహారెడ్డి', 'రెడ్డిగారు', 'జై బాలయ్య' అనే టైటిల్స్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఈ నెల 21న ప్రకటించనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. మరి.. తెరపైకి వచ్చిన టైటిల్స్‌లో ఏదైనా ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక కొత్త టైటిల్ ఖరారు చేస్తారా? అనే విషయం తెలియాలంటే ఈ నెల 21 వరకు వేచి చూడాలి. దునియా విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్, చంద్రికా రవి(స్పెషల్ నంబరు) కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం:తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి.

వరదరాజ్ వచ్చాడు

ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'సలార్'. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, మలయాళ దర్శక– నిర్మాత, నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఆదివారం (అక్టోబరు 16) పృథ్వీరాజ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'సలార్' చిత్రంలో వరదరాజ్ మన్నార్ పాత్రలో పృథ్వీరాజ్ నటిస్తున్నట్లు ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ ఓ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ''ప్రభాస్, పృథ్వీరాజ్ వంటి గొప్ప నటులను డైరెక్ట్ చేస్తుండటం గొప్ప ఎక్స్‌పీరియన్స్. వరదరాజ్ పాత్రకు పృథ్వీరాజ్ తప్ప మరెవరూ సూట్ కారు'' అన్నారు ప్రశాంత్ నీల్. ఈశ్వరీ రావు, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్న 'సలార్' వచ్చే ఏడాది సెప్టెంబరు 28న విడుదల కానుంది.



పృథ్వీరాజ్



తమన్నా

పెళ్లికి సిద్ధమే.. కానీ!

చిత్ర పరిశ్రమలో దాదాపు 17 ఏళ్లుగా అగ్ర కథానాయికల్లో ఒకరిగా కొనసాగుతున్నారు తమన్నా. ఆమె పెళ్లి గురించి ఇటీవల పలు వార్తలు వస్తున్నాయి.. ఈ విషయంపై తమన్నా తాజాగా స్పందిస్తూ– ''అందరిలానే నా తల్లిదండ్రులు కూడా నన్ను పెళ్లి చేసుకోమని చెబుతూనే ఉన్నారు. నాకూ పెళ్లి వ్యవస్థపై నమ్మకం ఉంది. పెళ్లి చేసుకోవాలని, తల్లిని కావాలని ఉంది. కానీ, ప్రస్తుతం నేను వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేనంత బిజీగా ఉంటున్నాను. నా బిజీ షెడ్యూల్స్ వల్ల కొన్నిసార్లు నా తల్లిదండ్రులతో కూడా ఫోన్‌లో మాట్లాడలేకపోతున్నా. ప్రస్తుతానికి నా సంతోషమంతా షూటింగ్ లొకేషన్స్‌లోనే ఉంటోంది. నా వృత్తి జీవితంలో తల్లిదండ్రులు, అభిమానుల ప్రోత్సాహాన్ని మాత్రం మర్చిపోలేను'' అన్నారు.



అశ్వత్ మారిముత్తు, విశ్వక్ సేన్, రామ్‌చరణ్

ఓరి దేవుడా ఉప్పెనలా విజయం సాధించాలి – రామ్‌చరణ్

"నేను గతంలో రాజమహేంద్రవరంలో 'రంగస్థలం' షూటింగ్‌లో ఉండగా 'ఉప్పెన' ఫంక్షన్‌కు వచ్చా.. ఆ సినిమా రూ.100కోట్లు సాధించింది. ఇప్పుడు 'ఓరి దేవుడా' కోసం వచ్చా.. ఈ సినిమా కూడా 'ఉప్పెన'లా పెద్ద విజయం సాధించాలి'' అని రామ్‌చరణ్ అన్నారు. విశ్వక్‌సేన్ హీరోగా వెంకటేష్ కీలకపాత్రలో నటించిన చిత్రం 'ఓరి దేవుడా'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిథిలా పాల్కర్, ఆశాభట్ హీరోయిన్లు. పీవీపీ, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలకానుంది. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా హాజరైన రామ్ చరణ్ మాట్లాడుతూ– ''ఓరి దేవుడా' ట్రైలర్ బాగా నచ్చింది. వెంకటేష్ అన్నా.. మీకోసమైనా నేను ఈ సినిమా చూస్తాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో విశ్వక్‌సేన్ పేరు తెలియని వారు ఉండరు. తప్పో ఒప్పో.. తను ఇచ్చిన మాట కోసం నిలబడతాడు. అందుకే విశ్వక్ వ్యక్తిత్వానికి నేను పెద్ద ఫ్యాన్. సినిమాలు ఫ్లాప్ అయినా హిట్ అయినా ఎప్పుడూ సూపర్‌స్టార్‌గానే ఉండాలంటే వ్యక్తిత్వమే దోహదం చేస్తుంది. ఇందుకు రజనీకాంత్, చిరంజీవి, పవన్‌కల్యాణ్‌గార్లు ఉదాహరణ'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రామ్‌చరణ్ అన్నయ్య సినీ ప్రయాణం నాకెంతో స్ఫూర్తి. మెగాస్టార్(చిరంజీవి) కొడుకుగా పెద్ద బాధ్యతతో ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వటం మామూలు విషయం కాదు.. ఇప్పుడాయన భారతీయ చలన చిత్రపరిశ్రమ అంటే ఏంటో ప్రపంచానికి తెలియజేశారు. నేను క్రమశిక్షణగా ఉండను. కానీ, ఇప్పుడు అన్నయ్యను(రామ్‌చరణ్) దగ్గరగా చూశాను కాబట్టి ఆయన్నుంచి క్రమశిక్షణ నేర్చుకుంటాను. హృదయాలను కదిలించే సినిమా 'ఓరి దేవుడా'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులకు మంచి వినోదం పంచుతుంది'' అన్నారు అశ్వత్ మారిముత్తు. ఈ వేడుకలో చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వంశీకాక, మ్యూజిక్ డైరెక్టర్ లియాన్‌జేమ్స్, కెమెరామేన్ విద్దు తదితరులు పాల్గొన్నారు.

యువతరం ఆలోచనలతో...



శ్రీరామ్, రిచా

శ్రీరామ్ నిమ్మల, రిచా జోషి జంటగా నాగ ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మది'. రామ్ కిషన్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని నటుడు సుమన్, నటి ఆమని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగ ధనుష్ మాటాడుతూ– ''యువత ఆలోచనా విధానానికి అద్దం పట్టేలా వినూత్నరీతిలో ఈ కథ సాగుతుంది'' అన్నారు. ''నటుడు కావాలని వచ్చిన నేను.. నా ఫ్రెండ్ బాధ చూడలేక ఈ చిత్రంతో నిర్మాతగా మారాను' అన్నారు రామ్ కిషన్. ''ఈ చిత్రంలో సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంది'' అన్నారు శ్రీరామ్. కో ప్రొడ్యూసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, దర్శకుడు జై శంకర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ ఠాగూర్, సంగీతం: పీవీఆర్.రాజా.

నువ్వే నువ్వే ప్రాణం

రామ్ జక్కల, అఖిల ఆకర్షణ జంటగా యు.హేమా రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏపీ 04 రామాపురం'. ఎస్వీ శివారెడ్డి సమర్పణలో రామ్‌రెడ్డి అందూరి నిర్మించారు. సాకేత్ వేగి, అబు సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నువ్వే నువ్వే ప్రాణం..' అంటూ సాగే మొదటి లిరికల్ వీడియోని చిత్రయూనిట్ విడుదల చేసింది. రామ్ జక్కల మాట్లాడుతూ– ''ఈ చిత్రం కడప సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఉంటుంది. సినిమా చాలా బాగా వచ్చింది. కేవలం కడప వాళ్లకే కాదు.. తెలుగు ప్రేక్షకులందరికీ మా మూవీ నచ్చుతుంది'' అన్నారు. ''ఈ సినిమాను చాలా ఇష్టంగా చేశాం. నవంబర్‌లో విడుదల కానున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు యు.హేమా రెడ్డి.



రామ్, అఖిల

సత్యమేవ జయతే

సాక్షి


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 206

సోమవారం 17-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మన 'గురి' అదిరింది

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఐదో స్వర్ణం - 12లో



రక్షణ 'ఫిక్స్‌డ్'.. రాబడి కాదు

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రాబడి వస్తుందా? మెరుగైన పెట్టుబడి సాధనమేనా? - 13లో



ఢిల్లీ డిప్యూటీ సీఎంకు సీబీఐ సమన్లు

మద్యం కుంభకోణంపై సోమవారం విచారణకు హాజరు కావాలని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు సీబీఐ నోటీసులిచ్చింది.

వివరాలు 6లో



ఎంబీబీఎస్ హిందీ పుస్తకాలు

ఎంబీబీఎస్ సబ్జెక్టులకు సంబంధించిన హిందీ పాఠ్యపుస్తకాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా మధ్యప్రదేశ్‌లో ఆవిష్కరించారు.

వివరాలు 6లో



హిందీ రుద్దితే ఊరుకోం

హిందీని బలవంతంగా తమ నెత్తిపై రుద్దితే ఊరుకునే ప్రసక్తే లేదంటూ ప్రధాని మోదీకి తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖ రాశారు.

వివరాలు 6లో



తైవాన్‌పై బలప్రయోగం!

తైవాన్‌ను చైనాలో కలిపే విషయంలో బలప్రయోగానికి సైతం వెనుకాడబోమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్


ఉత్తరాంధ్ర గొంతు నొక్కటానికే తప్పుడు రాతలు



ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షల కోసం గొంతెత్తి మాట్లాడుతున్నందుకే తమ లాంటి వాళ్ల పీక నొక్కాలని కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని మంత్రి ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. ఇలా గొంతు నొక్కేసి.. అమరావతిలో రియల్ ఎస్టేట్ సామ్రాజ్యం నిర్మించాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 11లో ▸

ఖర్గే వర్సెస్ శశిథరూర్.. నేడే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష ఎన్నికకు సర్వం సిద్ధమైంది. సీనియర్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, శశిథరూర్ ఎన్నికల బరిలో నిలవగా.. సోమవారం జరిగే పోలింగ్‌లో 9 వేల మందికి పైగా ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

వివరాలు 6లో ▸

పవన్.. గో బ్యాక్

పెద్దఎత్తున నినదించిన విశాఖ వాసులు.. రాజధానిగా వద్దనటంపై నిరసనలు

- ఉదయాన్నే పోర్టు స్టేడియం వద్దకు తరలివచ్చిన స్థానికులు
- వారికి మద్దతుగా నిలిచిన జేఏసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- పవన్‌కు విశాఖలో అడుగుపెట్టే అర్హత లేదంటూ నినాదాలు
- పరిస్థితి ఉద్రిక్తం.. కొందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తప్పనిసరై 'జనవాణి' కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్న పవన్‌కల్యాణ్
- తమ కార్యకర్తలను విడుదల చేసేదాకా విశాఖలోనే ఉంటానని ప్రకటన


విశాఖ పోర్టు స్టేడియం వద్ద పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖపట్నానికి రాజధాని వద్దని, అమరావతికే తాను మద్దతిస్తానని చెప్పటానికి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు విశాఖలో చుక్కెదురైంది. ఊహించని రీతిలో స్థానికుల నుంచి నిరసనల సెగ తగిలింది. 'పవన్ గో బ్యాక్' అంటూ యావత్తు విశాఖ నినదించింది. ఆదివారం ఉదయాన్నే పవన్ 'జనవాణి' నిర్వహించనున్న పోర్టు స్టేడియం ప్రాంతానికి

మిగతా 2వ పేజీలో ▶

వారంతా చరిత్ర హీనులు

ఉత్తరాంధ్రలో పుట్టి.. విశాఖ రాజధాని వద్దన్న ప్రతి ఒక్కరూ చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. ఉత్తరాంధ్ర వాసులు ఇంకా థర్డ్‌క్లాస్ ప్రజలుగానే బతకాలా? ఉత్తరాంధ్రుల మనోభావాలను టీడీపీ, జనసేన, ఎల్లోమీడియా దెబ్బతీస్తున్నాయి.

– మంత్రి బొత్స సత్యనారాయణ

చంద్రబాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్

ప్రశాంత నగరమైన విశాఖలో అలజడి రేపి అశాంతి నగరంగా మార్చేందుకు చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ యాక్షన్ చేస్తున్నారు. చంద్రబాబు వాణి వినిపించడానికే విశాఖలో జనవాణి.

– మంత్రి అంబటి రాంబాబు

మూడు పెళ్లిళ్లే జనసేన విధానం!

మూడు రాజధానులు మా పార్టీ విధానమైతే.. పవన్ కల్యాణ్‌ది మూడు పెళ్లిళ్ల విధానం. జనసేన కాదు.. బాబు సేన అని మార్చుకో. దాడులు చేస్తే కేసులు పెట్టక సత్కరిస్తారా?

– మంత్రి అమర్‌నాథ్

- వివరాలు 2లో

నేడే 'రైతు భరోసా'

- అన్నదాతకు వరుసగా నాలుగో ఏడాది రెండో విడత సాయం
- ఆళ్లగడ్డలో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్
- 50.92 లక్షల మంది రైతన్నలకు రూ.2,096.04 కోట్లు
- ధాన్యం కోతలు, రబీ అవసరాలు తీర్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు
- తాజా సాయంతో కలిపితే ఇప్పటివరకు ఒక్క భరోసా ద్వారానే రైతన్నలకు రూ.25,971.33 కోట్ల మేర లబ్ధి

సాక్షి, అమరావతి: వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం రెండో విడతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అమలు చేయనున్నారు. నంద్యాల



జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించే సభలో ఒక్కొక్కరికి రూ.4,000 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50.92 లక్షల మంది రైతన్నలకు రూ.2,096.04 కోట్ల రైతు భరోసా సాయాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సందర్భంగా వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే

మిగతా 11వ పేజీలో ▶

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

- ఒకే రాజధానితో మళ్లీ ప్రాంతీయ అసమానతలు
- అమరావతి అంతా అవినీతి పుట్ట.. వెంకయ్య, రామోజీ సూత్రధారులు
- అధికారం పోయిందనే అక్కసుతో చంద్రబాబు ఆటంకాలు.. రూ.లక్ష కోట్లు ఒకేచోట వెచ్చిస్తే మిగిలిన ప్రాంతాల గతేంటి?
- పాలన వికేంద్రీకరణపై విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం 3లో


విజయవాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయబాబు

కర్నూలును న్యాయ రాజధాని చేయాలి


వికేంద్రీకరణకు కర్నూలు రౌండ్‌టేబుల్ సమావేశం మద్దతు 3లో



వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

- ఈనెల 19, 20, 21 తేదీల్లో వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని వైద్య శాఖ నిర్ణయం.. షెడ్యూల్ విడుదల చేసిన డీఎంఈ, ఏపీవీవీపీ
- డీఎంఈలో 300కు పైగా, ఏపీవీవీపీలో 100కు పైగా పోస్టుల భర్తీకి చర్యలు
- వైద్య శాఖలో గత మూడేళ్లలో 40వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టిన వైఎస్ జగన్ సర్కార్ 5లో

కొనసాగుతున్న కుండపోత వర్షాలు


సాగర్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

- పల్నాడు, గుంటూరు, బాపట్ల, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో భారీగా..
- ప్రకాశం బ్యారేజీ వద్ద భారీగా వరద
- ఇక్కడ నుంచి ఈ సీజన్‌లో మొత్తం 1,035.768 టీఎంసీలు కదలిపాలు

- వివరాలు 5లో

క్లుప్తంగా

పవన్‌కు చంద్రబాబు ఫోన్

సాక్షి, అమరావతి : విశాఖ పర్యటనలో ఉన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు ఆదివారం ఫోన్‌చేశారు. పోలీసుల ఆంక్షలు, ప్రభుత్వ వైఖరిపై పవన్‌తో చంద్రబాబు మాట్లాడినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. పోలీసుల నోటీసు, జనసేన కార్యకర్తల అరెస్టుల గురించి చంద్రబాబుకు పవన్ వివరించారు. మరోవైపు.. అక్రమ అరెస్టులు, కేసులను చంద్రబాబు ట్విట్టర్‌లో ఖండించారు. పవన్‌కు పోలీసులు నోటీసులివ్వడం సరికాదని, జనవాణిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ సర్కార్ రాజ్యమేలుతోందని, ప్రతిపక్షాల కార్యక్రమాలకు అడ్డుపడటం, వ్యక్తిగత దూషణలు అప్రజాస్వామికమని చంద్రబాబు జగన్ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ప్రతిపక్షాల కార్యక్రమాలను అడ్డుకునే హక్కు ప్రభుత్వానికి లేదని, అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని విడుదల చేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

నొవాటెల్ వద్ద రోజంతా హడావిడి

విశాఖవాసుల నిరసనతో పవన్ హోటల్‌కే పరిమితం

ఆరిలోవ/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ బీచ్ రోడ్డులోని నొవాటెల్ హోటల్ వద్ద ఆదివారం రోజంతా హడావిడి నెలకొంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం రాత్రి 10 గంటలకు ఈ హోటల్‌కు చేరుకొన్నారు. అదేరోజు విమానాశ్రయంలో మంత్రులపై దాడి చేసిన జన సైనికులు సైతం ఈ హోటల్‌లోనే ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చారు. హోటల్ ఆరో ఫ్లోర్‌లో పవన్ బస చేశారు. అదే ఫ్లోర్‌లో వేర్వేరు గదుల్లో ఉన్న 14 మంది నాయకులను అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ముగ్గురు పోలీస్ అధికారుల బృందం మళ్లీ హోటల్ వద్దకు చేరుకొని పవన్ కల్యాణ్‌తో మాట్లాడారు. అరెస్ట్ చేసిన వారందరినీ విడుదల చేయాలని ఈ సందర్భంగా పవన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత జనవాణి కార్యక్రమానికి బయలు దేరబోతుండగా.. వికేంద్రీకరణకు మద్దతుగా పెద్ద సంఖ్యలో విశాఖ వాసులు హోటల్ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. దీంతో పవన్.. ఆ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఏసీపీ హర్షిత పవన్‌కు నోటీస్ 30ని అందించారు. ఈ నేపథ్యంలో పవన్‌ను హోటల్లోనే దిగ్బంధించారని భావించిన కార్యకర్తలు.. పెద్ద సంఖ్యలో హోటల్ వద్దకు చేరుకొని హడావిడి చేశారు. దీంతో పవన్.. తన గదిలోంచి బయటకు వచ్చి వారికి అభివాదం చేసి లోపలికెళ్లారు. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, జనసేన నేతలు పవన్‌తో సమావేశమయ్యారు.

ఘటనతో నాకు సంబంధం లేదు

పోలీసుల నోటీసుకు పవన్ సమాధానం

సాక్షి, విశాఖపట్నం : పోలీసు యాక్ట్–30 అమల్లో ఉన్నా శనివారం విశాఖ విమానాశ్రయం నుంచి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంపై ఆదివారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు విశాఖ పోలీసులు నోటీసులిచ్చారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించ కూడదని, ఎవరైనా సరే ముందస్తు అనుమతి తీసుకోవాలని విశాఖ తూర్పు ఏసీపీ హర్షిత చంద్రన్ ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. మీ నాయకత్వంలోని జనసేన మద్దతుదారులు మంత్రులపై దాడులు చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించారని పేర్కొన్నారు. దీనిపై పవన్ స్పందిస్తూ 'మీ నోటీసులను నేను అంగీకరిస్తున్నాను. అయితే, విమానాశ్రయంలో సంఘటనతో నాకు సంబంధం లేదు' అని స్వదస్తూరితో సమాధానం ఇచ్చారు. ఇదే ఘటనలో పోలీసులు అదుపులోకి తీసుకున్న, కేసులు పెట్టిన తమ వారిని వదిలి పెట్టాలని, అప్పటి వరకు తాను విశాఖ వదలనని పవన్ స్పష్టం చేయడం పట్ల జనం విస్తుపోతున్నారు. 'విమానాశ్రయంలో జరిగిన ఘటనతో నిజంగా పవన్‌కు సంబంధం లేకపోతే.. అందుకు కారకులపై కేసులు పెడితే ఆయన ఎందుకు స్పందించాలి? మంత్రుల కార్లపై దాడి జరిగినందున పోలీసుల చర్యలుంటాయి. ఇది తెలిసి కూడా వాళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేయడం చూస్తుంటే పవన్ అంతర్యమేంటో ఇట్టే తెలుస్తోంది' అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

వారంతా చరిత్ర హీనులు

- ఎవరైతే రాజధాని వద్దంటున్నారో వాళ్లకు గర్జన కనువిప్పు కావాలి
- ఉత్తరాంధ్ర మనోభావాలు దెబ్బతీస్తున్న టీడీపీ, జనసేన, ఎల్లో మీడియా
- ఉత్తరాంధ్రవాసులు ఇంకా థర్డ్ క్లాస్ ప్రజలుగానే బతకాలా?
- జనసేన అసలు పార్టీయే కాదు.. అది సెలబ్రిటీ సంస్థ
- నిప్పులు చెరిగిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర ప్రాంతంలో పుట్టి, విశాఖ రాజధాని వద్దన్న ప్రతి ఒక్కరూ చరిత్ర హీనులుగా మిగిలి పోతారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ ప్రజలు మూడు రాజధానులను కోరుకోవడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లందరికీ విజయవంతమైన విశాఖ గర్జనే కనువిప్పు కలిగిస్తుందని చెప్పారు. అలాంటి వారు ఇప్పటికైనా మనసు మార్చుకోవాలన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజలు చేస్తున్న సూచన.. హెచ్చరిక అని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విశాఖ గర్జన విజయోత్సవ సభలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జోరున వర్షం కురుస్తున్నా ఏ ఒక్కరూ చెక్కుచెదరకుండా ర్యాలీలో భాగస్వాములయ్యారని కొనియాడారు. ఉత్తరాంధ్రలోని మేధావులు, అన్ని వ్యవస్థలు, సంస్థలు ర్యాలీలో పాల్గొన్నాయని తెలిపారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు క్షుద్ర రాజకీయాలు చేస్తూ.. విశాఖ ప్రజల ఆకాంక్షలను దెబ్బ తీస్తున్నాయని మండిపడ్డారు. వారి ఎల్లో మీడియా సంస్థలు కూడా తప్పుడు రాతలు రాస్తూ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీస్తున్నాయని ధ్వజమెత్తారు. తిమ్మిని బమ్మిని చేసే మీ ఆటలు ఇక సాగవని స్పష్టం చేశారు. మంత్రి బొత్స ఇంకా ఏమన్నారంటే..

ఎల్లో మీడియా బ్యాలెట్ నిర్వహించుకోవచ్చు..

- విశాఖకు రాజధాని కావాలా? వద్దా? అని ప్రతి ఇంటికి వెళ్లి అడిగితే నిజాలు తెలుస్తాయి. అవసరమైతే ఎల్లో మీడియా బ్యాలట్ నిర్వహిస్తే బావుంటుంది. చంద్రబాబు తాను సీఎంగా ఉన్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదు.. మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే సహించలేకపోతున్నాడు.
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రాజకీయ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలే లేవు. ఆయన పార్టీకీ ఒక లక్ష్యం లేదు. సిద్ధాంతాలూ లేవు. అసలు అది రాజకీయ పార్టీనే కాదు. కేవలం ఒక సెలబ్రిటీకి చెందిన సంస్థ. రైతుల ముసుగులో 'అమరావతి–అరసవిల్లి' పేరుతో నిర్వహించే పాదయాత్ర రియల్ ఎస్టేట్ యాత్ర. యాత్ర చేస్తున్న వారంతా నారా హమారా.. అంటున్నారు.
- ఈ ప్రాంతంలో పుట్టిన టీడీపీ నేతలు విశాఖ రాజధాని వద్దంటూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం ఎంత వరకు సబబు? ఇప్పటికైనా ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు మనసు మార్చుకుని మూడు రాజధానులకు మద్దతు పలకాలి. లేదంటే రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు.

తక్కువ వ్యయంతో విశాఖ అద్భుత రాజధాని

- విశాఖ ఒక ఆదాయ వనరు. భవిష్యత్తులో ప్రభుత్వాలకు స్థిరమైన బడ్జెట్‌ను అందించే ప్రాంతం. కొద్దిపాటి వ్యయంతో విశాఖను సుందర రాజధానిగా చేసుకోవచ్చు. విశాఖను కాదని లక్షల కోట్ల రూపాయలను అమరావతిలో పోయాలా? దాని వల్ల చంద్రబాబు నాయుడు, అతని అనుచరులు ఆస్తులు పెంచుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకోవాలా? ఉత్తరాంధ్ర వాసులు ఇంకా థర్డ్ గ్రేడ్ ప్రజల గానే ఉండిపోవాలా?
- మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. అందులో భాగమే మూడు రాజధానులు విధానం. త్వరలో విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధానిగా ముఖ్యమంత్రి పాలనందించాలని కోరుకుంటున్నాను.

తాగుబోతు అయ్యన్నా.. తీరు మార్చుకో

- నీది సైకో పద్ధతి.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు
- సీఎంపై దుర్భాషలు సరికాదు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మండిపాటు



సాక్షి, విశాఖపట్నం : 'తాగుబోతు అయ్యన్నా.. నీ తీరు మార్చుకో.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడడం నేర్చుకో.. మా సహనాన్ని అలుసుగా తీసుకుంటున్నావ్.. నీ సైకో పద్ధతి మార్చుకో.. లేదంటే వీధుల్లో ప్రజలు నిన్ను తరమికొడతారు' అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హెచ్చరించారు. పరిపాలన దక్షత కలిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. ఆదివారం సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో మీరు ఎలాగూ గెలవలేరు.. కనీసం గౌరవం నిలబెట్టుకోండి.. 30 ఏళ్ల పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడిగా భావితరాలకు ఎలాంటి మెసేజ్ ఇస్తున్నావు? రాష్ట్ర ప్రజలు నీ మాటలను అసహ్యించుకుంటున్నారు.. ఇకనైనా పద్ధతి మార్చుకుంటే మంచిది' అని హితవు పలికారు. డిప్యూటీ సీఎం ఇంకా ఏమన్నారంటే..

మందు తాగకుండా మాట్లాడగలవా?

- ఉత్తరాంధ్ర ప్రాంతంలో పుట్టి, అదే ప్రాంతంలో విశాఖ రాజధాని వద్దని టీడీపీ రౌండ్ టేబుల్ సమావేశం పెట్టడమే తప్పు. ఆ సమావేశంలో మద్యం మత్తులో నువ్వు పిచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలడం మరింత తప్పు. ఇప్పటికైనా తీరు మార్చుకో.
- మందు తాగకుండా ప్రెస్‌మీట్‌లో మాట్లాడలేని నువ్వు.. మంత్రిగా ఉన్నప్పుడు తన సొంత నియోజకవర్గానికే ఏమి చేయలేని నువ్వు.. ఇష్టారాజ్యంగా మాట్లాడటం మాత్రమే వచ్చిన నువ్వు ప్రజల్లో ఇప్పటికే చులకన అయ్యావు. మా పార్టీ కార్యకర్తలు, మేము చాలా సహనంతో మాట్లాడుతున్నామని అలుసుగా తీసుకుంటే ఫలితం తీవ్రంగా ఉంటుంది. నీ ప్రవర్తన, నీ మాట తీరు మార్చుకో. లేదంటే ప్రజలే నిన్ను తరిమికొడతారు. నీ ప్రవర్తన చూసి మీ ఇంట్లో కుటుంబ సభ్యులే బాధ పడుతున్నారు.

నర్సీపట్నంకు ఏమి చేశావు?

- నువ్వు మంత్రిగా, ఎంపీగా పని చేశావు.. మీ ప్రభుత్వంలో నర్సీపట్నం నియోజకవర్గానికి ఏమి చేశావో ప్రజలకు చెప్పాలి. చంద్రబాబు డైరెక్షన్‌లోనే నువ్వు మాట్లాడుతున్నావు. మీ చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీలో మాట్లాడమని చెప్పు. నీకు టికెట్ ఇచ్చిన ఎన్టీఆర్‌నే చంద్రబాబుతో కలిసి వెన్నుపోటు పొడవలేదా? నర్సీపట్నంలో యువకుడిపై ఓడిపోయావు. అయినా నీ తీరులో మార్పు రాలేదు.
- మా నాయకుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడారు. ప్రశ్నించారు. సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వాటిని అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే అమలు చేశారు. అవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలు.
- చంద్రబాబు ఏది తినమంటే అది తినే వ్యక్తివి నువ్వు. పిచ్చి ఆస్పత్రిలో చేర్పితే తప్ప మారవు. జగన్ ప్రజలు కోరుకున్న సుపరిపాలన అందించడం చూసి మీకు మతులు భ్రమిస్తున్నాయి. సీఎం సంక్షేమ పథకాలకు తట్టుకోలేక టీడీపీ దుష్ట ప్రేలాపనలకు పాల్పడుతోంది. చంద్రబాబుకు అసెంబ్లీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం లేదు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకే అసెంబ్లీకి చంద్రబాబు రావడం లేదు. అయ్యన్నా.. మీ నాయకుడ్ని అసెంబ్లీకి రమ్మని చెప్పు. ప్రజా సమస్యలపై అక్కడ మాట్లాడుకుందాం.

మూడు పెళ్లిళ్లే జనసేన విధానం!

- మూడు రాజధానులు మా విధానం
- జనసేన కాదు.. బాబుసేన అని పేరు మార్చుకోండి
- దాడులు చేస్తే కేసులు పెట్టక సత్కరిస్తారా?
- నీ వెనుక వచ్చే వారెవరూ నీకు ఓట్లెయ్యరు
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం : మూడు రాజధానులు మా పార్టీ విధానమైతే.. పవన్ కల్యాణ్‌ది మూడు పెళ్లిళ్ల (ఇప్పటికి) విధానమని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పెళ్లి చేసుకున్న చోటల్లా రాజధాని పెట్టమంటారా? అని పవన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పవన్ కల్యాణ్‌కు సంస్కృతి, సంప్రదాయాలు తెలియవని, ఒకవిధంగా ఆలోచిస్తే ప్రతి ఒక్కరినీ మూడు పెళ్లిళ్లు చేసుకోవాలని సలహా ఇస్తాడేమోనని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ వంటి ఉగ్రవాదులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విశాఖలోని ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. మూడు రాజధానులకు మద్దతుగా జేఏసీ చేపట్టిన విశాఖ గర్జన ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేందుకే పవన్ కల్యాణ్ విశాఖ వస్తున్నాడని నాలుగు రోజుల క్రితమే చెప్పానని, ఆ విధంగానే ఆయన విశాఖలో దిగగానే ఆ పార్టీకి చెందిన సైకోలు తమ పార్టీ నేతలపై దాడులకు దిగారన్నారు. చంద్రబాబు నాయుడు బాణి వినిపించడానికే.. జనవాణి పేరుతో పవన్ కల్యాణ్ విశాఖ వచ్చాడని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గడాఫీతో పోల్చడం దారుణం అని మండిపడ్డారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

బాబు కోసం ఏర్పడిన పార్టీ జనసేన

- ప్యాకేజీ స్టార్ అనే పదానికి అర్థం ఏమిటో విశాఖ ప్రజలకు పవన్ కల్యాణ్ బాగా అర్థం అయ్యేలా చెప్పాడు. శనివారం ఉదయం ఉత్తరాంధ్ర జేఏసీ సభ ఉంటే.. సాయంత్రం దానిని నేను డైవర్ట్ చేస్తానని చంద్రబాబు తరఫున పవన్ కల్యాణ్ రెడీ అయ్యాడు. తన విశాఖ పర్యటనను మూడు నెలల క్రితమే నిర్ణయించుకున్నానని చెప్పటం సిగ్గు చేటు.
- చంద్రబాబు చేత, చంద్రబాబు వల్ల, చంద్రబాబు కోసం ఏర్పడిన పార్టీ జనసేన. దీనికి బాబు సేన అని పేరు పెడితే బాగుంటుంది. ఉత్తరాంధ్రకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని, మంత్రుల్ని ఈనాడు పత్రిక టార్గెట్ చేయటం, ఉత్తరాంధ్రలో ప్రైవేటు వ్యక్తుల భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం మీద నెట్టటానికి టీడీపీ, ఎల్లో మీడియా, దానితోపాటు జనసేన, ఇతర పార్టీలు ప్రయత్నం చేయటం.. ఇదంతా ఒక పథకం ప్రకారం జరుగుతోంది.

యాంటీ సోషల్ ఎలిమెంట్ ఎవరు?

- మంత్రులపై రాళ్లు వేసిన వారిని అరెస్టు చేస్తే తప్పా? పవన్ కల్యాణ్ మద్దతు మీడియా, ఎల్లో మీడియా, బాబు మీడియా.. ఏం చెప్పింది? జనసేన వారే దాడి చేశారని చెప్పలేదా? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గూండాలు అంటాడు.. ఎవరైనా పవన్ కల్యాణ్‌పై దాడి చేశారా?
- ఒకపక్క బీజేపీతో కాపురం చేస్తూ వారు అమ్మేస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్, బాబు తన పార్ట్‌నర్‌గా ఉండి అమ్మేసిన ప్రత్యేక హోదా.. విశాఖ రైల్వే జోన్.. ఇవన్నీ 'విశాఖ గర్జన' ఉద్యమం రోజునే పవన్‌కు గుర్తుకు రావడం వెనుక డ్రామా ఏంటో అందరికీ తెలుసు.
- తుపాకీతో కాల్చాలన్న కోరిక ఉన్నవాడిని.. ప్రతి ప్రెస్‌మీట్‌లోనూ బెదిరించే వాడిని.. సోషల్ ఎలిమెంట్ అంటారా? యాంటీ సోషల్ ఎలిమెంట్ అంటారా? జనసేన కార్యకర్తలు హత్యాయత్నం చేసిన విషయాన్ని ఎల్లో మీడియానే నిన్న వీరగాథ అన్నట్టు చూపింది. అది నిజం అయినప్పుడు.. 307 సెక్షన్ కింద పోలీసులు కేసులు పెట్టక శాలువాలు కప్పి, సన్మానాలు చేస్తారా?

3 నెలల కిందటే టికెట్ బుక్ చేసుకున్నావా?

- పవన్ కల్యాణ్ విజ్ఞత కలిగిన నాయకుడే అయితే, శనివారం ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఘటనకు, తమ కార్యకర్తలు, నాయకులే బాధ్యులు అని హుందాగా ఒప్పుకునే వారు. పవన్‌కు ఆ హుందాతనం లేకపోగా, ఆ దాడులు తమకు తామే చేయించుకున్నామని ఆరోపణలు చేయడం శోచనీయం.
- పవన్ దత్త తండ్రి చంద్రబాబు నాయుడు కూడా ఎయిర్ పోర్టులో జరిగిన ఘటనను ఖండించాల్సింది పోయి.. దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టడాన్ని తప్పు పట్టడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. తాను విశాఖ పర్యటన కార్యక్రమాన్ని మూడు నెలల కిందటే ఖరారు చేసుకున్నానని పవన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రెండు నెలల కిందటే జనవాణి కార్యక్రమాన్ని ప్రారంభించిన పవన్.. మూడు నెలల క్రితమే టికెట్ ఎలా బుక్ చేసుకుంటారు?
- విశాఖ గర్జన కార్యక్రమాన్ని పక్కదోవ పట్టించేందుకు, ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడిచేందుకే పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన పెట్టుకున్నాడు. ఉత్తరాంధ్ర ప్రజలపై తమ పార్టీ సైకోలను ఉసిగొలిపిన పవన్ ఒక రాజకీయ ఉగ్రవాది. తనవెంట వచ్చే వారంతా తనకు ఓట్లు వేస్తారనే భ్రమలో ఉన్నాడు. సెలబ్రిటీలను చూసేందుకు వచ్చిన వారంతా ఓట్లేస్తే ఈ పాటికి ఎంతో మంది సినిమా నటులు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించే వారు.

ఇది ఆరంభం మాత్రమే

- విశాఖ గర్జనకు హాజరైన వారందరికీ కృతజ్ఞతలు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తాం
- మా మంచితనాన్ని అమాయకత్వంగా భావిస్తే పొరపాటే
- ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, జేఏసీ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: మూడు రాజధానుల ఉద్యమం అంతం కాదని.. ఆరంభం మాత్రమే అని ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ అన్నారు. విశాఖ గర్జన విజయవంతం చేసిన ఉత్తరాంధ్ర జిల్లాల ఉద్యమకారులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై జేఏసీ కమిటీతో చర్చిస్తామన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రైవేట్ హోటల్లో ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విశాఖ గర్జన' విజయోత్సవ సభలో మాట్లాడారు. 'అమరావతి ప్రజలంటే మాకు కోపం లేదు.. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు బావుండాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు, ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నప్పుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు.. ఏనాడూ మాకు రాజధాని కావాలని డిమాండ్ చేయలేదు. అన్నింటికీ తల ఊపుతూనే వచ్చాం. ఇకపై కూడా అన్యాయం జరుగుతుంటే అలానే తల ఊపుతూ కూర్చోలేం. మా మంచితనాన్ని అమాయకత్వమనుకుంటే పొరపాటే' అని హెచ్చరించారు.

వికేంద్రీకరణను అందరూ స్వాగతించాలి

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అత్యంత వెనకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర అని, విశాఖను పరిపాలన రాజధాని చేసి పేదరికంలో ఉన్న తమ బతుకులు మారుస్తామంటే అభినందించాల్సింది పోయి అడ్డుకోవడం దారుణం అని టీడీపీ, జనసేన వైఖరిపై అజపతిరాయ్ మండిపడ్డారు. అమరావతి–అరసవల్లి యాత్ర ద్వారా మా ప్రాంతంలో మా దేవుని దగ్గరకి వచ్చి మా ప్రాంతంలో రాజధాని వద్దని మా నోట్లో మట్టి కొడతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జేఏసీ సభ్యులు, ఉత్తరాంధ్ర జేఏసీ సభ్యులు ప్రొఫెసర్ విజయకుమార్, కొల్లూరి సూర్యనారాయణ, పాల్, బాల మోహన్‌దాస్, షరన్ రాజ్, ఎస్ఎస్ శివశంకర్, డాక్టర్ పి.రామారావు, పైలా కృష్ణమోహన్, దువ్వాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం
- ప్యాకేజీకి అమ్ముడుపోయి విశాఖలో అలజడికి కుట్ర
- చంద్రబాబు వాణి విన్పించడానికే విశాఖలో జనవాణి
- ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు దెబ్బ తీస్తారా?
- మంత్రులు, ఎమ్మెల్యేలపై జనసేన కార్యకర్తలతో దాడులు చేయిస్తారా? ఇదేనా నీ సంస్కృతి?



సాక్షి, అమరావతి : విశాఖపట్నంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు డైరెక్షన్‌లో అలజడి రేపి అశాంతి నగరంగా మార్చేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ యాక్షన్ చేస్తున్నారని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేయాలని, అప్పుడే ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని రాజకీయాలకు అతీతంగా ఉత్తరాంధ్ర ప్రజలు శనివారం గర్జించారని.. లక్షలాది మంది ప్రజలు గర్జనలో పాల్గొన్నారని చెప్పారు. తాను, తన బినామీలు భూములు కొన్న అమరావతి 29 గ్రామాల్లోనే అభివృద్ధి కేంద్రీకృతం కావాలనే స్వార్థంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను, మనోభావాలను అవహేళన చేస్తూ శనివారమే విశాఖలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారన్నారు. టీడీపీకి మూడు రోజులు కాల్షీట్లు అమ్ముకున్న ప్యాకేజీ స్టార్ పవన్.. చంద్రబాబు కనుసైగల మేరకు జనవాణి పేరుతో బాబు వాణి విన్పించడానికి శనివారమే విశాఖకు చేరుకున్నారని చెప్పారు. మంత్రి అంబటి ఇంకా ఏమన్నారంటే..

అసాంఘిక శక్తులను సన్మానిస్తారా?

- విశాఖ గర్జనలో పాల్గొని సొంతూళ్లకు వెళ్లేందుకు విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులు రోజా, రజిని, జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలపై జనసేన కార్యకర్తలు దాడులకు పాల్పడటం ద్వారా అలజడి రేపారు.
- ఇదేనా నీ సంస్కృతి? నిజానికి అదే మీ వైఖరి. గతంలో రివాల్వర్ పట్టుకుని డెక్కన్ క్రానికల్ ఆఫీస్ వద్ద హల్చల్ చేసిన నీకు అంత కంటే సంస్కారం ఉంటుందా? నువ్వే అలా ఉంటే, నీ కార్యకర్తలు ఇంకా ఎలా ఉంటారు? విమానాశ్రయం నుంచి నోవాటెల్ హోటల్ వరకూ ర్యాలీ నిర్వహిస్తానని పవన్‌కళ్యాణ్ పట్టుబట్టడం నిజం కాదా? దారిలో ఎవరైనా ఒకరు తనపై రాయి విసిరితే దాన్ని తమపై నెట్టాలనే కుట్రే కదా ఇది?
- ఆదివారం పవన్ కళ్యాణ్ ఉంటున్న నోవాటెల్ వద్ద జనసేన కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తూ.. బీచ్‌ల వద్దకు వెళ్లిన పర్యాటకులను భయభ్రాంతులకు గురి చేశారు. మంత్రులు, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యేలపై దాడులు చేసిన జనసేన కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయకుండా సన్మానిస్తారా? తన వ్యూహం ప్రకారం విశాఖపట్నంలో అలజడి సృష్టించిన జనసేన కార్యకర్తలను చంద్రబాబు సన్మానిస్తారు. నీకైతే ఆర్థిక సన్మానం కూడా చేస్తారు.

దాడులకు చంద్రబాబు, పవన్‌లదే బాధ్యత

- అసాంఘిక శక్తులకు నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు, పవన్‌లే ఈ దాడులకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. జనసేన అసాంఘిక సేనగా మారింది. చంద్రబాబు బానిసలా పవన్ పని చేస్తున్నారు. హింసను ప్రేరేపించే ఏ రాజకీయ పార్టీ కూడా బతికి బట్టకట్టిన దాఖలాలు లేవు. అందుకే చంద్రబాబు జనసేనను ముందు పెట్టి అలజడి సృష్టిస్తున్నారనే అంశాన్ని పవన్ గుర్తు పెట్టుకోవాలి. ఇప్పటికైనా జనసేన కార్యకర్తలను అదుపులో పెట్టాలి. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.
- విశాఖపై దాడి చేయడానికి ఒళ్లు బలిసిన అలగా జనాన్ని అమరావతి నుంచి అరసవల్లి వరకూ పాదయాత్ర పేరుతో చంద్రబాబు పురిగొల్పారు. ఇప్పుడు ప్యాకేజ్ ఇచ్చి పవన్ కళ్యాణ్‌ను విశాఖపై దాడికి పంపారు.

అమరావతికే మా మద్దతు

- గర్జన కంటే ముందే జనవాణి ప్రకటించాం: పవన్ కళ్యాణ్
- జనం కోసం జైలుకైనా వెళ్తా



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు అవసరం లేదని, ముందు నుంచీ తాము అమరావతికే మద్దతిస్తున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆదివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ గర్జన కార్యక్రమాన్ని ప్రకటించక ముందే తాము జనవాణి షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి హోటల్‌కు వస్తుండగా ప్రజలకు అభివాదం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఓ ఐపీఎస్ అధికారి తన కారెక్కి లోపల కూర్చోవాలని చెప్పడం చాలా ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. తమ పార్టీ ఏం చేయాలో కూడా వైఎస్సార్‌సీపీ చెబుతుందా? అని ప్రశ్నించారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించినా తాను గౌరవంగా వ్యవహరించానని చెప్పారు. వంద మందికిపైగా జనసేన నాయకులను అరెస్ట్ చేసి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం దారుణమన్నారు. వారిని విడిచిపెట్టే వరకు జనవాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. ప్రజల కోసం అవసరమైతే జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమన్నారు. విశాఖ ఎయిర్ పోర్టులో మంత్రులపై దాడి గురించి నిజానిజాలు తెలియాలన్నారు. మంత్రులకు సరైన భద్రత లేకపోవటం పలు అనుమానాలు కలిగిస్తోందన్నారు. కోడి కత్తిలా ఇది కూడా ఒక ప్లాన్‌లా అనిపిస్తుందన్నారు. తనకు మూడు పెళ్లిళ్లు అయ్యాయని పదేపదే విమర్శించే వారికి అంత ఈర్ష్య ఎందుకని ప్రశ్నించారు. వారు కూడా విడాకులిచ్చి పెళ్లిళ్లు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నాగబాబు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కాగా విశాఖలో ఈ నెల 31 తేదీ వరకు ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నోటీసు అందించారు. దీనిపై పవన్ కల్యాణ్ సంతకం చేసి తిరిగి పోలీసులకు అందజేశారు.

పవన్.. గో బ్యాక్



ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సిగ్నల్ వద్ద మానవహారంగా ఏర్పడిన స్థానికులు



రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

▶ మొదటి పేజీ తరువాయి

పెద్ద ఎత్తున చేరుకున్న స్థానిక మహిళలు, నాన్ పొలిటికల్ జేఏసీ మద్దతుదారులు, వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్‌కు విశాఖలో అడుగుపెట్టే అర్హతలేదని నినదించారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారటంతో పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అయినా నిరసనకారులు అక్కడికి వస్తూనే ఉండటంతో.. పరిస్థితి అనుకూలంగా లేదని భావించిన పవన్ కల్యాణ్.. తన జనవాణి కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. ఒక దశలో విశాఖ నుంచి తిరిగి వెళ్లిపోవటానికి సిద్ధమై.. మళ్లీ అంతలోనే మనసు మార్చుకున్నారు.

విశాఖ గర్జనను పక్కదారి పట్టించాలని..

విశాఖ గర్జన విజయవంతం అయిన నేపథ్యంలో.. తమ ప్రాంతంలో తమకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని ఎలా చేపడతారంటూ ఆదివారం జనవాణి కార్యక్రమం నిర్వహించతలపెట్టిన పోర్టు స్టేడియం వద్దకు ప్రజలు భారీగా తరలివచ్చారు. 'ఉత్తరాంధ్ర ద్రోహి.. పవన్ కల్యాణ్ గో బ్యాక్..' అంటూ నినదించారు. ఉత్తరాంధ్రకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా, నిరసన సెగ తప్పదని స్పష్టం చేశారు. వీరికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా తోడయ్యాయి. ఉత్తరాంధ్ర జేఏసీ నేతలతో పాటు విశాఖ ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కేకే రాజు నేతృత్వంలో పలువురు నేతలు భారీగా అక్కడికి చేరుకుని నినాదాలు చేశారు. ఫలితంగా తమ పార్టీ నేతలపై పెట్టిన కేసులను నిరసిస్తూ జనవాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు పవన్ కల్యాణ్ ప్రకటించారు. తమ కార్యకర్తలు బయటకు వచ్చే వరకూ విశాఖ వదిలి వెళ్లనని నోవాటెల్ హోటల్‌లోనే ఉండిపోయారు. ఈ పరిణామాలన్నీ గమనిస్తున్న ఉత్తరాంధ్ర ప్రజలు.. వికేంద్రీకరణకు జనసేన పూర్తిగా వ్యతిరేకమని, విశాఖ పరిపాలన రాజధాని కావడం ఏ మాత్రం ఇష్టం లేదని మరోసారి ప్రత్యక్షంగా స్పష్టమైందని వ్యాఖ్యానిస్తున్నారు.

క్లుప్తంగా

మూడు రాజధానులకే మాల మహానాడు మద్దతు



మాట్లాడుతున్న గోసా మనోహర్

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి మాల మహానాడు మద్దతు ఇస్తున్నట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ మూడు రాజధానుల నిర్ణయానికి రాయలసీమ ప్రాంతం నుంచి తాము సంఘీభావం తెలియజేస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్రలో వైజాగ్ చాలా కీలకమైన నగరమని, రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తే దేశంలోని పెద్ద రాజధానులతో పోటీ పడగలదని చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీలు అమరావతిలో రాజధాని కట్టాలనుకోవడం మూర్ఖపు చర్యగా అభివర్ణించారు. చంద్రబాబు చెప్పినట్టుగా పవన్ నటిస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో విద్వేషాలు రెచ్చగొట్టే పనిలో వారున్నారని చెప్పారు.

అమరావతి ఉద్యమానికే మద్దతు ఇస్తాం

- మూడు రాజధానులు వద్దు
- కమ్మ మహాజన సంఘం తీర్మానం




మాట్లాడుతున్న బెజవాడ వెంకట్రావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ) : అమరావతి ఉద్యమానికే తమ మద్దతని, మూడు రాజధానులకు తాము వ్యతిరేకమని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం ఆత్మీయ సమావేశంలో తీర్మానించారు. కమ్మ మహాజన సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం కాకినాడలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి కమ్మ సామాజికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు యథాతథంగా ఉంచాలని, అమరావతి రైతు పాదయాత్రకు సంఘీభావం తెలియజేయాలని కూడా తీర్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ సామాజికవర్గం అనేక సంస్థలను స్థాపించి ప్రభుత్వానికి రూ.కోట్లలో పన్నులు కడుతోందని చెప్పారు. ఈనాడు రామోజీ రావు, అమర్‌రాజా సంస్థల ద్వారా గల్లా రామచంద్రనాయుడు వంటివారు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తోళ్ల పరిశ్రమ పితామహుడు యలవర్తి నాయుడమ్మ తమ సామాజికవర్గం వారేనని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామన్నారు. సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు చంద్రు గోవింద రాజు, రాష్ట్ర సమాఖ్య కోశాధికారి కొర్రపాటి రామారావు, కార్యదర్శి వెలక కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బొల్లిన ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మంత్రులకు పవన్ క్షమాపణ చెప్పాలి

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



మాట్లాడుతున్న డాక్టర్ మారేష్

పటమట (విజయవాడ తూర్పు): బీసీ మంత్రులు జోగి రమేష్, విడదల రజినిపై జనసేన పార్టీ నాయకులు చేసిన దాడిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఖండిస్తోందని, వెంటనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ డిమాండ్ చేశారు. విజయవాడలోని బీసీ సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీసీ మంత్రులకు క్షమాపణ చెప్పకపోతే రాబోయే రోజుల్లో పవన్ కల్యాణ్ పర్యటనను బీసీ సంఘాలు అడ్డుకుంటాయని హెచ్చరించారు. బీసీ సంఘ ప్రచార కమిటీ చైర్మన్ జక్కా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీసీ మంత్రులపై జరిగిన దాడి జనసేన పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి మాట్లాడుతూ బీసీ మహిళా మంత్రిపై అల్లరి మూకలు దాడులకు పాల్పడడం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని చెప్పారు.

మంత్రులపై జనసేన కార్యకర్తల దాడులు హేయం

ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కోర్ల నారాయణ ధ్వజం

సాక్షి, అమరావతి: జనసేన కార్యకర్తలు రాజకీయ దురుద్దేశంతో రాష్ట్ర మంత్రులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కోర్ల నారాయణ ముదిరాజ్ ధ్వజమెత్తారు. బీసీ మహిళ రాజకీయ ఎదుగుదల చూడలేక వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిపై శనివారం విశాఖ విమానాశ్రయంలో దాడి చేయడం శోచనీయమని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమన్నారు. మంత్రి రజినికి అండగా బీసీలు ఉన్నారని పేర్కొన్నారు.

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ విజయబాబు

సాక్షి, అమరావతి: అధికారం దూరమైందనే అక్కసుతో టీడీపీ నాయకులు ప్రజలపై కక్ష పెంచుకుని అడుగడుగునా అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టిస్తున్నారని ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం మండిపడింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 'పాలనా వికేంద్రీకరణ: ప్రచారాలు, వాస్తవాలు' అనే అంశంపై పలువురు న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. చంద్రబాబు బృందం మూడేళ్లుగా అభివృద్ధిని అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. చారిత్రక తప్పిదాలను పునరావృతం చేసేందుకు మీడియాను, న్యాయవ్యవస్థను సైతం ఉపయోగించుకుంటోందన్నారు. అమరావతి పేరుతో దోపిడీ చేయడమే కాకుండా ఇతర ప్రాంతాలు ఎదగకుండా నీచ రాజకీయాలు చేయడం క్షమించరానిదన్నారు. ప్రభుత్వం దృష్టిలో శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు జిల్లాలోని చివరి గ్రామం వరకు ఒక్కటేనని, అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధి జరగాలన్నారు. చంద్రబాబు బృందం ఆయన వర్గ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ రెండు జిల్లాలు మాత్రమే అభివృద్ధి చెందాలని చెబుతోందన్నారు. మరో 30ఏళ్లకు కూడా పూర్తికాని అమరావతి కోసం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చిస్తే మిగతా ప్రాంతాలు ఏం కావాలని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయాక బాబుకు ప్రజలు అధికారం ఇస్తే దుర్వినియోగం చేశారన్నారు.

ప్రజలపై పగబట్టిన బాబు

చంద్రబాబు బృందం తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు అమరావతి రైతులను పావులుగా మార్చేసింది. రైతులను పురిగొల్పి చంద్రబాబు తెరవెనుక ఆనందిస్తున్నారు. అమరావతి ప్రపంచ రాజధాని ఎలా అవుతుంది? భారీ నిర్మాణాలకు ఈ ప్రాంతం అనువుకాదని ఐఐటీ నిపుణులు నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదు. నిర్మాణాల భారం లేకుండా రాజధాని కోసం నాగార్జున వర్సిటీ భవనాలు ఇస్తామన్నా తీసుకోకుండా గడ్డి తినేందుకు అమరావతిని ఎంచుకున్నారు. ఇక్కడ ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగింది. ఇలాంటి తప్పులకు విదేశాల్లో అయితే మరణ శిక్ష విధించేవారు. అధికారం ఊడగొట్టి 23 మంది ఎమ్మెల్యేలకు పరిమితం చేసినా చంద్రబాబులో పశ్చాత్తాపం లేకపోగా ప్రజలపై పగబట్టారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కోర్టులను వాడుకుంటున్నారు. అమరావతి భూములు వ్యవసాయయోగ్యమైనవి, ఇక్కడ ఆ తరహా పరిశ్రమలకే అనుకూలం. చంద్రబాబు ఇప్పటికైనా మారాలి, అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలి.

– పి.విజయబాబు, రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్

మిగతా ప్రాంతాలు ఏం కావాలి?



చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రగతిని బలిపెడుతున్నారు. ఆయనకు వంతపాడుతూ కొన్ని పత్రికలు, మీడియా అమరావతి రైతులను తప్పుదారి పట్టిస్తున్నాయి. ప్రాంతీయ అసమానతల వల్లనే తెలంగాణ విడిపోయింది, అదే తప్పు చంద్రబాబు అమరావతి పేరుతో చేశారు. వికేంద్రీకరణ అవసరమని శివరామకృష్ణ కమిటీ చెప్పినా పట్టించుకోకుండా అమరావతి పేరుతో రూ.వేల కోట్లు వెచ్చించి అన్నీ తాత్కాలిక భవనాలే నిర్మించారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్లారు. రూ.లక్షల కోట్లను అమరావతిలోనే వెచ్చిస్తే రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాలు ఏమైపోవాలి? మూడు రాజధానులతోనే అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుంది. – పిళ్లా రవి, న్యాయవాది

కొత్త రాజధాని నిర్మాణం అసాధ్యం



ఏ దేశంలోనైనా అన్ని విధాలా అభివృద్ధి చెందిన నగరాన్నే రాజధానిగా ఎంచుకుంటారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు అన్నిచోట్లా పెద్ద నగరాలను రాజధానిగా ఎంచుకున్నారు. సృష్టికి ప్రతి సృష్టి చేయాలని కలలు కంటూ చంద్రబాబు అమరావతిని ఎంచుకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటే ఇలాంటి తప్పు ఏ నాయకుడూ చేయరు. రాష్ట్రంలోని మూడు పెద్ద నగరాల్లో అధికార వికేంద్రీకరణ చేయాలి. కొత్త రాజధాని నగరం నిర్మించడం మాటలు కాదు. గుజరాత్ రాజధాని గాంధీనగర్ ఇప్పటికీ ప్రగతి సాధించలేకపోయింది.

– కొణిజేటి రమేష్, పారిశ్రామికవేత్త

రెండు జిల్లాలే ముఖ్యమా?

అభివృద్ధి అంటే భవనాలు, పార్కులు కాదు. సామాన్యుడు తలెత్తుకు తిరిగేలా ఉండాలి. అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చోటు ఇవ్వరట. వారికి స్థానం లేని ప్రాంతం రాజధాని ఎలా అవుతుంది? చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిరుపేదలు, సామాన్యుల హక్కులను దోచుకున్నారు. కేవలం రెండు జిల్లాలు అభివృద్ధి చెందితే చాలా? ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు ఏమైపోవాలి? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలి.

– నామాల కోటేశ్వర్‌రావు, న్యాయవాది

వికేంద్రీకరణ తప్పనిసరి అవసరం



ఎవరైనా ఒకసారి తప్పు జరిగితే దాన్నుంచి గుణపాఠం నేర్చుకుంటారు. పాలకులైతే మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మళ్లీమళ్లీ తప్పులు చేసేవారిని ఏమనాలి? చంద్రబాబు నాయుడు అదే చేస్తున్నారు. అధికారంలో ఉన్నవారు అన్ని ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. ప్రతిపక్ష టీడీపీ అమరావతి మాత్రమే అభివృద్ధి చెందాలని కోరుకుంటోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ రాష్ట్రంలో అంతర్భాగం కాదా? ఆ ప్రాంతాల అభివృద్ధి టీడీపీకి అవసరం లేదా? ప్రభుత్వం తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయాన్ని అడ్డుకుంటూ మరో తప్పు చేస్తున్నారు.

– డాక్టర్ చన్నంశెట్టి చక్రపాణి, రిటైర్డ్ ఎస్పీ

సమగ్రాభివృద్ధికి వెన్నుపోటు



పాలకులు విజ్ఞతతో నిర్ణయాలు తీసుకోవాలి. దేశంలో ఏ రాష్ట్రానికీ లేనన్ని ఆటంకాలను చంద్రబాబు సృష్టిస్తున్నారు. కేంద్రీకృత అభివృద్ధితో తెలుగు ప్రజలు ఏం కోల్పోయారో చరిత్ర చూస్తే అర్థమవుతుంది. చారిత్రక తప్పిదాలను చంద్రబాబు పునరావృతం చేశారు. వాస్తవానికి అమరావతి ప్రజలు ఇక్కడ రాజధాని కావాలని అడగలేదు. చంద్రబాబు తన వర్గం వారితో రైతుల భూములు బలవంతంగా తీసుకున్నారు. సైబర్ టవర్స్ నిర్మాణం సమయంలోనూ బ్లూప్రింట్ తయారీకి ముందే తనవారితో భూములు కొనిపించారు. అదే సూత్రాన్ని ఇక్కడా అమలు చేశారు. నాడు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు, ఈనాడు అధినేత రామోజీరావు దీనికి సూత్రధారులు. అమరావతి అంతా అవినీతిమయం.

– కృష్ణంరాజు, రాజకీయ విశ్లేషకులు

మూడు రాజధానులకే మా మద్దతు

ఏపీ నూర్‌బాషా(దూదేకుల) సంఘం



మాట్లాడుతున్న రసూల్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానులకే తమ మద్దతని రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల) సంఘం ప్రకటించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో స్వర్ణా ప్యాలెస్ హోటల్‌లో ఆదివారం నూర్ బాషా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానులకు మద్దతు తెలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే పరిపాలన వికేంద్రీకరణ జరగాల్సిందేనన్నారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో విభజనవాదం తలెత్తదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాన్ని తమ సంఘం స్వాగతిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్న పథకాలు నూర్‌బాషాలకు అందుతున్నాయని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి షాన్ బాషా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బాదుల్లా, ఉపాధ్యక్షుడు మదీనా, అధికార ప్రతినిధి, గాజుల బాజీ, యూత్ ప్రెసిడెంట్ శ్రీనుబాషా పాల్గొన్నారు.

● తెలంగాణ

పోలీస్‌స్టేషన్‌పై మావోయిస్టుల దాడి

ఏఎస్ఐకి తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయగా ఒక ఏఎస్ఐకి తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ పరిధిలోని తెర్రెం పోలీస్‌స్టేషన్‌పై ఆదివారం రాత్రి మావోయిస్టులు దాడి చేసి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఏఎస్ఐ నడుముకు బుల్లెట్ గాయాలయ్యాయి. స్టేషన్‌లోని ఇతర సిబ్బంది అప్రమత్తం కావడంతో మావోయిస్టులు పారిపోయారు. గాయపడిన ఏఎస్ఐని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనను పోలీసు అధికారులు ధ్రువీకరించలేదు.

వికేంద్రీకరణకు సంపూర్ణ మద్దతు

- కర్నూలులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయం
- కర్నూలును న్యాయ రాజధాని చేయాలని తీర్మానం
- ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావుల హాజరు



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ సంజీవకుమార్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వికేంద్రీకరణకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పలు ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. వికేంద్రీకరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మున్సిఫ్ కోర్టు సమీపంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కర్నూలు నగర అధ్యక్షుడు ఐ.విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పటి వరకు చాలా మంది ముఖ్యమంత్రులు ఒకే ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. చరిత్రలో కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే మళ్లీ విభజన వివాదాలు రాకూడదన్న ఉద్దేశంతో వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని కొన్ని రాజకీయ పార్టీలు మినహా ప్రతి ఒక్కరూ స్వాగతిస్తూ హర్షిస్తున్నారని చెప్పారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు మాజీ సీఎం చంద్రబాబు రాజకీయ కుట్రలు పన్నుతున్నారని, ఇందుకోసం ఎంతకైనా తెగించేందుకు ఆయన సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు ఈ ప్రాంత ప్రజల హక్కు అని స్పష్టంచేశారు. కర్నూలును న్యాయరాజధానిగా చేయాలని తీర్మానించారు. న్యాయరాజధాని సాధన కోసం కరపత్రాలు, పోస్టర్లతో ఇంటింటి ప్రచారం, గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో పాదయాత్రలు, సభలు నిర్వహించాలని నిర్ణయించారు. కర్నూలు, నంద్యాల, ఆదోనిలలో మహాసభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని తీర్మానించారు. అందరూ కలసికట్టుగా ఉద్యమాన్ని సాగించాలన్నారు.

విశాఖ పరిపాలన రాజధానే మా లక్ష్యం

బొబ్బిలి చర్చా వేదికలో స్పష్టం చేసిన వివిధ వర్గాలు



వికేంద్రీకరణకు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, వివిధ వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు

బొబ్బిలి: వికేంద్రీకరణలో భాగంగా విశాఖ పరిపాలన రాజధానే తమ లక్ష్యమని బొబ్బిలి ప్రజలు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని శ్రీ కళాభారతి మునిసిపల్ ఆడిటోరియంలో ఆదివారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా వేదికలో పలువురు మేధావులు, విద్యా, వ్యాపార, న్యాయ, రాజకీయ వర్గాలకు చెందిన వారంతా పాల్గొని సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన వికేంద్రీకరణకు మద్దతు పలికారు. మునిసిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉండాల్సి ఉన్నా.. చంద్రబాబు చేసిన పొరపాట్ల కారణంగా దాన్ని కోల్పోయామని చెప్పారు. దశాబ్దాల నాటి ప్రతిపాదన విశాఖ రాజధాని అవకాశాన్ని ఇప్పుడు జారవిడుచుకోవద్దని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, డాక్టర్ బొత్స కాశినాయుడు, భాస్కరరావు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వివిధ వర్గాల మేధావులు, ప్రజలు పాల్గొన్నారు.


పవన్‌కు నార్కో పరీక్ష చేస్తే నిజాలు కక్కుతారు

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు నార్కో అనాలసిస్ పరీక్ష చేస్తే అసలు నిజాలు కక్కుతారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పవన్ వ్యవహరిస్తున్న తీరును ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తప్పుబట్టారు. పవన్ ఒక రాజకీయ వ్యభిచారి అని విమర్శించారు. ప్యాకేజీ స్టార్‌గా ముద్ర వేసుకున్న పవన్ విశాఖ టూర్ కూడా చంద్రబాబు డైరెక్షన్‌లోనే చేపట్టారని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై దాడి చేసిన జన సైనికులను మందలించి, వారిని మంచి దారిలో నడవాలని చెప్పాల్సిన పవన్ మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దాడికి ఆజ్యం పోసి, హింసను ప్రోత్సహించేలా పవన్ తీరు ఉందన్నారు. చంద్రబాబుతో కలిసి ప్రశాంత విశాఖలో అలజడికి పవన్ కుట్ర చేస్తున్నారని శ్రీనివాసులు ఆరోపించారు.

ఉత్తరాంధ్రకు అన్యాయం చేసేందుకే టీడీపీతో చేతులు కలిపిన పవన్

749వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



దీక్షలో బహుజన జేఏసీ నాయకులు

తాడికొండ : చంద్రబాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని ఉత్తరాంధ్రలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించిన పవన్‌కళ్యాణ్ రాజకీయాలకు అనర్హుడని, ఆ పార్టీని రద్దు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 749వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ తన సీటు కూడా తాను గెలవలేని పవన్.. ఎన్నికల అనంతరం పెయిడ్ ఆర్టిస్టుగా మారి బాబుకు తాబేదారు అవతారమెత్తాడని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేసేందుకు టీడీపీతో చేతులు కలిపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటును తన జీవితంలో భాగంగా చేసుకున్న చంద్రబాబు.. చివరకు పవన్‌కు కూడా ఓ పోటు పొడిచి రాజకీయ సన్యాసిగా మిగల్చడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.



మనకు ఏమీ తెలియదని మాత్రమే మనం తెలుసుకోగలం. అదే మానవ వివేకానికి సంబంధించిన అత్యధిక స్థాయి.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, అక్టోబర్, 17

తెలుగు మాల్గుడి

డెబ్బై ఏళ్ల క్రితం సంగతి. చిన్నారి లోకేశ్వర్‌కు పుట్టు వెంట్రుకలు తీయాలి. ఇంటి ఇలవేల్పు చిల్పూరు 'బుగులు వెంకటేశ్వర స్వామి'. ఈ చిల్పూరు స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పదీ పన్నెండు కిలోమీటర్లు ఉంటుంది. హైదరాబాద్‌లోని షాలిబండలో ఉండే ఆ దిగువ మధ్యతరగతి కుటుంబం ఆ కార్యక్రమం కోసం తెల్లవారుజామున లేచి నాంపల్లి స్టేషన్ చేరుకుని, వరంగల్ చేరి, అక్కడ నుంచి ఎడ్లబండ్లు కట్టుకుని చిల్పూరు చేరడం కథ. మరి మలుపు ఏమిటి? తిరుగు ప్రయాణంలో బండి తోలేవాడితో సహా అందరూ నిద్రపోతే కారుచీకట్లో ఎద్దులు గుడ్డెత్తుగా వెళ్లి సరాసరి దిగుడుబావి అంచున ఆగిపోవడం. అవి అడుగు ముందుకేస్తే అంతే సంగతులు. రచయిత అంటాడు– ఇలా బుగులు పుట్టించి మళ్లీ కాపాడటమే బుగులు వెంకటేశ్వర స్వామి ప్రత్యేకత... ఇలా భక్తులతో పరాచికం ఆడుతాడు కాబట్టే అందరూ ఆయనను బుగులెంకటేశ్వర్లు అంటారు. ఈ కథ చదివినవారు ఈ మొత్తం ప్రయాణంలోని ప్రతి తావునూ గుర్తు పెట్టుకుంటారు. బుగులెంకటేశ్వర్లును కూడా!

'వేసవి కాలం. నిండుపున్నమి కాలం. మా గల్లీలో ప్రతి ఇంటి ముందు జాజురంగుతో పెద్ద పెద్ద అరుగులు. అందరూ అన్నాలు తినంగనే ఇండ్లల్ల గ్యాసు దీపాలు ఆర్పేసి నులక మంచాలు, నవారు మంచాలు, చినిగిన ఈత చాపలు, అతుకుల బొంతల పక్కబట్టలు, షత్రంజీలు తీసుకుని మర చెంబులలో మంచినీళ్ల సౌకర్యం ఏర్పాటు గావించుకుని మా గల్లీల జమయ్యేవారు. పిల్లలం అరుగుల మీద పెద్దలు ముసలోళ్లు మంచాలల్ల, ఎవరింటి ముందు వారు కాళ్లు చాపుకుని, నడుం వాల్చి సెటిల్ అయ్యేవారు'... చదివితే ఏమనిపిస్తుంది? ఆ కాలానికి ఆ తావుకూ వెళ్లాలనిపించదూ?

'బండ అంటే శాలిబండ. చార్మినార్ నుండి అలియాబాద్‌కు పొయ్యే తొవ్వల మొగల్‌పుర దాటంగనే నట్టనడుమల నిటారుగ ఉండేదే శాలిబండ. ఇది చాలా ఎత్తు కావున బండ అని ఈ ప్రాంతాన్ని అంటారు. పాత నగరంల చాలా బస్తీల పేర్లు బండతో ముడిపడి ఉన్నవి. గాజీ బండ, పిసల్ బండ, రాంబక్షి బండ, మేకల బండ లాంటివి. వీటి దగ్గరికి పొయ్యేటప్పుడు అంతా చడావ్. వచ్చేటప్పుడు అంతా ఉతార్. జీవితంలోని ఎత్తుపల్లాల్లాగ'!

ఎంత బాగుంది. ఈ ఎత్తుపల్లాల చోటుకి వెళ్లి ఆ మనుషుల కథల్లో తల దూర్చాలనిపించదూ?

తెలుగులో 'క్షేత్ర కథానికల' పరంపర ఉంది. ఆ పరంపరలో వచ్చిన తాజా పుస్తకం 'చార్మినార్ కథలు'లోని ఉటంకింపులివి. రాసింది పరవస్తు లోకేశ్వర్. డెబ్బయి ఏళ్ల క్రితంనాటి జీవితం ఇప్పుడు ఎందుకు రాసినట్టు? డెబ్బయి ఏళ్ల క్రితం జ్ఞాపకాలు ఈ తరానికి ఎలా వర్తమానమైనట్టు? ఎలా అంటే మట్టి ఎప్పటికీ అదే. మనుషులు ఎప్పటికీ వారే. నడుమ ప్రయాణంలో నేర్చుకోవలసిన పాఠాలను గతం నుంచి పునశ్చరణ చేసుకోవడానికే ఇలాంటి కథల అవసరం.

శ్రేష్ఠమైన సాహిత్యం స్థల, కాలాల నిర్దిష్టత పాటిస్తుంది. ఏ కాలంలో ఏ చోటులో ఏ కథ నడుస్తున్నదో తెలియడం పాఠకుడికి అవసరం. కథ పాదాలు ఊనుకుంటే పాఠకుడి పాదాలు కూడా ఊనుకుంటాయి. తెలుగులో కృష్ణ ఒడ్డు కథలను ప్రభావవంతంగా చిత్రించినవాడు సత్యం శంకరమంచి 'అమరావతి కథల్లో'. ప్రవహించి ఆరిపోయే పెన్న ఒడ్డు ఆశ నిరాశలకు సిరా చుక్కలు పోసినవాడు పి.రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కథల్లో'. తిరుపతి దాపున 'మిట్టూరు'ను క్షేత్రంగా చేసుకుని 'పచ్చనాకు సాక్షిగా', 'మిట్టూరు కతలు' రాశాడు నామిని. ఆలమండ ప్రాంతాన్ని రంగస్థలం చేసుకుని 'వీరబొబ్బిలి', 'గోపాత్రుడు', 'పిలకతిరుగుడు పువ్వు' మహా కావ్యాలు సృష్టించాడు పతంజలి. నెల్లూరు జిల్లా కావలిని క్షేత్రంగా చేసుకుని 'దర్గామిట్ట కతలు' రాశాడు ఖదీర్‌బాబు. సరస్సు జీవితం మొదటిసారి 'ప్రళయ కావేరి కతలు'గా మలిచాడు స.వెం.రమేశ్. నక్కా విజయరామరాజు 'భట్టిప్రోలు కథలు' ఆ ఊరికి గొడుగు పట్టాయి. గుంటూరు జిల్లాలోని చిన్న ఊళ్ల మాలపల్లెల్నే క్షేత్రంగా తీసుకుని 'కటికపూలు' రాశాడు ఇండస్ మార్టిన్. అమలాపురంలోని ఒకనాటి బ్రాహ్మణ అగ్రహారపు అటక జాడీలను నేలకు దించాడు ముక్కామల చక్రధర్ 'కేరాఫ్ కూచిమంచి' కథల్లో.

ఇప్పుడు 'చార్మినార్ కథలు'. నిజానికి నాలుగు వందల ఏళ్ల చార్మినార్ చుట్టూ ఎన్ని వేల కథలు దాగి ఉండాలి. ఎన్ని అనుభవాలు ఉడికి ఉండాలి. ఎన్ని అశ్రువులు మరిగి ఉండాలి. ఎన్ని జీవన సౌందర్యాలు అత్తరు బుడ్డీలకు మల్లే ఎగజిమ్మి ఉండాలి. ఈ క్షేత్రం నుంచి వెలువడిన తెలుగు కథలు తక్కువ. ఇప్పుడైనా ఇవి వచ్చాయంటే 'నా జిమ్మేదారి' అని రచయిత భావించడమే! ఈ పుస్తకం నిండా మనుషులూ స్థలాలూ స్థలాలలో జీవించిన మనుషులూ. ఇటీవలే శాలిబండలోని 'ఆశా టాకీసు'ను కూల్చివేస్తే రచయిత అక్కడకు వెళ్లి చూసి చేసే తలపోతలతో ఒక కథ ఉంటుంది. కూల్చితే ఏదైనా కూలిపోతుంది. కథ రాస్తే నిలిచి ఉంటుంది. మరి ఈ కథల్లో పాన్‌సుపారీలా కలగలసిన తెలుగు–ఉర్దూల భాష సుందర 'చార్మినార్ మాండలికం'.

పాఠకుడా... నీవున్న క్షేత్రం నుంచి ఒక రచయిత వచ్చి గత కాలాన్ని నమోదు చేశాడా? నీ తావులోని ఆనవాళ్ల ఊసులు చెప్పాడా? పదిలమైన అమాయకత్వాన్ని మూటగట్టాడా? నీ క్షేత్రాన్ని తిరిగి నీకు చూపించాడా? ఈ మోటార్లు, వాహనాలు, మిద్దెలు, మేడలకు పూర్వం మనుషులు చిన్న చిర్నవ్వుల ఐశ్వర్యంతో ఎలా జీవించారో బోధపరిచాడా? ఈ బాహాబాహీ కాలంలో కలిసి బతకడం అంటే ఏమిటో అరుగు మీద కూచోబెట్టి ముద్ద కలిపి రుచి చూపించాడా? క్షేత్ర కథానికలు చదువు! రచయితా... క్షేత్ర కథానికలు రాయి!

దేశమంటే మనుషులూ వారికి సంస్కారం నేర్పే మట్టేననే ఎరుకకు మరో మార్గం లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.7.39 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** పునర్వసు తె.4.23 వరకు (తెల్లవారితే మంగళవారం) తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.06 నుండి 4.50 వరకు **దుర్ముహూర్తం:** ప.12.07 నుండి 12.54 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.14 వరకు, **అమృతఘడియలు:** రా.1.43 నుండి 3.27 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.35
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

భరత జాతికి ఒక ఆంగ్ల నాడి

కామెంట్



కరణ్ థాపర్

'ఎవరు ఆంగ్లో–ఇండియన్?' అనే ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం. బ్యారీ ఒబ్రయన్ పుస్తకం దీనికి జవాబు చెబుతుంది. ''ఇండియాకు మొదట వచ్చిన పోర్చుగీసువాళ్లు, ఆ తర్వాత బ్రిటిషర్‌లు... తమకు విధేయంగా ఉంటూ, తమ వలస పాలన విస్తరణ ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు అవసరమైన సంతతిని ఒక ప్రణాళిక ప్రకారం జాతుల మిశ్రమంతో ఆవిర్భవింపజేశారు'' అని ఒబ్రయన్ రాశారు. స్వాతంత్ర్యానంతరం ఇండియా పాల్గొన్న అనేక యుద్ధాలలో ఆంగ్లో–ఇండియన్‌లు కీలకమైన పాత్రను పోషించారు. ఇక అందరికీ కచ్చితంగా తెలిసుండే విషయం – మన విద్యారంగంలో, ముఖ్యంగా ఆంగ్ల భాషను బోధించడంలో ఆంగ్లో–ఇండియన్ పాఠశాలలు చాలా ముఖ్యమైన పాత్రను పోషించాయని!

ప్రచురణకర్తలు నాకు కొత్త పుస్తకాలు పంపిన ప్రతిసారీ వాటిలో ఒకటి అమూల్యమైన రత్నం అయి ఉంటుంది. నా వృత్తిపరమైన సంతోషాలలో అదొకటి. తాజాగా నా చేతికి వచ్చిన 'ది ఆంగ్లో–ఇండియన్స్ : ఏ పోర్ట్రెయిట్ ఆఫ్ ఎ కమ్యూనిటీ' అనే బ్యారీ ఒబ్రయన్ పుస్తకం అటువంటి రత్నమే. పుస్తకం గొప్పగా ఉంది. అయితే కొన్ని చోట్ల సాహితీ శైలి కానటువంటి వివరణాత్మమైన దీర్ఘ సంభాషణలతో సాగుతుంది. అదొక అభిభాషణ... రచయితే నేరుగా మీతో మాట్లాడుతున్నట్లు, మీకు చెప్పడానికి ఇంకా ఎంతో ఉన్నట్లు!

''మొదటొక మొదటి ప్రశ్న. మొదటి ప్రశ్నలే కదా మొదట వేయాలి! తర్వాత మిగతా విషయాలు. సరే, ఏంటంటే... మీరెప్పుడూ కూడా తమిళియన్ అంటే ఎవరు? బిహారీ అంటే ఎవరు? మలయాళీ అంటే ఎవరు? సిక్కులు అంటే ఎవరు? అనే ప్రశ్నల్ని దాదాపుగా విని ఉండరు. అయితే ఆంగ్లో–ఇండియన్‌ల విషయం పూర్తిగా వేరైనది. 'ఆంగ్లో–ఇండియన్‌లు ఎవరు?' అనే సందేహాన్ని ఒక ప్రశ్నగా మీరే కొన్నిసార్లు వేసుకుని ఉండొచ్చు. నిజం చెప్పాలంటే, 'ఎవరు ఆంగ్లో–ఇండియన్?' అనే ప్రశ్న... 'ఎవరు బెంగాలీ?' అనే ప్రశ్న కంటే సమాధానం చెప్పడం చాలా కష్టమైన ప్రశ్న'' అంటారు బ్యారీ ఒబ్రయన్ ఉపోద్ఘాతంగా. గ్రీకు, రోమన్ పురాణాలలో సిరులు పొంగి పొర్లుతుండే 'కార్నుకోపియా' కొమ్ము వంటి (మన అక్షయ పాత్ర లాంటిది) ఈ పుస్తకంలో... ఆంగ్లో–ఇండియన్‌ల గురించిన సమస్త సమాచారమూ గ్రంథస్థమై ఉందా అనిపిస్తుంది కూడా... మనకు తెలిసింది బాగా తక్కువ కనుక!

బ్యారీ ఒబ్రయన్ స్వయంగా ఆంగ్లో – ఇండియన్. తన సమూహపు నాడిపై వేలు ఉంచి ప్రత్యక్షంగా పరిశీలించి చూసినవారు. వారసత్వం, సంస్కృతి, జీవన విధానం, సామాజిక అంశాలలో తన వారి సంపూర్ణ చైతన్యాన్ని లోతుగా పరిశోధించినవారు. ఆయన రాసిన ఈ పుస్తకంలో ఐరోపా సముద్ర శక్తుల ఆగమనం, ఆంగ్లో–ఇండియన్‌ల అవతరణ, స్వతంత్ర భారత నిర్మాణంలో వారి భాగస్వామ్యం వంటివి ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఒబ్రయన్ ఆంగ్లో ఇండియన్ అయి ఉండటం ఒక్కటే ఈ పుస్తకానికి ప్రామాణికతను చేకూర్చలేదు. ముప్పై ఏళ్లకు పైగా ఒక సామాజిక కార్యకర్తగా తన సమూహం వ్యవహారాలలో పాల్పంచుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్ శాసనసభలో ఆంగ్లో–ఇండియన్‌లకు నామినేటెడ్ ప్రతినిధిగా కూడా ఉన్నారు. తన సమూహానికి సంబంధించిన ప్రతి వివరం, ప్రతి విశేషం, గణాంకాలతో సహా ఆయనకు అందుబాటులో ఉంచే విద్యావంతులైన పరిశోధక విద్యార్థులు ఆయనతో ఉన్నారు. పైగా రచయిత. ఇంకేం కావాలి ఒక అమూల్యమైన పుస్తకం రావడానికి!

ఆంగ్లో–ఇండియన్‌లు అనుకోకుండా, యాదృచ్ఛికమైన కలయికలతో అవతరించిన ప్రత్యేక సంతతి కానే కాదని ఈ పుస్తకం చదివే వరకు నాకు తెలియదు. వలసవాదులు ఉద్దేశ పూర్వకమైన ప్రయత్నాలతో శ్రద్ధగా అంటుకట్టి వీళ్లను సృష్టించారు. ''ఆంగ్లో – ఇండియన్‌ల పుట్టుక అప్రమేయమైనది కాదు. ఇండియాకు మొదట వచ్చిన పోర్చుగీసువాళ్లు, ఆ తర్వాత బ్రిటిషర్‌లు... తమకు విధేయంగా ఉంటూ, తమ వలస పాలన విస్తరణ ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు అవసరమైన సంతతిని ఒక ప్రణాళిక ప్రకారం జాతుల మిశ్రమంతో ఆవిర్భవింపజేశారు'' అని ఒబ్రయన్ రాశారు.



నాకు తెలియని మరొక విషయం – స్వాతంత్ర్యానంతరం ఇండియా పాల్గొన్న అనేక యుద్ధాలలో ఆంగ్లో–ఇండియన్‌లు కీలకమైన పాత్రను పోషించారని! ముఖ్యంగా వాళ్లు భారత వైమానిక దళంలో పైలట్‌లుగా ఉన్నారు. ''1947–48 ఇండో–పాక్ యుద్ధంలో తమ శౌర్య ప్రతాపాలు ప్రదర్శించిన పైలట్‌లలో సగంమంది ఆంగ్లో–ఇండియన్‌లే. 1965, 1971 యుద్ధాలలో గగనతలంలో మెరుపులా ఉరిమిన వారిలోనూ ఆంగ్లో–ఇండియన్‌లు ఉన్నారు. శత్రువుపై వీరోచితంగా వైమానిక దాడులు జరిపిన ఆనాటి గ్రూప్ కెప్టెన్‌లలో 20 శాతం మంది, వింగ్ కమాండర్‌లలో 30 శాతం మంది ఆంగ్లో–ఇండియన్‌లే'' అంటారు ఒబ్రయన్. ఇంకా అనేక ఆసక్తికరమైన వివరాలు పుస్తకంలో ఉన్నాయి. దేశ జనాభాలో కేవలం 0.01 శాతంగా ఉన్న ఆంగ్లో–ఇండియన్‌లు ఎన్ని యుద్ధ పతకాలు సాధించారో చూడండి. 4 మహావీర చక్ర, 25 వీర చక్ర, 2 కీర్తి చక్ర, 2 శౌర్యచక్ర అవార్డులతో పాటు, 22 వాయుసేన, 13 పరమ విశిష్ట సేవ, 17 అతి విశిష్ట సేవా పతకాలను వీరు సాధించారు! ఆంగ్లో– ఇండియన్‌లు ఎక్కువగా కోల్‌కతాలో, చెన్నైలలో నివాసం ఏర్పరచుకుని ఉండేవారు. స్వాతంత్ర్యానంతరం అరవైలు, డెబ్బైలు, ఎనభైలలో అధిక సంఖ్యలో కలకత్తా నుంచి బ్రిటన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. మెరుగైన జీవితం కోసం వారు అటువైపు మళ్లారని అంటారు.

ఇప్పుడిక నాకు తెలిసిన విషయం – నేననుకోవడం మీకూ కచ్చితంగా తెలిసుండే విషయం – మన విద్యారంగంలో, ముఖ్యంగా ఆంగ్ల భాషను బోధించడంలో ఆంగ్లో–ఇండియన్ పాఠశాలలు చాలా ముఖ్యమైన పాత్రను పోషించాయని! ఆ పాఠశాలల నుంచి ఏ స్థాయిలోని వారు వచ్చారో చూడండి. ఒబ్రయన్ చెబుతున్న దానిని బట్టి... జె.ఆర్.డి. టాటా, సల్మాన్ రష్దీ, ఫరీద్ జకారియా (వీళ్లంతా ముంబైలోని క్యాథడ్రల్ అండ్ జాన్ క్యానన్‌లో విద్యను అభ్యసించినవారు), సయీద్ జాఫ్రీ (విన్‌బెర్గ్ అలెన్, ముస్సోరీ); అమితాబ్ బచ్చన్, కబీర్ బేడీ (షేర్‌వుడ్ కాలేజ్, నైనితాల్), అరుంధతీ రాయ్ (లారెన్స్, లోవ్డేల్), డాక్టర్ రాజా రామన్న, నందన్ నీలేకని, కిరణ్ మజుందార్ షా (బిషప్ కాటన్, బెంగళూరు), విశ్వనాథన్ ఆనంద్ (సెయింట్ బీడ్స్, చెన్నై) ఆంగ్లో – ఇండియన్‌లైన టీచర్‌లు, లెక్చరర్‌లు, ప్రొఫెసర్‌ల దగ్గరే పాఠాలను, అనర్గళమైన ఆంగ్లభాషను నేర్చు కున్నారు.

ఇప్పుడు మన దేశంలోని పెద్ద వాళ్లంతా మాట్లాడుతున్నది ఆంగ్లో–ఇండియన్ ఆంగ్లమేనని మనం మర్చిపోకూడదు. ఈ విషయాన్ని రూఢి పరచడానికి ఒబ్రయన్ ప్రముఖ భారతీయ రచయిత అలెన్ సీలే మాటల్ని మద్దతుగా తీసుకున్నారు. ''భారతదేశంలో ఆంగ్లభాషను బ్రిటిష్ పాలకులు అధికారికంగా ఏమీ నిర్వీర్యం చేయలేదు. నిజానికి ఆంగ్లో – ఇండియన్‌లే ఆ పనిని అనధికారికంగా చేశారు. మెకాలే ఇక్కడ ఆంగ్ల విద్యాబోధనకు పునాదులు వేసినా కూడా బ్రిటిష్ ఇంగ్లిష్ వ్యాప్తి జరగకపోవడానికి కారణం ఆంగ్లో – ఇండియన్‌లు తమదైన శైలిలో ఆంగ్ల భాషను బోధించడమే.''

'ఆంగ్లో – ఇండియనిజమ్స్'పై ఉన్న అధ్యాయాన్ని చదివి ఉల్లాస భరితుడినయ్యాను. జిగ్గెరీ పోక్ (మోసపూరితమైన లేదా నిజాయితీ లేని ప్రవర్తన), గోయింగ్ ఫర్ ఎ లోఫ్ (సోమరిగా పచార్లు కొట్టడం), గ్యాసింగ్ టూ మచ్ (పొగడ్తలతో ఉబ్బేయడం) అనే పదబంధాలన్నిటినీ ఆంగ్లో–ఇండియన్‌లే సృష్టించారని ఒబ్రయన్ అంటారు. అది నిజమైనా, కాకున్నా అవి నన్నెంతో ఆకట్టుకున్నాయి.

మాట తీరును బట్టి ఆంగ్లో ఇండియన్‌లను ఇట్టే కనిపెట్టవచ్చని అని కూడా ఆయన చెప్తారు. 'గివ్–ఎవే' పదంతో వారు మాటను పూర్తి చేస్తారు. కొందరు 'నో' లేదా 'నా' అనే పదాన్ని మాటకు కలుపుతారు. మరికొంతమంది అంత్య ప్రత్యయం (సఫిక్స్)గా 'అప్' అని గానీ, 'అండ్ ఆల్' అని గానీ అంటారు. అత్యంత సాధారణ పదం వచ్చేసి 'మెన్'. 'కమ్ ఆన్ మెన్', 'నో, మెన్', 'ఐ హ్యావ్ హ్యాడ్ ఎనఫ్ ఆఫ్ దిస్ మెన్' (విసిగిపోయానబ్బా)... ఇటువంటివి.

ఒక ఫ్రేజ్ మాత్రం నన్ను నా బాల్యంలోకి లాక్కెళ్లింది. 'లెటజ్ గో నిన్నీ బైస్'(టు స్లీప్). మా అమ్మపాడిన ఈ లాలిపాట మూలం ఆంగ్లో–ఇండియన్ అని నాకు తెలీదు. 'నిన్నీ బాబా నిన్నీ / మఖాన్, రోటీ, చిన్నీ / మేరా బాబా సోగయా / మఖాన్, రోటీ హో గయా / నిన్నీ బాబా నిన్నీ'.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏమీ చేయట్లేదు



అమెరికాకు ఇన్‌ఛార్జ్‌గా జో బైడెన్ ఎప్పుడూ లేరు. యూకేకు లిజ్ ట్రస్ కూడా ఇన్‌ఛార్జ్‌గా లేరని ఇప్పుడు మనకు తెలుస్తోంది. ఇంకా మీరు గమనించలేదా?

– జో హార్‌కోంబ్, వ్యాఖ్యాత

భాషా ప్రేమికులు



దాదాపుగా అంతరించే దశలో ఉన్న హీబ్రూను ఇజ్రాయిల్ ఒక సాంకేతికంగా ఆధునికమైన దేశపు భాషగా నిలబెట్టగలిగింది. అలాగే మనం కూడా తమిళం, హిందీ, మన అన్ని భాషల విషయంలోనూ చేయగలం. మనకు కావాల్సిందల్లా ప్రతి భాషలోనూ అత్యంత ప్రేమ ఉన్న ముప్పై లక్షల మంది(ఇజ్రాయిల్‌కు ఉన్నది అంతమందే).

– శ్రీధర్ వెంబు, ఆంట్రప్రెన్యూర్

స్టాంపు ఉంటేనే...



నాకు ఈ మధ్యే తెలిసింది ఏమంటే, మా నాన్న సినిమా హాల్‌లో టికెట్ల మీద సీపీ ముద్ర వేసేవారు. 1970ల ప్రాంతంలో సినిమా టికెట్ల మీద ఛార్టర్డ్ అకౌంటెంట్ స్టాంప్ వేసేవాళ్లన్న విషయం నాకు పూర్తిగా కొత్తది. మా ఇల్లు గడిచేందుకు అదనపు సంపాదనగా మా నాన్న ఈ పని చేశారు.

– రాజశ్రీ దేశ్‌పాండే, నటి

దాడి చేస్తున్నారు



ఒక ప్రైవేటు కంపెనీ ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ ర్యాంకును 122 దేశాల్లో 107కు తగ్గించింది. పాకిస్తాన్, ఇటీవల ఆహార సంక్షోభం ఎదుర్కొన్న శ్రీలంక కన్నా ఇండియా పరిస్థితి దిగజారినట్టుగా చూపించారు. మరింత చేదైన విమర్శలు ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి.

– జోసెఫ్ టి. నూనీ, వైద్యుడు

దోపిడీ నిజం



బ్రిటిష్‌వాళ్లు భారతదేశం నుంచి 1765 – 1938 మధ్యకాలంలో 45 ట్రిలి యన్ పౌండ్లను దోచుకెళ్లారని అంచనా. అందుకే భారతదేశానికి వలసవాదం మేలు చేసిందన్న అబద్ధాన్ని ఎప్పుడూ విశ్వసించకండి.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

మహిళా మాట్లాడగలదు



ఒక మహిళ పురుషుల తరఫున కూడా మాట్లాడగలదు. వాళ్లకు ఆపన్న హస్తం చాచగలదు అనే వాస్తవాన్ని జనాలు జీర్ణించుకోలేరు. జనాలు అర్థం చేసుకోవాల్సింది ఏమంటే, బాధితులందరూ ఆడవాళ్లు కాదు, బాధపెట్టేవాళ్లు ఎప్పుడూ మగవాళ్లు కాదు.

– నీహారికా సింగ్, వ్యాఖ్యాత

ఆట ఆకలి



2:25– అబ్బాయి వచ్చాడు. 2:30– లంచ్ తిరస్కరణకు గురైంది. 'ఆకలి లేదు'. 2:45– ఫోన్ మోగింది. 'ఆంటీ! రూడీ ఆటకు వస్తాడా?' నేను: లంచ్ తర్వాత. 'ఓకే ఆంటీ, నేను కూడా తినేస్తా'. 2:50– 'అమ్మా ! నాకు బాగా ఆకలేస్తోంది'.

– రచన, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

ఏ కాలంలో ఉన్నాం?

ఇటీవల కేరళలో దంపతులు డబ్బుల కోసం ఇద్దరు మహిళల ప్రాణాలు తీసి, వండుకుని తిని ప్రపంచ ప్రజలకు ఒళ్ళు జలదరింప చేశారు. దీనికి కారణం మూఢనమ్మకాలు మాత్రమే. ఈ సంఘటన మరువక ముందే గుజరాత్ రాష్ట్రంలో సోమనాథ్ జిల్లాలో కన్న తండ్రే తన 14 సంవత్సరాల కూతురిని భూతశక్తులు వస్తాయి అనే మూఢ నమ్మకంతో అగ్ని గుండంలో తోసేసి జనాన్ని విస్మయపరిచాడు. అసలు నేటి సమాజం ఎటు పోతోంది? ఈ ఆధునిక 21వ శతాబ్దంలో, మానవుడు అత్యున్నత స్థాయికి ఎదుగుతున్న క్రమంలో ఏమిటీ మూఢ నమ్మకాలు, విశ్వాసాలు? దీనికి అంతటికీ కారణం మాయ మాటలు చెప్పి, మోసం చేసే బాబాలు, స్వామీజీలు, భూతవైద్యులు! ప్రపంచ దేశాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోతూంటే, కొందరు ఇంకా మూఢ నమ్మకాల్లో మునిగిపోయి ఆదిమ సమాజంలోనే కూరుకుపోవడం దురదృష్టకరం. ప్రతిదాన్నీ గుడ్డిగా నమ్మరాదు. అంధ విశ్వాసాలను హేతువాదంతో జయించాలి. ఆధునిక కాలంలో అత్యాధునికమైన ఆలోచనలతో నవీన మానవుడుగా మసలడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. ఈ దిశలో మీడియా, ప్రభుత్వాలూ తగిన ప్రచారాన్ని చేపట్టాలి.

– రావుశ్రీ, కాకినాడ

ఆయన జీవితమే ఒక సందేశం

సందర్భం



గౌరవ్

ఆయన జీవితం ఒక అద్భుతం. ఆయన పోరాటం అనన్యం. ఏకైక తెలుగు 'గదర్' వీరుడు. వ్యవసాయ శాస్త్రం చదవడానికని విదేశాలకు వెళ్ళి సమాజంలో అసమానతలు చూసి చలించిపోయి విప్లవాన్ని విలక్షణంగా అధ్యయనం చేసిన ధీరుడు. తెలుగులోనే కాదు, యావత్ దేశంలోనే ప్రప్రథమ అరాచకవాద (అనార్కిస్ట్) తత్వవేత్తల్లో ఒకరు. విస్తృతమైన జీవితానుభవాలను అక్షరీకరించి 'నేనూ–నా దేశం' పేరిట అద్వితీయమైన ఆత్మకథను తెలుగు ప్రజకి అందించాడు. ఆయనే దరిశి చెంచయ్య.

సామాన్య సంప్రదాయ కుటుంబంలో జన్మించి అసామాన్య యోధుడిగా ఎదిగిన ఆయన జీవితం ఎప్పటికీ నిత్య పఠనీయం. యావత్ దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి రాజకీయ డిటెన్యూగా దేశంలో ఆనాడు ఆయన్ని ఉంచని జైలు లేదంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్యోద్యమంలో అతివాద టెర్రరిస్టు కార్యకలాపాలలో పాల్గొనడమే కాక కాంగ్రెస్ నాయకుడిగా, గాంధేయవాదిగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు. సోషలిస్టుగా, కమ్యూనిస్టుగా, మానవతావాదిగా, సాహిత్యకారుడిగా, సామాజిక వేత్తగా, సంఘ సంస్కర్తగా, సాంస్కృతిక ఉద్యమకారుడిగా చెంచయ్య ప్రజ్ఞ బహుముఖం.

చెంచయ్య ఆత్మకథ... అనేకమంది విప్లవ వీరులూ, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రల సమాహారం. ఒక విధంగా చెప్పాలంటే సమకాలీన చరిత్రను రికార్డు చేసిన గ్రంథం. అందుకే తెలుగులో వచ్చిన ఆత్మకథల్లో అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా ఇది నిలుస్తుంది. సరిగ్గా 70 ఏళ్ళ క్రితం... 1952 సెప్టెంబర్‌లో మొదటిసారిగా ప్రచురించబడిన 'నేను–నా దేశం' గ్రంథాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఉరి కొయ్యలకు బలైపోయిన తన పంజాబ్ మిత్రుడు సర్దార్ బలవంత్ సింగుకూ, ఆయన భార్యకీ అంకితం ఇచ్చారు. నాకు తెలిసి తెలుగులో ఒక పంజాబ్ విప్లవ దంపతులకు అంకితమిచ్చిన ఏకైక తెలుగు స్వీయ చరిత్ర ఇదే. అందుకే నార్ల ఈ పుస్తకానికి పీఠిక రాస్తూ, ''శ్రీ చెంచయ్య గారి 'నేనూ – నా దేశం' నిస్సంశయంగా ఉత్తమ శ్రేణికి చెందిన ఆత్మకథ. నిజానికి అది ఆయన ఆత్మకథ కాదు; మన దేశ చరిత్ర. పోయిన అర్ధ శతాబ్దిలో మన దేశంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో వచ్చిన ప్రతి మహోద్యమం చెంచయ్య జీవిత దర్పణంలో తన ప్రతిబింబాన్ని మిగిల్చింద''ని అంటారు.



స్వాతంత్ర్య సమరయోధుడు, 'ప్రభవ' పత్రిక వ్యవస్థాపకులు గద్దె లింగయ్య మొదటిసారి ముద్రించిన నాలుగొందల పుటల ఈ స్వీయచరిత్ర అద్భుతమైన విప్లవకారులు జితేంద్ర నాథ లాహిరీ నుండి మొట్టమొదటి భారతీయ అనార్కిస్టు, గొప్ప బౌద్ధ, భౌతికవాద రచయిత లాలా హర్‌దయాళ్ వరకూ; జోధ్ సింగ్, చిదంబరం పిళ్లై, నీలకంఠ బ్రహ్మచారి... వంటి అనేకమందీ మనకి పరిచయం అవుతారు. మొదటి వైశ్య వితంతు వివాహం మొదలు కొని వితంతు శిశు శరణాలయాల స్థాపన దాకా; 'మా భూమి' నాటక ప్రదర్శనలు, అమెరికా, జపాన్, చైనా, రష్యా, సింగపూర్ దేశాలలోని పరిస్థితులు, విప్లవ రాజకీయాల్ని కూడా ఇందులో మన కళ్ళకు కడతారు. ఇదంతా ఒక ఎత్తయితే మహామేధావి డాక్టర్ కేబీ కృష్ణతో చెంచయ్యకి ఉన్న అమితమైన స్నేహం ఒక్కటీ ఒకెత్తు. జైలులో ఉన్న సమయంలో కేబీ కృష్ణ మార్క్స్ 'కేపిటల్' గ్రంథం మీద అందరికీ క్లాసులు చెప్పేవారంటూ, 'ఆయన శక్తి మాకు ఆశ్చర్యం కలిగించింది... ఆయన రాజకీయ ఆర్థిక శాస్త్రాలలో పారంగతుడు; వేదాంత శాస్త్రంలో అసమాన పాండిత్యం కలవాడు... వారి సహాయంతో డిటెన్యూల క్యాంపు ఒక సర్వకళాశాలగానూ, విప్లవ కళాశాలగానూ మారింద'ంటారు చెంచయ్య.

'నేను కమ్యూనిస్టు కావడానికి ముఖ్య కారణం స్త్రీల కష్టాలను తొలగించడానికి ప్రయత్నాలు చేసి, చేసి పూర్తిగా సాధించలేక పోవడం వల్ల కలిగిన అసంతృప్తి...' అని రాసుకున్నారాయన.

పది సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీలో ఉన్నప్పటికీ కమ్యూనిస్టు కాలేకపోయానని నిజాయితీగా రాసుకున్న నిజమైన కమ్యూనిస్టు ఆయన. బీడీ కార్మికులు, చుట్ట కార్మికులు, స్పెన్సర్ కంపెనీ కార్మికులు, కార్పొరేషన్ కార్మికులు, ఇంకా పారిశుద్ధ్య కార్మికులు వంటివారు చేసిన పోరాటాలు అన్నింటిలోనూ క్షేత్ర స్థాయిలో పాల్గొన్న ఆయన 'అభ్యుదయ రచయితల మహాసభ' మొదలు 'ప్రజానాట్యమండలి' వరకూ అనేక ప్రజా సంఘాలతో మమేకమై పని చేశారు. వాటిల్లోని లోపాలను కూడా చాలా సూటిగా చెప్పారు, రాశారు. కనుకనే స్వీయచరిత్ర ముగిస్తూ ఈ దేశానికి, మన సమాజానికి, 'ఒక మహత్తర సంస్కృతీ ఉద్యమము' అవసరం అని ప్రత్యేకంగా నొక్కి వక్కాణించారు.


చివరి రోజుల్లో ఆర్థిక ఇబ్బందులకు తాళలేక, ఎవరి దగ్గరా చేయి చాచలేక ఇంట్లో సామానులు అమ్ముకున్న వైనం మనల్ని కదిలిస్తుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి చెంచయ్యకు తెలుగు నేలపై ఇప్పటికీ తగిన గుర్తింపు రాలేదనడం అవాస్తవం కాదు. 70 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఆయన స్వీయ చరిత్ర 'నేనూ– నా దేశం' లోని కొంత భాగాన్నయినా విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టే దిశగా ప్రభుత్వం యోచన చేయాలి.

వ్యాసకర్త చెంచయ్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు
(దరిశి చెంచయ్య స్వీయచరిత్ర 'నేనూ – నా దేశం' తెలుగు లోకానికి అంది 70 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా)

భారతంలో 'గీతలు'

మనలో చాలామందికి భగవద్గీత గురించి తెలిసినంతగా భారతంలోనే ఉన్న వృత్రగీత, హంసగీత, బ్రాహ్మణగీతల గురించి తెలిసి ఉండకపోవచ్చు.

వృత్రగీత: వృత్రుడు యుద్ధంలో ఇంద్రుడి చేతిలో ఓడిపోతాడు. అయినా ఎలాంటి విషాదం లేకుండా ఉన్న వృత్రునితో శుక్రాచార్యులు, శత్రువు చేత ఓడిపోయిన నీకు మనోవ్యథ లేకపోవటానికి గల కారణం ఏమిటో చెప్పమని అడుగుతాడు. అందుకు వృత్రుడు, కలిమి లేములు కాలాన్ని బట్టి సంభవిస్తుంటాయి. ఈ సత్యం తెలిసిన వాళ్లకు మనస్సు కలత చెందదు అని మొదలుపెట్టి తగు సమాధానం చెబుతాడు. వృత్రుడు చెప్పిన సమాధానమే శాంతి పర్వం పంచమాశ్వాసంలో ఉన్న వృత్రగీత.



హంసగీత: ఒకసారి బ్రహ్మదేవుడు బంగారు హంసగా మారి విహరిస్తూ ఉండగా కొందరు ఆ హంసను సమీపించి, అన్ని కర్మబంధాల నుండి మోక్షం కలగాలంటే ఎలాంటి ధర్మాన్ని మనిషి ఆచరించవలసి ఉంటుందో చెప్పమని అడుగుతారు. ఓర్పు, ఇంద్రియ నిగ్రహం, సత్యం – వీటిని పాటించటమే ధర్మమనీ, దాన్ని ఆచరించేవాడే మోక్షానికి అర్హుడనీ మొదలుపెట్టి... అనేక విషయాలు హంస చెప్పింది. ఈ మాటలే హంసగీతగా చెప్పబడుతున్నాయి. ఈ గీత కూడా శాంతి పర్వం పంచమాశ్వాసంలోనిదే!

బ్రాహ్మణగీతలు: బ్రహ్మ జ్ఞాన సంపన్నుడైన బ్రాహ్మణుడి వద్దకు అతడి భార్య వచ్చి ఆధ్యాత్మిక విద్య బోధించమని అడుగుతుంది. అందుకాతడు సంతోషించి కర్మ తత్వం గురించి, అంతర్యాగం గురించి, జీవాత్మ స్వరూపం గురించి వివరిస్తాడు. ఈ వివరణలన్నీ కలిపి బ్రాహ్మణగీతలుగా అశ్వమేధ పర్వం ద్వితీయాశ్వాసంలో ఉన్నాయి.

– దీవి సుబ్బారావు

క్లుప్తంగా

24న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 24వ తేదీన 'దీపావళి ఆస్థానాన్ని' టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. ఉదయం ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, అనంతరం భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దీపావళి ఆస్థానం కారణంగా అక్టోబర్ 24న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు :
తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 31 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 81,535 మంది స్వామి వారిని దర్శించుకోగా, 37,357 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.08 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 10 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతుంది.

టీటీడీ వైఖానస ఆగమ సలహా మండలి సభ్యుల నియామకం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయానికి టీటీడీ వైఖానస ఆగమ సలహా మండలి సభ్యులను నియమిస్తూ శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు అర్చకం వేణుగోపాల దీక్షితులు, ఆలయ అర్చకులు అర్చకం రామకృష్ణ దీక్షితులు, ఎస్వీ ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం, వైఖానస ఆగమ స్మార్త పండితులు ఎన్.వి.మోహనరంగాచార్యులు, విశ్రాంత వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు, తిరుపతి ఎస్వీ వేదిక్ వర్సిటీ, అతిథి ఆచార్యులు, వైఖానస పండితులు వేదాంతం గోపాల కృష్ణమాచార్యులు సభ్యులుగా నియమితులయ్యారు. వీరు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన ఆగమ సలహా మండలి సభ్యులను శ్రీవిజనస ట్రస్టు కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు అభినందించారు.

ముగిసిన ట్రిపుల్ ఐటీల ప్రవేశాల కౌన్సెలింగ్

నూజివీడు: రాష్ట్రంలోని ఆర్‌జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిందని చాన్సలర్ ఆచార్య కేసీరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందినవారు క్యాంపస్‌లు మార్చుకోవాలని భావిస్తే వర్సిటీ వెబ్‌సైట్‌లో ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అప్‌డేట్ అయిన అభ్యర్థుల మార్కులను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. మిగిలిన ఖాళీల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ప్రాంతీయ భాషల్లో వైద్య విద్య నిర్ణయం దారుణం

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస రాజు

సాక్షి,అమరావతి/లబ్బీపేట(విజయవాడ తూర్పు): కేంద్రం, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాలు తీసుకున్న ప్రాంతీయ భాషల్లో వైద్య విద్య నిర్ణయం దారుణమని, దీన్ని ఐఎంఏ తీవ్రంగా ఖండిస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.శ్రీనివాస రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ భాషల్లో వైద్య విద్యా బోధన ప్రజల ఆరోగ్యంతో చెలగాటమేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వైద్యుల భవిష్యత్‌ను కూడా నాశనం చేసేలా ఉందని తెలిపారు. ఇంగ్లిష్ మినహా ఇతర ప్రాంతీయ భాషల్లో వైద్య విద్య బోధించడానికి అవసరమైన వనరులు అందుబాటులో లేవని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అకడమిక్ బుక్స్, జర్నల్స్, ఇతర మెడికల్ రీసెర్చ్ పబ్లికేషన్‌లు ఇంగ్లిషులోనే ఉంటాయని తెలిపారు.

బీఆర్క్ రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్



ఏఎఫ్‌యూ: రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బి.ఆర్క్) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ జారీ చేసినట్లు బి.ఆర్క్ ప్రవేశాల స్టేట్ కన్వీనర్, వైఎస్సార్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇంటర్ లేదా డిప్లొమా(10+3) పూర్తి చేసి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్, జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించి.. తొలి విడతలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈనెల 17 నుంచి 19లోపు దరఖాస్తు చేయాలని సూచించారు. ఓసీ అభ్యర్థులు రూ.1,500, బీసీలు రూ.1,300, ఎస్సీ, ఎస్టీలు రూ.1,000 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేయాలని సూచించారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకున్న వారు.. ఇప్పుడు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. సీట్లు పొందిన అభ్యర్థుల జాబితాను 25న వెబ్‌సైట్‌లో పెడతామని చెప్పారు. అనంతరం వారంతా 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేసి.. ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విశాఖలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ ఇంజినీరింగ్(ఏయూ)లో 21 సీట్లు, కడప వైఎస్సార్ ఏఎఫ్‌యూలో 20, విశాఖలోని వరాహ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 28, భీమవరంలోని ఎం.ఆర్.కె.కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో 15సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



వైద్యుల పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఓ యజ్ఞంలా నియామకాల ప్రక్రియ చేపడుతోంది. వాక్-ఇన్ ఇంటర్వ్యూల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. శాశ్వత/కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ పోస్టుల భర్తీ ఉంటుంది. ఈ అవకాశాన్ని అర్హులైన వైద్యులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ వినోద్‌కుమార్, ఏపీవీవీపీ కమిషనర్, ఇన్‌చార్జ్ డీఎంఈ

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య శాఖ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గత మూడేళ్లలో ఏకంగా 40,676 పోస్టుల భర్తీ చేపట్టింది. దీంతో పాటు వైద్య శాఖలో ఏర్పడిన ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకునేలా అనుమతులిచ్చింది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ)లలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్(సీఏఎస్‌ఎస్) పోస్టుల భర్తీకి వైద్య శాఖ ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో డీఎంఈలో 300కు పైగా, ఏపీవీవీపీలో 100కు పైగా పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోయాయి. వీటిని వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డీఎంఈలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ..

ఈనెల 19, 20, 21 తేదీల్లో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను ఆదివారం విడుదల చేశారు. స్పెషాలిటీల వారీగా డీఎంఈలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేయనున్నారు. 19వ తేదీన కార్డియాలజీ, కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఎండోక్రినాలజీ, మెడికల్ గ్యాస్ట్రో-ఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో-ఎంటరాలజీ, మెడికల్ అంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, నియోనాటాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీకి సంబంధించిన పోస్టులకు ఇంటర్వ్యూ చేస్తారు. 20వ తేదీన న్యూక్లియర్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, అనస్థీషియా, ఓబీజీ, రేడియాలజీ/రేడియోడయగ్నోసిస్, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ పోస్టులకు.. 21వ తేదీన ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఫోరెన్సిక్ మెడిసిన్, డెర్మటాలజీ, పల్మొనాలజీ, ఎస్పీఎం, పాథాలజీ, ఈఎన్‌టీ పోస్టులకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు చేయనున్నారు.

ఏపీవీవీపీలో సీఏఎస్ఎస్ పోస్టుల భర్తీకి..

ఏపీవీవీపీకి సంబంధించిన ఈనెల 19న అనస్థీషియా, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్, రేడియాలజీ, 20వ తేదీన జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, సైకియాట్రి, 21న ఓబీజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, పాథాలజీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డీఎంఈ, ఏపీవీవీపీ పోస్టుల కోసం ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు దరఖాస్తులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు వాటిని పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల్లోగా ఫలితాలు ప్రకటించి నియామక ఉత్తర్వులు అందజేస్తారు. డీఎంఈ పోస్టుల భర్తీకి సంబంధించిన మరిన్ని వివరాలకు dme.ap.nic.in, 7995055087, 9849902968 నంబర్లతో పాటు walkinrecruitmentdme@gmail.com ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఏపీవీవీపీ పోస్టులకు సంబంధించిన వివరాలకు dme.ap.nic.in, 6301138782, 9398344578 నంబర్లను, apvvpwalkinrecruitment@gmail.com మెయిల్‌ను సంప్రదించాలని కోరారు.

వేమన, బ్రౌన్‌ల ఖ్యాతి నిలిపిన 'జానమద్ది'

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్
- పూర్ణచందు, శ్రీనివాస ఆచార్యకు సాహిత్యసేవా పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్

కడప కల్చరల్: వేమన ఖ్యాతిని బ్రౌన్ నేటి తరానికి అందిస్తే, డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి బ్రౌన్‌ను భాషారాధకునిగా తెలుగు వారికి అందించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్ సుందర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది 8వ జయంతి సందర్భంగా జానమద్ది సాహితీ పీఠం దశమ సాహిత్య సేవా పురస్కారాలను ఆదివారం అందజేసింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తెలుగుభాషపై చూపిన మక్కువ నేటి తరానికి ఆదర్శమన్నారు. తెలుగు సాహిత్య రచనలు తనకు మార్గదర్శకంగా నిలిచాయని చెప్పారు. సభాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి, కడప మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ జి.వి.పూర్ణచందు, అక్షర పల్లకి సాహితీ సంస్థ నిర్వాహకులు ఎం.శ్రీనివాస ఆచార్యకు డాక్టర్ జానమద్ది సాహిత్య సేవ పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 10 వేల నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమాన్ని జానమద్ది సాహిత్య పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పర్యవేక్షించగా, జానమద్ది యామిని కార్యదర్శి నివేదిక సమర్పించారు.

సెల్ఫీల కోసం వచ్చావా.. బాలయ్యా!

- టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ తీరుపై హిందూపురం ప్రజల ఆగ్రహం
- తమ బాధలను పట్టించుకోకపోవడంపై మండిపాటు



తమ సమస్యలపై బాలకృష్ణతో మాట్లాడుతున్న మహిళలు

హిందూపురం టౌన్: 'ఇండ్లలోకి నీళ్లొచ్చి ఇబ్బంది పడుతున్నాం. మా బాధలు చెప్పుకునేందుకు ఆయప్ప అవకాశం ఇవ్వడం లేదు. సెల్ఫీల కోసం ఇక్కడికి వచ్చినాడా!' అంటూ టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై హిందూపురం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణ ఆదివారం అనంతపురంలో ఓ టీడీపీ నాయకుడి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. అనంతరం బెంగళూరు వెళ్తూ.. హడావుడిగా హిందూపురం పట్టణంలో వరద ముంపునకు గురైన ప్రాంతంలో పర్యటించారు. మారుతీనగర్‌లో బాలకృష్ణ సెల్ఫీ ఫొటోలకే ప్రాధాన్యమిస్తూ.. తమ బాధలను పట్టించుకోకపోవడంతో స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా బాధ చెప్పుకుందామంటే సెల్ఫీలు దిగుతున్నాడు. ఆయప్ప ఇక్కడకు సెల్ఫీలు దిగడానికే వచ్చాడా?' అని టీడీపీ నాయకులపై మండిపడ్డారు. దీంతో కంగుతిన్న టీడీపీ నాయకులు.. వారిని తీసుకెళ్లి బాలకృష్ణతో మాట్లాడించారు. మీకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన బాలకృష్ణ.. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రైల్వేకు స్టీల్‌ప్లాంట్ ఎల్‌హెచ్‌బీ వీల్స్

- జెండా ఊపి సరఫరా ప్రారంభించిన కేంద్ర ఉక్కు కార్యదర్శి సింగ్



ఉక్కునగరం: భారతీయ రైల్వేకు విశాఖ స్టీల్‌ప్లాంట్ అనుబంధ రాయబరేలీ వీల్ ప్లాంట్‌లో తయారు చేసిన ఎల్‌హెచ్‌బీ రైలు చక్రాల సరఫరా ప్రారంభించారు. ఆదివారం రాయబరేలీ వీల్‌ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు అదనపు కార్యదర్శి రుచికా గోవిల్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ సమక్షంలో కేంద్ర ఉక్కు కార్యదర్శి ఎస్.కె.సింగ్ ముఖ్య అతిథిగా హాజరై వీల్స్ సరఫరాకు జెండా ఊపారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ భారతీయ రైల్వేకు విశాఖ స్టీల్ ప్లాంట్ చక్రాలు సరఫరా చేయడం స్టీల్‌ప్లాంట్ చరిత్రలో మహత్తర ఘట్టమన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇది మరో ముందడుగు అన్నారు. అదనపు కార్యదర్శి గోవిల్ మాట్లాడుతూ ఈ చక్రాల ఉత్పత్తి ద్వారా స్టీల్ ప్లాంట్ అంతర్జాతీయ ప్రమాణాల తయారీదారుగా మారిందన్నారు. స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఉద్యోగులు కృషి చేస్తున్నారని తెలిపారు. వీల్ ప్లాంట్ సీజీఎం డాక్టర్ వి.ఆర్.బాపారావు అధ్యక్షత వహించగా, ఆర్‌డీఎస్‌వో ఈడీ బి.ఎల్.బైర్వా, మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ పీసీఎంఎం ఎస్.డి.రావు, స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ కల్లా ఉద్దానం కిడ్నీ ఆస్పత్రి సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ నాటికి ఉద్దానం కిడ్నీ రోగుల కోసం నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్, ఆస్పత్రి సిద్ధం కానున్నాయని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆయన ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవి పూర్తయితే రోగులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఉద్దానం కిడ్నీ వ్యాధి బాధితులకు ఉత్తమ వైద్యాన్ని అందించాలని సూచించారు.

కొనసాగుతున్న కుండపోత వర్షాలు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: రాష్ట్రంలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పలుచోట్ల ఆదివారం భారీ వర్షాలు కురవగా మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పల్నాడు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆ జిల్లా వ్యాప్తంగా సగటున 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెల్లంకొండ మండలం పాపాయపాలెంలో 13.2 సెం.మీ. వర్షం పడింది. కారెంపూడి మండలం శంకరపురంసిద్ధాయిలో 8.6 సెం.మీ., నకరికల్లు మండలం చాగల్లులో 7.3, నాదెండ్ల మండలం గణపవరంలో 7, సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. ఇక కాకినాడ సిటీలో పలుచోట్ల 15–16 సెంటీమీటర్ల వర్షం పడింది.



ప్రకాశం బ్యారేజీ వద్ద ఉధృతంగా కృష్ణా నది

ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరయ్యపాలెంలో 6.1, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో 6.1, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 5.9, గుంటూరు జిల్లా తాడికొండ మండలం బెజత్‌పురంలో 5.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని నల్లడ్రెయిన్‌కు గండి పడింది. ఫలితంగా వందలాది ఎకరాల్లోకి నీళ్లు చేరాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 28.6 మి.మీ., కృష్ణా జిల్లాలో 16.3 మి.మీ.గా నమోదైంది. ప్రకాశం జిల్లాలో శని, ఆదివారాల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. ఒంగోలు నగరంలో ముసురుపట్టినట్లు రోజుకు నాలుగైదుసార్లుగా వర్షం పడుతూనే ఉంది. నల్లవాగు, చిలకలేరు వాగులు ప్రవహిస్తున్నాయి. మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ వాగు ఎగువన కురిసిన వర్షాలకు మల్లవరం రిజర్వాయర్ ద్వారా శనివారం అర్ధరాత్రి నుంచి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది.

ప్రకాశం బ్యారేజ్‌కు భారీ వరద

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీలోకి ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం బ్యారేజీకి చెందిన 70 గేట్లను ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదిలేశారు. ఎగువ నుంచి 5,09,431 క్యూసెక్కుల వరద వస్తుండగా, కాలువలకు 2,827 క్యూసెక్కులు, సముద్రంలోకి 5,06,604 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ ఏడాది కృష్ణానదికి ఐదు లక్షల క్యూసెక్కుల పైబడి వరద రావడం ఇదే తొలిసారి. అలాగే, జూన్ 1 నుంచి ఆదివారం ఉ.6 గంటల వరకూ మొత్తం 1,035.768 టీఎంసీలు కడలిలో కలవడం గమనార్హం. అలాగే, నాగార్జునసాగర్‌లో 22 క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదలవుతోంది. ఇక ఆదివారం సా. 6 గంటలకు శ్రీశైలంలోకి 4,01,187 క్యూసెక్కులు చేరుతుండటంతో తొమ్మిది గేట్లను పది అడుగుల మేర ఎత్తి 3,59,978 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి దిగువకు 3,67,443 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో శనివారం నుంచి ఆదివారం వరకు కుడిగట్టు కేంద్రంలో 14.650 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.760 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



శ్రీశైలంలో సాగర్‌కు విడుదల అవుతున్న వరద నీరు

మద్యం అక్రమ రవాణా చేస్తున్న తెలుగు యువత నేత అరెస్ట్

- కర్ణాటక మద్యం తరలిస్తూ దొరికిన గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు

గుంతకల్లు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ తెలుగు యువత గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బోయ రాము, అదే పార్టీకి చెందిన చంద్ర పోలీసులకు దొరికారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సాయంత్రం గుంతకల్లు టూటౌన్ సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ నరేంద్ర వెల్లడించారు. పాత గుంతకల్లుకు చెందిన తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బోయ రాముతోపాటు అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న చంద్ర ఆదివారం బళ్లారి నుంచి కర్ణాటక మద్యాన్ని కారులో అక్రమంగా తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గుంతకల్లు పట్టణ శివారులోని కొనకొండ్ల రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద కారు ఆపి తనిఖీ చేశారు. కారులో 19 బాక్సుల్లో 1,824 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు లభించాయి. దీంతో వారిని అరెస్టు చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా మద్యం తరలింపు కోసం ముఠా ఏర్పాటు

కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కిన రాము 2010లో అప్పటి గుంతకల్లు రూరల్ సీఐ వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఏడాది తర్వాత ఆ పని వదిలేసి, అక్రమ మద్యం రవాణాను ఆదాయ మార్గంగా ఎంచుకున్నాడు. గుంతకల్లుతోపాటు గుత్తి, పామిడి పట్టణాలకు కర్ణాటక మద్యాన్ని సరఫరా చేయడానికి ఏకంగా ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. గుంతకల్లులో పేకాట కేంద్రాలను కూడా నిర్వహించేవాడు. తన అక్రమార్జనకు అండగా ఉంటుందనే ఉద్దేశంతో టీడీపీలో చేరాడు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు మనిషిగా, ఆ పార్టీ నాయకుడు కేసీ హరి అనుచరుడిగా ముద్ర వేసుకున్నాడు. గత ఏడాది జూన్‌లో విడపనకల్లు మండలం డొనేకల్లు వద్ద పట్టుబడిన రూ.5 లక్షల విలువైన కర్ణాటక మద్యం తరలింపు కేసులోనూ రాము ప్రధాన నిందితుడు. అప్పుడు రాముతోపాటు గుంతకల్లుకు చెందిన టీడీపీ నాయకులు ఆకుల మల్లేష్, మహేష్, చంద్ర, దూద్‌పీరా, నవీన్ దాదాపు 15 రోజులు రిమాండుకు వెళ్లి వచ్చారు. అయినప్పటికీ రాములో ఏమాత్రం మార్పు రాలేదు. అక్రమార్జనే ధ్యేయంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చాడు.





చంద్రబాబు, లోకేష్‌తో నిందితుడు రాము

ప్రత్యేక శ్రద్ధతో గిరిజనులకు వైద్య సేవలందించండి

వైద్య సిబ్బందికి ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు సూచన

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య సిబ్బంది గిరిజనులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు సూచించారు. ఆదివారం విజయవాడలో గిరిజన వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్ గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి విప్లవాత్మక చర్యలు చేపట్టారని చెప్పారు. ఆయన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని.. గిరిజన వైద్య సిబ్బంది తమను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, కొర్రా రామలక్ష్మి, ఎస్టీ కమిషన్ సెక్రటరీ సతీశ్, డాక్టర్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి స్థలంపై చర్చకు అశోక్ వెనకడుగు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



విజయనగరం ఫోర్ట్: విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి స్థలంపై బహిరంగ చర్చకు టీడీపీ నాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు వెనకడుగు వేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ స్థలంలో నిర్మించినప్పటికీ ప్రజలలో తప్పుడు భావన కలిగించే విధంగా అశోక్‌గజపతిరాజు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం నల్ల దుస్తులు ధరించి స్థానిక జోనల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వరకు నిరసన చేపట్టారు. అనంతరం వీరభద్రస్వామి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి స్థలంపై చర్చించేందుకు పిలిచి 15 రోజులు అవుతున్నా అశోక్‌గజపతిరాజు రాలేదని చెప్పారు. దీనిని బట్టి వాస్తవం ఏమిటో అశోక్‌గజపతిరాజుకు తెలుసునని అర్థమవుతోందన్నారు. పీవీజీ రాజు పేరు రాజకీయాల కోసం వాడుకోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు, లోకేశ్‌కు విజయనగరం విషయాలు ఏమి తెలుసని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. వారిద్దరూ హైదరాబాద్‌లో ఉంటూ చుట్టం చూపుగా ఆంధ్రాకు వచ్చి వెళుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్పత్రి పేరు మార్చేశామని ట్వీట్‌లు చేస్తున్న లోకేశ్, విమర్శలు చేస్తున్న అశోక్‌గజపతిరాజు ఇప్పటికైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. లేని పక్షంలో అశోక్‌గజపతిరాజు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్ నుంచి వైద్య విద్య పరిధిలోకి రావడం వల్లే జిల్లా ఆస్పత్రి పేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చారని ఆయన వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, రాజేష్, ఆశపు వేణు, రాంపండు, మామిడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఉపకరణాల తయారీ హబ్‌గా ఏపీ

- రామాయపట్నం వద్ద దేశంలోనే అతిపెద్ద సోలార్ మాడ్యూల్స్, సెల్స్ తయారీ యూనిట్
- 'ఇండోసోల్ సోలార్' పేరుతో రూ.43 వేల కోట్లతో ఏర్పాటు
- 12,600 మందికి ప్రత్యక్షంగా, 8,000 మందికి పరోక్షంగా ఉపాధి

సాక్షి, అమరావతి : సౌర విద్యుత్ ఉపకరణాల తయారీ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకుంటోంది. ఫొటో వాల్టాయిక్ (పీవీ) సెల్స్, మాడ్యూల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారబోతోంది. రామాయపట్నం వద్ద దేశంలోనే అతిపెద్ద సోలార్ మాడ్యూల్స్, సెల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు కాబోతోంది. ప్రస్తుతం దేశంలో పీవీ మాడ్యూల్స్ ఉత్పత్తి సామర్థ్యం 10 గిగావాట్లు, పీవీ సెల్స్ ఉత్పత్తి సామర్థ్యం నాలుగు గిగావాట్లు కాగా.. ఇప్పుడు మన రాష్ట్రంలోనే 10 గిగావాట్ల మాడ్యూల్స్, 10 గిగావాట్ల సెల్స్ తయారీ కేంద్రం ఏర్పాటవుతోంది. పీవీ మాడ్యూల్స్ తయారీకి అవసరమైన సిలికాశాండ్, క్వార్ట్జ్ దగ్గర నుంచి సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని ఉపకరణాలు ఒకేచోట లభించేలా ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ రామాయపట్నం వద్ద భారీ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తోంది. 5,147 ఎకరాల్లో రూ.43,143 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మిస్తోంది.

చైనాకు అడ్డుకట్ట వేస్తూ.. సొంతంగా తయారీ

పునరుత్పాదక ఇంధన వినియోగం ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గిగావాట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే భారీస్థాయిలో సోలార్ ఉపకరణాలను చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం పీవీ మాడ్యూల్స్, సెల్స్ తయారీలో చైనా అగ్రస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో చైనా మీద ఆధారపడకుండా.. సొంతంగా ఉపకరణాల తయారీని ప్రోత్సహించేందుకు గాను ఈ రంగాన్ని ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకంలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. దీన్ని అందిపుచ్చుకుంటూ ఏపీలోని రామాయపట్నం వద్ద భారీస్థాయిలో సోలార్ ఉపకరణాల తయారీ యూనిట్‌ను ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) రూ.1,875 కోట్ల ప్రోత్సాహకానికి అనుమతి కూడా ఇచ్చింది.

20,600 మందికి ఉపాధి

రామాయపట్నం వద్ద సోలార్ ఉపకరణాల తయారీలో కీలకమైన మెటలర్జికల్ గ్రేడ్ సిలికా (శాండ్ సిలికా) యూనిట్లను ఏటా 76,000 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేయనున్నారు. 60,000 మిలియన్ టన్నుల పాలిసిలికాన్‌ను కూడా ఉత్పత్తి చేయనున్నారు. అలాగే, 15 గిగావాట్ల ఇన్‌గాట్/వేఫర్స్, 10 గిగావాట్ల సెల్స్, 10 గిగావాట్ల మాడ్యూల్స్, రోజుకు 2,000 టన్నుల ఫ్లోట్/రోల్డ్ గ్లాస్ తయారీ యూనిట్లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ యూనిట్ల ద్వారా ప్రత్యక్షంగా 12,600 మందికి, పరోక్షంగా 8,000 మందికి ఉపాధి లభించనుంది. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో త్వరలోనే పనులు ప్రారంభించడానికి కంపెనీ రంగం సిద్ధం చేసుకుంటోంది.

అతిపెద్ద పారిశ్రామిక నోడ్‌గా రామాయపట్నం

రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక నోడ్‌గా రామాయపట్నంను అభివృద్ధి చేయనున్నాం. రూ.43,000 కోట్లతో సోలార్ విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్ ఇక్కడ ఏర్పాటుకానుంది. సోలార్ ప్యానల్స్ తయారీలో కీలకమైన సిలికా దగ్గర నుంచి ప్యానల్స్ వరకు ఇక్కడ ఉత్పత్తి కానున్నాయి. ఈ యూనిట్ ద్వారా ఇరవైవేల మందికి పైగా ఉపాధి లభించనుంది.

– కరికల్ వలవన్, పరిశ్రమలు, పెట్టుబడులు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

హిందీలో ఎంబీబీఎస్ పాఠ్యపుస్తకాలు

విడుదల చేసిన అమిత్ షా



భోపాల్: వైద్య విద్యను హిందీలో అందించే లక్ష్యంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంబీబీఎస్ మూడు సబ్జెక్టుల హిందీ పాఠ్యపుస్తకాలను విడుదల చేశారు. ఎంబీబీఎస్ కోర్సును హిందీలో అందిస్తున్న మొదటి రాష్ట్రం మధ్యప్రదేశ్ అని అన్నారు. ఇది స్వర్ణాక్షరాలతో లిఖింపబడుతుందని అభివర్ణించారు. ఆదివారం భోపాల్ మంత్రి అమిత్ షా ఎంబీబీఎస్‌లోని మెడికల్ బయో కెమిస్ట్రీ, అనాటమీ, మెడికల్ ఫిజియాలజీ సబ్జెక్టుల హిందీ పాఠ్యపుస్తకాలను ఆవిష్కరించారు. సాంకేతిక, వైద్య విద్యను మరో 8 భాషల్లోనూ ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని చెప్పారు. ఇంగ్లిష్ తమకు రాదనే ఆత్మనూనతతో విద్యార్థులు బాధపడాల్సిన పనిలేదన్నారు. మాతృభాషల్లోనూ విద్యను కొనసాగించవచ్చని తెలిపారు. ఈ పాఠ్యపుస్తకాలను 97 మంది వైద్యులతో కూడిన బృందం రూపొందించిందని సీఎం చౌహాన్ చెప్పారు. కాగా, ఎంబీబీఎస్ పాఠ్యపుస్తకాలను హిందీలో తీసుకురావడం వైద్యవిద్యలో సానుకూల పరిణామమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఆక్సిజన్ 'స్థాయి'లో మార్పును బట్టి గ్రహాలపై జీవం గుట్టు పట్టేయొచ్చు

లీడ్స్(యూకే): అనంతమైన విశ్వంలో మనమంతా ఒంటరి జీవులమా? లేక ఇతర గ్రహాలపైనా జీవం ఏదైనా ఉందా? మన సౌర కుటుంబానికి అవతల ఉన్న గ్రహాలపై వాతావరణం ఉనికి ఉండే అవకాశం ఉందా? ఈ ప్రశ్నలు శతాబ్దాలుగా మానవులను వేధిస్తూనే ఉన్నాయి. వీటికి సమాధాలు కనిపెట్టేందుకు జిజ్ఞాసులు అలుపెరుగని కృషి సాగిస్తున్నారు. ఇతర గ్రహాలపై జీవం జాడ తెలుసుకొనేందుకు ఎన్నో పరిశోధనలు, అధ్యయనాలు జరుగుతున్నాయి. రహస్యాన్ని ఛేదించే విషయంలో మనం కొంత పురోగతి సాధించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇప్పటిదాకా మనకు తెలిసింతవరకూ కేవలం మన భూగోళంపైనే జీవులు ఉన్నాయి. ఇవన్నీ ఆక్సిజన్‌ను శ్వాసిస్తున్నాయి. జీవుల మనుగడకు ప్రాణవాయువు(ఆక్సిజన్) అవసరమన్న సంగతి తెలిసిందే. భూమిపై ఆక్సిజన్ ఎల్లవేళలా ఒకేలా లేదని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌కు చెందిన బయోకెమికల్ మోడలింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ బెంజమిన్ జేడబ్ల్యూ మిల్స్ చెప్పారు. కోట్ల సంవత్సరాల నుంచి భూమిపై ఆక్సిజన్ పరిమాణం మారుతూ వచ్చిందని అన్నారు. ఈ మార్పు ఎప్పుడు, ఎలా జరిగిందో, ఆయా సమయాల్లో ఏయే జీవులు పుట్టాయో కచ్చితంగా తెలుసుకుంటే ఇతర గ్రహాలపై ఉన్న వాయువుల పరిమాణం గురించి, తద్వారా అక్కడి జీవజాలం గురించి ఒక అంచనాకు రావొచ్చని వివరించారు. మన గ్రహంపై ఉన్న ఆక్సిజన్ పరిమాణంపై తమ పరిశోధనలో కీలక విషయాలు బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు.

భూమిపై ఆక్సిజన్, జీవం

భూగోళంపై వాతావరణంలో ప్రస్తుతం 21 శాతం ఆక్సిజన్ ఉంది. అయితే, ఇప్పుడున్నంత ఆక్సిజన్ కోట్ల సంవత్సరాల క్రితం లేదు. గతంలోకి.. అంటే 45 కోట్ల సంవత్సరాలు వెనక్కి వెళ్తే.. అక్కడ జీవించడానికి ఆక్సిజన్ ట్యాంకర్లు కూడా వెంట తీసుకొని పోవాల్సిందే. ఎందకంటే అప్పట్లో స్వల్ప పరిమాణంలో ఆక్సిజన్ ఉండేది. జీవులు కూడా ఇంకా పుట్టలేదు. ప్రధానంగా మూడు దశల్లో ఆక్సిజన్ స్థాయిలు భూమిపై పెరిగాయి. మొదటిది 'గ్రేట్ ఆక్సిడేషన్ ఈవెంట్'. దాదాపు 240 కోట్ల సంవత్సరాల క్రితం ఇది సంభవించింది. భూమిపై వాతావరణం ఏర్పడింది. ఆక్సిజన్ నిల్వలు ప్రారంభమయ్యాయి. రెండోది నియోప్రొటెరోజోయిక్ ఆక్సిజనేషన్ ఈవెంట్ (ఎన్ఓఈ). 80 కోట్ల సంవత్సరాల క్రితం సంభవించింది. భూమిపై ఆక్సిజన్ పరిమాణం పెరిగింది. దాదాపు ఇప్పుడున్న స్థాయికి ప్రాణవాయువు చేరుకుంది. ఆ తర్వాత 20 కోట్ల సంత్సరాలకు భూమిపై తొలితరం జంతువులు పుట్టాయి. మూడోది 'పాలెజోయిక్ ఆక్సిజనేషన్ ఈవెంట్'.. 42 కోట్ల సంవత్సరాల కిందట ఏర్పడింది. ఆక్సిజన్ ఇప్పుడున్న స్థాయికి పూర్తిగా చేరింది. 75 కోట్ల ఏళ్ల క్రితం భూమి వాతావరణంలో కేవలం 12 శాతం ఆక్సిజన్ ఉండేది. ఇది ఇప్పుడు 21 శాతానికి ఎగబాకింది. ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి కొత్త జీవులు ఉద్భవించడం, పాతవి అంతరించిపోవడం వంటివి జరిగాయని పరిశోధకులు భావిస్తున్నారు. దాదాపు 45 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై మొక్కలు పుట్టాయి.



అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ), కెనడియన్ స్పేస్ ఏజెన్సీ(సీఎస్ఏ) భాగస్వామ్యంతో గత ఏడాది జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్(జేడబ్ల్యూఎస్‌టీ)ను ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఇది మన సౌర మండలం ఆవల ఉన్న గ్రహాలపై వాతావరణం, వాయువులపై అధ్యయనం చేస్తోంది. అక్కడి వాయువులు, వాటి పరిమాణం గురించి తెలిస్తే జీవం ఉందా? లేదా? అనేది తేల్చవచ్చని పరిశోధకులు పేర్కొంటున్నారు.

నవంబర్ 1న నాసా 'లోఫ్టిడ్' ప్రయోగం



వాషింగ్టన్: అంగారక గ్రహంపై(మార్స్) క్షేమంగా దిగడానికి వీలు కల్పించే ప్రయోగానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) శ్రీకారం చుడుతోంది. ఫ్లైయింగ్ సాసర్ వంటి భారీ హీట్ షీల్డ్‌ను వచ్చే నెల 1న అంతరిక్షంలోకి ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. దీనికి లో-ఎర్త్ ఆర్బిట్ ఫ్లైట్ టెస్ట్ ఆఫ్ యన్ ఇన్‌ఫ్లాటబుల్ డిసీలరేటర్(లోఫ్టిడ్)గా నామకరణం చేసింది. అట్లాస్ వి-రాకెట్ ద్వారా లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి హీట్ షీల్డ్‌ను పంపించనుంది. భవిష్యత్తులో మార్స్‌పైకి పంపించే అంతరిక్షనౌక వేగాన్ని తగ్గించి, ఉపరితలంపై క్షేమంగా దించడానికి ఈ హీట్ షీల్డ్ తోడ్పడనుంది.

ఖర్గే వర్సెస్ థరూర్





- నేడే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక
- కాంగ్రెస్ చరిత్రలో ఆరోసారి ఎన్నిక
- పాతికేళ్ల తర్వాత పార్టీకి గాంధీయేతర అధ్యక్షుడు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికకు సర్వం సిద్ధమైంది. సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, శశి థరూర్‌ల మధ్య పోటీ నెలకొంది. సోమవారం జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ ఎలక్టోరల్ కాలేజీలోని 9 వేల మందికి పైగా పీసీసీ ప్రతినిధులు రహస్య ఓటింగ్ ద్వారా ఏఐసీసీ కొత్త చీఫ్‌ను ఎన్నుకోనున్నారు. 24 ఏళ్ల తర్వాత గాంధీ కుటుంబానికి చెందని వ్యక్తి పార్టీ పగ్గాలను చేపట్టనున్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంతో పాటు దేశవ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 137 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో అధ్యక్ష పదవికి ఎన్నిక జరగడం ఇది ఆరోసారి మాత్రమే.

ఖర్గే ఎన్నిక లాంఛనమే!

కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ఎవరికీ మద్దతివ్వకున్నా గాంధీ కుటుంబం అండదండలతో ఖర్గే బరిలో దిగారు. జీ 23 అసమ్మతి నాయకులతో పాటు ఇతర సీనియర్లూ మద్దతు ప్రకటించడంతో ఆయన గెలుపు లాంఛనంగా కన్పిస్తోంది. అయితే పార్టీలో బ్లాక్ అధ్యక్షుడి నుంచి స్వయంకృషితో ఎదిగిన దళిత నాయకుడైన మల్లికార్జున ఖర్గే (80), అపారమైన మేధస్సుతో ఐక్యరాజ్య సమితిలో పని చేసిన అనుభవంతో కొత్త ఆలోచనలు చేసే నాయర్ కమ్యూనిటీకి చెందిన శశిథరూర్ (66) మధ్య రసవత్తర పోటీ సాగుతుందని కొందరు యువ నాయకుల అంచనా. కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే అత్యంత సంక్లిష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న ఈ తరుణంలో అనుభవానికి ప్రాధాన్యతనివ్వాలని సంస్థాగతంగా పార్టీ గురించి ప్రతీ అంశం తెలిసిన వారినే గెలిపించాలని ఖర్గే ప్రచారం చేశారు. పార్టీలో మార్పు కోరుకునే వారు, వికేంద్రీకరణకు మద్దతునిచ్చేవారు తనను బలపరచాలంటూ థరూర్ విజ్ఞప్తి చేశారు. పీసీసీ ప్రతినిధుల్ని కలుసుకున్న సమయంలో ఖర్గేకి అండగా సీనియర్ నాయకులు నిలబడితే, యువ నాయకులందరూ థరూర్‌కి స్వాగతం పలికిన దృశ్యాలు కనిపించాయి. ఇరువురు నేతలూ తాము గాంధీ కుటుంబానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామనే స్పష్టం చేస్తూ వచ్చారు. గాంధీ కుటుంబానికి వీర విధేయుడైన ఖర్గే వారిచ్చే సూచనలు, సలహాలు తాను తప్పక పాటిస్తానని చెబితే గాంధీ కుటుంబ సభ్యుల్ని దూరంగా ఉంచి పార్టీ అధ్యక్షులెవరూ పని చేయలేరని పార్టీ రక్తంలో వారి డీఎన్ఏ ఉందని థరూర్ వ్యాఖ్యానించడం విశేషం. అనారోగ్య కారణాలతో సోనియాగాంధీ, అధ్యక్ష పదవిపై ఆసక్తి లేక రాహుల్‌గాంధీ పోటీకి దిగడానికి నిరాకరించడంతో ఈ సారి ఎన్నికలు అనివార్యమయ్యాయి. సోనియా, ప్రియాంక గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో, భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్ బళ్లారిలోని ఓటేయనున్నారు.

బలప్రయోగానికీ వెనుకాడం

చైనాలో తైవాన్ అంతర్భాగం

- పునరేకీకరణను పూర్తి చేయడమే లక్ష్యం: జిన్‌పింగ్



బీజింగ్: తైవాన్‌ను చైనాలో ఐక్యం చేసుకొనే విషయంలో బలప్రయోగానికి సైతం వెనుకాడబోమని డ్రాగన్ దేశాధిపతి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) ప్రధాన కార్యదర్శి షీ జిన్‌పింగ్ తేల్చిచెప్పారు. తైవాన్ ముమ్మాటికీ తమదేశంలో ఒక అంతర్గత భాగమేనని ఉద్ఘాటించారు. చైనా జాతీయ సార్వభౌమత్వం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాల కోసం సైన్యాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తామని ప్రకటించారు. రాజధాని బీజింగ్‌లోని 'ఆర్నేట్ గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్'లో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా 20వ జాతీయ సదస్సులో జిన్‌పింగ్ ప్రసంగించారు. తైవాన్ విషయంలో తన వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టంచేశారు. తైవాన్‌లో వేర్పాటువాద ఉద్యమాలకు అడ్డుకట్ట వేయడానికి అన్ని రకాల చర్యలు చేపడతామని వెల్లడించారు. బలప్రయోగానికైనా వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు.

'పూర్తిస్థాయి పునరేకీకరణ' తప్పనిసరి

చైనా పునరేకీకరణను పూర్తి చేస్తామని షీ జిన్‌పింగ్ ప్రతినబూనారు. పునరేకీకరణ అంటే తైవాన్‌ను చైనా ప్రధాన భూభాగంలో(మెయిన్ ల్యాండ్) కలిపేయడమే. జిన్‌పింగ్ ప్రతిజ్ఞకు సదస్సులో చప్పట్లతో పెద్ద ఎత్తున ఆమోదం లభించింది. తైవాన్ అంశంలో కమ్యూనిస్ట్ పార్టీ దృఢసంకల్పంతో వ్యవహరించాలని జిన్‌పింగ్ సూచించారు. పునరేకీకరణ విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శించాలన్నారు. "తైవాన్ సమస్యను పరిష్కరించుకోవడం అనేది పూర్తిగా చైనాకు సంబంధించిన వ్యవహారం. ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సిందే చైనానే" అని వ్యాఖ్యానించారు. పునరేకీకరణ విషయంలో శాంతియుత మార్గంలోనే ముందడుగేస్తామని తెలిపారు. అదేసమయంలో బలప్రయోగానికి పాల్పడబోమన్న హామీని తాము ఇవ్వలేమన్నారు. 'పూర్తి స్థాయి పునరేకీకరణ' అనేది వాస్తవరూపం దాల్చడం తప్పనిసరి అని ఉద్ఘాటించారు. తైవాన్ సోదరుల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని చెప్పారు. వారిని ఎల్లప్పుడూ గౌరవిస్తూనే ఉన్నామన్నారు. చైనా-తైవాన్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను ప్రోత్సహిస్తామని వివరించారు. ఇరుగు పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలను కోరుకుంటున్నామని జిన్‌పింగ్ తెలియజేశారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) 2027లో వందేళ్లను పూర్తిచేసుకోనుందని అన్నారు. సైన్యాన్ని ఆధునీకరించాలన్న లక్ష్యాన్ని మరో ఐదేళ్లలో సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆధునిక సోషలిస్ట్ దేశ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఆహారం, ఇంధనం, పరిశ్రమలు, సప్లై చైన్స్, విదేశాల్లోని చైనీయుల హక్కుల విషయంలో మరింత సామర్థ్యంతో పని చేయాల్సి ఉందన్నారు. బ్రిక్స్, షాంఘై సహకార సంఘం(ఎస్సీఓ) వంటి వాటిలో చురుకైన పాత్ర పోషిస్తామని జిన్‌పింగ్ వివరించారు. హాంకాంగ్‌పై స్పష్టమైన ఆధిపత్యం సాధించామని చెప్పారు.

అగ్రనేతలకు స్థానచలనం!

కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సదస్సు దాదాపు వారం రోజులపాటు జరుగనుంది. చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్‌ను వరుసగా మూడోసారి ఎన్నుకోనున్నారు. జిన్‌పింగ్ మినహా పార్టీలో అగ్రనేతలందరికీ ఈసారి స్థానచలనం తప్పదని తెలుస్తోంది. నంబర్-2గా పేరుగాంచిన లీ కెఖియాంగ్‌ను సైతం మార్చనున్నారు. ఆయన స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. తొలిరోజు సదస్సులో 2,300 మందికి పైగా 'ఎన్నికైన ప్రతినిధుల'తోపాటు కమ్యూనిస్ట్ పార్టీ మాజీ అగ్రనేతలు హూ జింటావో, సాంగ్‌పింగ్ తదితరులు పాల్గొన్నారు. 2002 దాకా అధ్యక్షుడిగా పనిచేసిన 96 ఏళ్ల జియాంగ్ జెమిన్ హాజరు కాలేదు. జిన్‌పింగ్ దాదాపు 45 నిమిషాలపాటు మాట్లాడారు. కీలక అంశాలను ప్రస్తావించారు. ఆయన ప్రసంగం పట్ల ఆహూతులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

సిసోడియాకు సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ మద్యం కుంభకోణంపై సోమవారం జరిగే విచారణకు హాజరు కావాలంటూ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సీబీఐ నోటీసులు పంపించింది. ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని అందులో కోరింది. దీనిపై మనీష్ సిసోడియా ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'సీబీఐ అధికారులు నా ఇంట్లో 14 గంటలపాటు సోదాలు జరిపారు. నా బ్యాంకు లాకర్ తెరిచి చూశారు. నా స్వగ్రామంలో తనిఖీలు చేశారు. ఎక్కడా ఏమీ దొరకలేదు. రేపు ఉదయం విచారణకు రమ్మంటున్నారు. అక్కడికి వెళతా. వారికి పూర్తిగా సహకరిస్తా. సత్యమేవ జయతే' అని అందులో పేర్కొన్నారు. ఈ పరిణామంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందిస్తూ.. తమ ప్రభుత్వం ఉపసహరించుకున్న మ ద్యం విధానంపై అవకతవకలు జరిగాయనే ఆ రోపణలు ఎదుర్కొంటున్న సిసోడియా, ఈ కేసులో అరెస్టయిన సత్యేందర్ జైన్ నేటి భగత్ సింగ్‌లంటూ ప్రశంసలు కురిపించారు. తమ ప్రభుత్వం కేంద్రంపై సాగిస్తున్న పోరాటం రెండో స్వతంత్ర సంగ్రామమని ఆయన పేర్కొన్నారు.

టీవీ నటి వైశాలి ఆత్మహత్య



వైశాలి, సుశాంత్(ఫైల్)

ఇండోర్: బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ స్నేహితురాలు, ప్రముఖ టీవీ సీరియల్ నటి వైశాలి ఠక్కర్(29) మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె గదిలో లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసలు పేర్కొన్నారు. ఉజ్జయిని జిల్లా మహిద్‌పూర్‌కు చెందిన వైశాలి మూడేళ్లుగా ఇండోర్‌లో నివాసం ఉంటున్నారు. 'యహ్ రిష్తా క్యా కెహ్లాతా హై'తో ఆమె కెరీర్ ప్రారంభించి, డజనుకు పైగా సీరియళ్లలో నటించారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020లో ముంబైలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

అమెరికాలో మళ్లీ కాల్పులు

పిట్స్‌బర్గ్: అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లో కాల్పులు కలకలం రేపాయి. గుర్తుతెలియని దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు మరణించారు. మరో వ్యక్తి గాయపడ్డాడు. శనివారం రాత్రి 10 గంటలకు నార్త్‌సైడ్ ఇంటర్‌సెక్షన్ వద్ద ఈ సంఘటన చోటుచేసుకుందని పోలీసులు చెప్పారు. కాల్పులకు బాధ్యులు ఎవరన్నది ఇంకా నిర్ధారించలేదని, ఎవరినీ అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. అలాగే బాధితుల వివరాలను పోలీసులు బయటపెట్టలేదు. కాల్పులు జరిపింది ఒక్కరేనా లేక ఎక్కువ మంది ఉన్నారా? అనే దానిపై దర్యాప్తు సాగుతోంది.

రూ.1,300 కోట్ల ఐఆర్ఈవో ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో రియల్ ఎస్టేట్ సంస్థ ఐఆర్ఈవోకు చెందిన రూ.1,317 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ లలిత్ గోయెల్ సంబంధీకులకు చెందిన ఆస్తులు ఇందులో ఉన్నాయని వివరించింది. ఇందులో వాణిజ్య స్థలాలు, ప్లాట్లు, నివాస భవనాలు, బ్యాంకు అకౌంట్లు ఉన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. వాణిజ్య స్థలాలు, ప్లాట్లు, నివాస భవనాలు ఇస్తామంటూ కొనుగోలుదారులను మోసగించి వసూలు చేసిన మొత్తాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపించింది. ఈ మేరకు గురుగ్రామ్, పంచ్‌కుల, లూథియానా, ఢిల్లీలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 కేసులు నమోదై ఉన్నట్లు తెలిపింది.

బిహార్‌లోనూ హిజాబ్ లొల్లి

ముజఫర్‌పూర్: హిజాబ్ తొలగించేందుకు నిరాకరించినందుకు టీచర్ తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఓ విద్యార్థిని ఆరోపించడం బిహార్‌లో దుమారం రేపింది. ముజఫర్‌పూర్‌లోని మహంత్ దర్శన్ దాస్ మహిళా కాలేజీలో ఆదివారం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్ష రాసిన వారే ఇంటర్ ఫైనల్ పరీక్షకు అర్హులవుతారు. చెవులు కనిపించేలా హిజాబ్‌ను తొలగించాలని ఓ ఇన్విజిలేటర్‌గా వచ్చిన టీచర్ కోరగా పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని తిరస్కరించింది. దీంతో, టీచర్ అభ్యంతరకరంగా వ్యాఖ్యానించారంటూ ఆమె ఆరోపించింది. ఈ వ్యవహారంపై పరీక్ష నిర్వాహకులు రెండు వర్గాల వారితో మాట్లాడి సర్ది చెప్పి పంపించారు. విద్యార్థులు కొందరు మొబైళ్లు, హెడ్ ఫోన్లతో పరీక్ష హాల్లోకి వస్తున్నారని, బ్లూటూత్‌ను ధరిస్తున్నారనే అనుమానంతోనే ఇన్విజిలేటర్ ఆమెను హిజాబ్‌ను చెవులు కనిపించేలా వెనక్కి తప్పించాలని అడిగారే తప్ప, తీసివేయాలని కాదని కాలేజీ ప్రిన్సిపాల్ కాను ప్రియ తెలిపారు. సదరు విద్యార్థిని చేసిన ఆరోపణలు అవాస్తవాలని తమ విచారణలో తేలిందని అన్నారు.



స్కూలు బస్సులో కొండచిలువ

మేకపిల్లను దిగమింగిన ఓ కొండ చిలువ భుక్తాయాసంతో దగ్గర్లో కనిపించిన స్కూలు బస్సులో చేరింది. గ్రామస్తులిచ్చిన సమాచారంతో అటవీ సిబ్బంది ఆ కొండ చిలువను పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయ్‌బరేలీలోని రేయాన్ ఇంటర్నేషనల్ స్కూలు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం సెలవు కావడంతో ఆ స్కూల్ బస్సులో ఎవరూ లేరు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

చిన్న వ్యాపారాలపై బీజేపీ దెబ్బ: రాహుల్

సాక్షి, బళ్లారి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన విధానాలతో కొన్ని పెద్ద వ్యాపార సంస్థలకు లబ్ధి చేకూర్చుతూ చిన్న, మధ్య తరహా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతీసిందని ఆరోపించారు. భారత్ జోడో యాత్ర ఆదివారం బళ్లారి జిల్లాలో కొనసాగింది. మోకా గ్రామంలో ఆయన వ్యాపారులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చిన్న వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్ స్థానం మరింతగా పడిపోవడంపై రాహుల్ ట్విట్టర్‌లో స్పందించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కలిసి భారత్‌ను ఇంకా ఎంతకాలం బలహీనం చేస్తాయని ప్రశ్నించారు. జోడో పాదయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. మోకాకు వెళ్లే దారిలో ఒక అభిమాని పట్టుకున్న జెండా రాడ్‌కు విద్యుత్ తీగలు తాకి ఐదుగురికి గాయాలయ్యాయి. అక్కడికి సమీపంలోనే ఉన్న రాహుల్ గాంధీ సురక్షితంగా బయటపడ్డారు. రాహుల్ రాత్రి బళ్లారి జిల్లాలో బస చేశారు. సోమవారం ఉదయం మోకా నుంచి ఏపీలో కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం ఛత్రగుడిలోకి యాత్ర ప్రవేశిస్తుంది.

హిందీ రుద్దితే ఊరుకోం


ప్రధాని మోదీకి స్టాలిన్ లేఖ

చెన్నై: దేశంలో కొన్ని ఉద్యోగాలు చేయాలంటే తప్పనిసరిగా హిందీ నేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానెల్ చేసిన సిఫార్సులను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకించారు. హిందీని బలవంతంగా తమ నెత్తిపై రుద్దితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీకి స్టాలిన్ లేఖ రాశారు. భిన్నత్వంలో ఏకత్వమున్న మన దేశంలో రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ఉన్న 22 భాషలనూ సమానంగా చూడాలని హితవు పలికారు. దేశంలో హిందీ మాట్లాడే వారి కంటే, ప్రాంతీయ భాషలు మాట్లాడే వారి సంఖ్యే ఎక్కువని గుర్తు చేశారు.

మంచుకొండల్లో ఎన్నికల వేడి

హిమాచల్‌లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా!

హిమాచల్‌ప్రదేశ్. పర్యాటకులకు స్వర్గధామం. సాహస క్రీడలకు కేరాఫ్ అడ్రస్. రాష్ట్రంలో ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల క్రీడ కూడా ఉత్కంఠ రేపుతోంది. మంచుకొండల్లో రాజకీయ వేడి రాజేస్తోంది. దశాబ్దాలుగా ఏ పార్టీకి వరుసగా రెండోసారి అధికారం కట్టబెట్టని హిమాచల్ ఓటర్ల నాడి తెలుసుకోవడం ఈసారి కష్టంగా మారింది. ఆప్ రంగప్రవేశంతో ఓట్లు చీలి బీజేపీ అధికారం నిలబెట్టుకుని చరిత్ర సృష్టిస్తుందా, ఉప ఎన్నికల విజయోత్సాహాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తుందా అన్నది ఆసక్తి పెంచుతోంది...



హిమాచల్ ప్రదేశ్‌తో దేశంలో ఎన్నికల జాతర ప్రారంభం కానుంది. ఇప్పటికే షెడ్యూల్ రావడంతో ప్రధాన పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెట్టాయి. 68 అసెంబ్లీ స్థానాలున్న అసెంబ్లీకి నవంబర్ 6న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 8న ఫలితాలు వెలువడతాయి. చిన్న రాష్ట్రమే అయినా ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం 40 ఏళ్లుగా కొనసాగుతున్నందున ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. 2017లో 44 సీట్లు నెగ్గిన బీజేపీ అధికార వ్యతిరేకతను ఎదుర్కొంటోంది.

ఉప ఎన్నికలతో మారిన రాజకీయం

గతేడాది రాష్ట్రంలో ఒక లోక్‌సభ, మూడు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయడంతో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలి అప్పటి నుంచి బీజేపీ అగ్ర నాయకత్వం రాష్ట్రంపై బాగా దృష్టి సారించింది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తరచూ రాష్ట్రంలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. మనాలి-లేహ్‌లను కలిపే అటల్ టన్నల్ ప్రారంభంతో ప్రజల ఇబ్బందులు ఎంత తొలిగిపోయాయో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాన్ని ప్రధానాస్త్రంగా మలచుకున్నారు. సీఎం జైరాం ఠాకూర్ కూడా నెల రోజుల్లోనే ఏకంగా రూ.4,000 కోట్లకు పైగా ప్రాజెక్టులు ప్రారంభించారు.

నిరుద్యోగమే ఎన్నికలాంశం

నిరుద్యోగమే ఈ ఎన్నికల్లో ప్రధానాంశం కానుంది. బీజేపీకి ఇదే సవాలుగా మారుతోంది. రాష్ట్రంలో 15 లక్షల నిరుద్యోగులున్నారు. వారికి ఉపాధి కల్పనలో బీజేపీ విఫలమైందంటూ కాంగ్రెస్ దుయ్యబడుతోంది. ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు కూడా ప్రచారాంశంగా మారుతున్నాయి. అయితే మాజీ సీఎం వీరభద్ర సింగ్ మరణంతో కాంగ్రెస్ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. ఆయన భార్య ప్రతిభా సింగ్ మండి ఎంపీగా, కుమారుడు విక్రమాదిత్యసింగ్ సిమ్లా రూరల్ ఎమ్మెల్యేగా ఉన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఉండటంతో ప్రచార బాధ్యతలు ప్రియాంక గాంధీ చూస్తున్నారు.

ఆప్‌కి చోటుందా?

ఆమ్ ఆద్మీ పార్టీ హిమాచల్‌లోనూ అడుగు పెట్టాలని వ్యూహాలు పన్నుతోంది. ఢిల్లీ మోడల్, పంజాబ్ ఫలితాలు ఇక్కడా ప్రభావం చూపుతాయని ఆశ పడుతోంది. కానీ రాష్ట్రంలో మూడో పార్టీకి ప్రజల్లో ఆదరణ కనిపించలేదు. 2012లో బీజేపీ రెబెల్ నేతలు హిమాచల్ లోక్‌హిత్ పార్టీ పెట్టి ఊపు ఊపినా ఎన్నికల్లో దానికి 4 శాతం ఓట్లే వచ్చాయి. ఈసారి ఆప్‌కు 6 శాతం దాకా ఓట్లు రావచ్చని సర్వేల్లో తేలింది. ఆప్ చివరికి కాంగ్రెస్ ఓట్లను చీల్చి బీజేపీ లాభపడుతుందన్న విశ్లేషణలూ ఉన్నాయి. అదే జరిగితే 1985 తర్వాత రాష్ట్రంలో అధికారం నిలబెట్టుకున్న తొలి పార్టీగా బీజేపీ చరిత్ర సృష్టిస్తుంది.

-సాక్షి, నేషనల్ డెస్క్

రెండు పార్టీలు-రెండు కుటుంబాలు

హిమాచల్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరు జరుగుతుంది. జనాభాలో 33 శాతమున్న రాజ్‌పుత్‌లు, 18 శాతమున్న బ్రాహ్మణులే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నారు. 25% ఉన్న దళిత, 14 శాతమున్న ఓబీసీ ఓట్లు కూడా కీలకమే. అగ్రవర్ణాలు కాస్త బీజేపీ వైపు మొగ్గితే ఇతర కులాలు కాంగ్రెస్‌కు అండగా ఉంటున్నాయి. అలా రెండు పార్టీలూ చెరో ఐదేళ్లు అధికారాన్ని పంచుకుంటూ వస్తున్నాయి. గతేడాది మరణించిన కాంగ్రెస్ మాజీ సీఎం వీరభద్ర సింగ్ కుటుంబం, బీజేపీకి చెందిన ప్రేమ్‌కుమార్ ధుమాల్ కుటుంబం కొన్నేళ్లుగా రాష్ట్ర రాజకీయాలపై పట్టు చూపిస్తున్నాయి. 2017 ఎన్నికల్లో ధుమాల్ ఓడినా ఆయన కుమారుడు అనురాగ్ ఠాకూర్ కేంద్ర మంత్రిగా కీలకంగా ఉన్నారు. ఈసారి బీజేపీ గెలిస్తే సీఎం రేసులో కూడా ఉన్నారు.

నయనతార, విఘ్నేష్ సరోగసీ వివాదానికి తెర!



తమిళ సినిమా: ప్రముఖ సినీ నటి నయనతార, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు సరోగసీ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు కనిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వారు సరోగసీ విధానంలో కవల పిల్లలకు తల్లిదండ్రులు కావడంపై దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించేందుకు తమిళనాడు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విచారణ కూడా చేపట్టింది. నయనతార తన సరోగసీ విధానానికి సంబంధించిన పూర్తి ఆధారాలను కమిటీకి సమర్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాము ఆరేళ్ల క్రితమే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్లను నయనతార ఆ కమిటీకి అందించినట్లు సమాచారం. అదే విధంగా గత డిసెంబర్‌లో అద్దె గర్భం కోసం రిజిస్టర్ చేసుకుని.. ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చినట్లు పేర్కొన్నారు. మరోవైపు సరోగసి విధానం ద్వారా తల్లిదండ్రులు కావాలంటే వివాహమై ఐదేళ్లు పూర్తి కావాల్సి ఉంది.

సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 17, అక్టోబర్, 2022



ఆటకు వేళాయె

స్కూల్‌గేమ్స్ పోటీలకు రంగం సిద్ధమైంది. తొలుత అండర్ 14, 17 పోటీలు జరగనున్నాయి.

- 8లో



వేర్వేరు ప్రమాదాల్లో..

జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో ఆరుగురు గాయపడ్డారు.

- 8లో

25న పాక్షిక సూర్య గ్రహణం

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 25న పాక్షిక సూర్య గ్రహణం ఏర్పడుతుందని ప్రకాశరాయ జ్యోతిషాలయం నిర్వాహకుడు తెన్నేటి విక్రమ శర్మ తెలిపారు. దీన్ని 'ముచ్చమానస్త సూర్యగ్రహణం' అంటారని తెలిపారు. గ్రహణం స్పర్శకాలం సాయంత్రం 5.03 నుంచి 5.33 వరకు ముప్పై నిమిషాల కాలం ఉంటుందని పేర్కొన్నారు. శుద్ధ మోక్షకాలం 6.32 గంటలకు వస్తుందని అన్నారు.

న్యూస్‌రీల్

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్ పూర్తి



ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ట్రిపుల్ ఐటీలో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్ ఆదివారంతో పూర్తయ్యింది. శని, ఆదివారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొదటి రోజు 518 మందిని పిలవగా 468 మంది హాజరయ్యారు. రెండో రోజు 570 మందిని పిలవగా, 503 మంది హాజరయ్యారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం మొదటి కౌన్సెలింగ్‌లో 971 మందికి ప్రవేశాలు కల్పించారు. ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా, మొదటి విడత కౌన్సెలింగ్‌లో 1088 మందిని పిలిచారు. 129 సీట్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 31లోపు రెండో కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తు చేసుకుని సీట్లు వచ్చిన విద్యార్థులు క్యాంపస్ మారాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 10వ తరగతి ఇంప్రూమెంట్, రీ వాల్యుయేషన్‌లో మార్కులు పెరిగినా దరఖాస్తుకు మార్కుల జాబితా జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రెండో కౌన్సెలింగ్‌లో 1:2 విధానంలో విద్యార్థులను పిలుస్తారు. ఈ మేరకు ప్రవేశాలు కల్పిస్తారు. సోమవారం నుంచి ఓరియంటేషన్ క్లాస్‌లు ప్రారంభిస్తారు. రెండో కౌన్సెలింగ్ పూర్తయ్యాక నవంబర్ 1 నుంచి పూర్తిస్థాయి పీయూసీ మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు. డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు కౌన్సెలింగ్ ప్రక్రియ పర్యవేక్షించారు.

ఉల్లాసంగా రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు



ఎంపికలను ప్రారంభిస్తున్న వారణాసి గోవిందరాజు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో అండర్-14 సబ్ జూనియర్స్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వారణాసి గోవిందరాజు, ప్రధాన కార్యదర్శి పి.పార్వతీశం తదితరులు ఈ ఎంపికలను ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు ప్రకాశం జిల్లా అర్ధవీడులో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటాయని ఆర్గనైజర్ బి.నారాయణరావు వెల్లడించారు. ఈ ఎంపికల్లో భాగంగా 12 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. అలా గే క్రీడాకారులకు ఈ నెల 19, 20 తేదీలలో ప్రత్యేక శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

జిందాల్ కంపెనీ సందర్శన

కాశీబుగ్గ: విశాఖపట్నం ఎండాడలో ఉన్న చెత్త నుంచి పవర్ తయారు చేస్తున్న జిందాల్ కంపెనీని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాలరావు ఆదివారం సందర్శించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి 2.85 టన్నుల చెత్తను అప్పగించినట్లు తెలిపారు. అనంతరం చెత్త నుంచి పవర్ తయారీ చేసే విధానాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో 2 టన్నుల చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు.



ఎండాడలో జిందాల్ కంపెనీ పరిశీలిస్తున్న కమిషనర్ రాజగోపాలరావు

కష్టమేవ జయతే

- నన్నకారు రైతు కుటుంబం నుంచి ఐఏఎస్ స్థాయికి ఎదిగిన రాహుల్‌కుమార్
- 117వ ర్యాంకుతో ఐఏఎస్‌కు ఎంపిక
- టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జీవితంలో ఎదురైన కష్టాలను సవాళ్లుగా స్వీకరించారు. అవరోధాలను మైలురాళ్లుగా మలచుకున్నారు. అనుకున్న లక్ష్యాన్ని అందుకోవడానికి అహర్నిశలు శ్రమించారు. సాధారణ రైతు కుటుంబంలో ప్రయాణం మొదలుపెట్టి నేడు సబ్ కలెక్టర్ స్థాయికి చేరుకున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌కుమార్ రెడ్డి ప్రస్థానం అందరికీ ఆదర్శప్రాయం.



పేరు : తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి
పుట్టిన తేదీ : 1991 జనవరి 9
తల్లిదండ్రులు : గోవిందరెడ్డి, వసంతలక్ష్మి
భార్య : లక్ష్మీశృతి
సోదరులు : ద్వారకానాథ రెడ్డి, గిరధరరెడ్డి
కుటుంబ నేపథ్యం : వ్యవసాయం, సన్నకారు రైతు కుటుంబం
విద్యార్హత : బీటెక్
ఐఏఎస్ బ్యాచ్ : 2020
స్వగ్రామం : నందిమండలం(పెండ్లిమర్రి మండలం)
జిల్లా : కడప
ప్రస్తుత హోదా : సబ్ కలెక్టర్, టెక్కలి.

సన్నకారు రైతు కుటుంబంలో పుట్టి..

తాటిమాకుల రాహుల్‌కుమార్ రెడ్డిది సన్నకారు రైతు కుటుంబం. తల్లిదండ్రులు టి.గోవిందరెడ్డి, వసంతలక్ష్మి. ఈయనకు గిరిధరరెడ్డి సోదరుడు ఉన్నారు. వీరి స్వస్థలం కడప జిల్లా పెండ్లిమర్రి మండలం నందిమండలం. నిత్యం కరువు తాండవించే ప్రాంతమది. ఏ పంట వేసినా ఏటా నష్టపోవడమే. ఇల్లు గడవడం కూడా గగనమైన పరిస్థితులను రాహుల్ చిన్నప్పుడే చూశారు. తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాల నుంచి బయటపడాలని కడపలో ఉన్న తన మేనత్త వెంకట లక్ష్మమ్మ ఇంటికి వచ్చేశారు. అక్కడే ఉండి చదువుకున్నారు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా కడపలోని ట్రస్టు స్కూల్ విద్యామందిర్‌లో సాగింది. అక్కడే చదువుకుని పదో తరగతిలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించారు. ఆ తర్వాత ఇంటర్ పూర్తి చేసుకుని, ఎంసెట్‌లో 664 ర్యాంకు సాధించి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈసీఈ చేశారు. 2012లో బీటెక్ పూర్తి చేసుకున్న రాహుల్‌కు విప్రోలో ఉద్యోగం వచ్చింది.

సివిల్స్ వైపు అడుగులు..

విప్రోలో ఉద్యోగం వచ్చినా ఆయన దృష్టి అంతా సివిల్స్ వైపే ఉండేది. అయితే ఆర్థికంగా స్థిరపడిన తర్వాత సివిల్స్‌కు ప్రయత్నించాలని తండ్రి సూచించారు. కానీ రాహుల్ మనసు ఒప్పుకోలేదు. గ్యాప్ వస్తే ప్రిపేర్ కాగలనో లేదో అన్న ఆలోచనలో పడ్డారు. ఈ సమయంలో మేనత్త వెంకటలక్ష్మమ్మ అల్లుళ్లు, వరసకు సోదరులైన సుధాకరరెడ్డి, శివనారాయణరెడ్డి అండగా నిలిచారు. చదువుకోవడానికి ఆర్థికంగా సహకరించారు. అలాగే తమ్ముడు గిరిధర రెడ్డి కూడా తండ్రితో పాటు వ్యవసాయం చేసి ఎంతో కొంత పంపించేవారు. ఇలా బంధువుల ప్రోత్సాహంతో సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. 2013 నుంచి



టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ..

సివిల్స్ పరీక్షలకు హాజరవుతున్నారు. మొదట జాగ్రఫీ ఆప్షనల్ సబ్జెక్ట్‌తో ప్రిపేరయ్యారు. మూడేళ్ల పాటు అదే సబ్జెక్ట్‌తో వెళ్లగా ఫలితం రాలేదు. తర్వాత పొలిటికల్ సైన్స్‌ను ఆప్షన్ చేసుకుని ప్రిపేరయ్యారు.

చిన్నప్పటి నుంచే..

చిన్నప్పటి నుంచి చూసిన పరిస్థితులు రాహుల్ ఐఏఎస్ కావడానికి ఉపకరించాయి. ఆయన తాతయ్య రేషన్‌డిపో డీలర్‌గా చేసేవారు. ఈ సమయంలోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల గురించి రేషన్ డిపో దగ్గర చెప్పుకోవడం రాహుల్ విన్నారు. అదే సమయంలో తన పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు మెడల్స్ అందజేయడానికి కలెక్టర్లు వచ్చేవారు. ఆయనకు పదో తరగతిలో జిల్లా టాప్ వచ్చినప్పుడు కూడా అప్పటి కలెక్టర్ జేయేష్ రంజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆ సమయంలో కలెక్టరిచ్చే సందేశాలు, తన బాల్యంలో చూసిన పరిణామాలన్నీ రాహుల్‌ని ఆలోచింపచేశాయి. దీంతో ఐఏఎస్ చేస్తే బాగుంటుందని నిశ్చయించుకుని అనుకున్నది సాధించారు.

ఇలా మూడేళ్లుగా ప్రిపేరై చివరిగా, ఆఖరి అవకాశంలో సివిల్స్‌లో ఆలిండియాలో 117వ ర్యాంకు సాధించారు.

టీచింగ్ చేస్తూనే..

సివిల్స్‌కు ప్రిపేరవుతున్న సమయంలో బంధువులు ఆర్థిక సాయం చేసినప్పటికీ తాను కూడా ఏదో ఒకటి చేసి ఎంతో కొంత సంపాదించుకోవాలని అనుకునేవారు. అందులో భాగంగానే హైదరాబాద్‌లో ఉంటూ టీచింగ్ చేసేవారు. ఆ వచ్చిన డబ్బును తన ప్రిపరేషన్‌కు కొంత వినియోగిస్తూ, మరికొంత తన తల్లిదండ్రులు వ్యవసాయం కోసం చేసిన అప్పులను తీరుస్తూ ఉండేవారు. ఇప్పటికీ ఆ అప్పులు తీర్చుతూనే ఉన్నారు.

ప్రేమ వివాహం

హైదరాబాద్‌లో సివిల్స్‌కు ప్రిపేరవుతున్న సమయంలో మరో సివిల్స్ అభ్యర్థి లక్ష్మీశృతితో ప్రేమలో పడ్డారు. కొన్నాళ్ల తర్వాత తల్లిదండ్రులకు చెప్పి, వారి అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. 2020 ఆగస్టు 4న సివిల్స్‌లో ర్యాంకు వస్తే, అదే నెల 9వ తేదీన వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె ప్రజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్‌లో సివిల్స్ టీచింగ్ చేస్తున్నారు. ఈ మధ్యే రాహుల్ తండ్రి కన్నుమూశారు.

ప్రధాన మంత్రి ముందు ప్రాజెక్టు ప్రజెంటేషన్

2020లో ఐఏఎస్ పూర్తయ్యాక పశ్చిమ గోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ట్రెనింగ్ అయ్యారు. కార్తికేయ మిశ్రా, ప్రసన్న వెంకటేష్ వద్ద ట్రెనీగా శిక్షణ పొందారు. తర్వాత కేంద్రప్రభుత్వ సర్వీసైన మినిస్టర్ ఆఫ్ ఫిషరీస్, యానిమల్ హజ్బెండరీలో అసిస్టెంట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ పోస్టులో ఉండగా మత్స్యకారుల ఆదాయం ఎలా రెట్టింపు చేయాలి? ఎటువంటి విధానాలు అమలవ్వాలి? ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రాజెక్టు రూపొందించారు. దేశ వ్యాప్తంగా 175 ప్రాజెక్టులు తయారవ్వగా, అందులో టాప్ 8వ ప్రాజెక్టుగా రాహుల్ కుమార్ తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికై, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందు ప్రదర్శితమైంది.

గైడెన్స్ ఇస్తా..

చిన్నప్పటి నుంచి కష్టాలను చూశాను. ఆర్థిక ఇబ్బందులు ఏంటో తెలుసు. పేద పిల్లలకు అండగా ఉంటాను. పోటీ పరీక్షలు ఎంత కష్టమో తెలుసు. పోటీ పరీక్షలకు ముఖ్యంగా సివిల్స్ ప్రిపేరయ్యే వారికి గైడెన్స్ ఇస్తాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తా. నవరత్నాలు సజావుగా అమలయ్యేలా, అర్హులకు అందే విధంగా కృషి చేస్తాను

– సాక్షితో రాహుల్ కుమార్ రెడ్డి

19 నుంచి బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ బీపీఈడీ, డీపీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నిర్వహణ డీన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీలో ఆదివారం వివరాలు వెల్లడించారు. వర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 20 నుంచి, వర్సిటీ ఇంజినీరింగ్ బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలు 20 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ నాల్గో సెమిస్టర్, డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షలు షెడ్యూల్ త్వరలో విడుదల చేయనున్నట్లు వివరించారు.

వీనులవిందుగా అన్నమయ్య కీర్తనలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీకాకుళం షిరిడి సాయి సంగీత విద్యాలయం కళాకారులు అన్నమయ్య భక్త సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు.

కోతకు వచ్చిన బాసుమతి



కిల్లాంలో రైతు వేసిన బాసుమతి వరి

నరసన్నపేట: మండలం కిల్లాంలో బాసుమతి వరి పంట కోతకు వచ్చింది. ఇతర వరి రకాలకు భిన్నంగా బాసుమతి వరి రకాన్ని పండించేందుకు ఆసక్తి చూపిన రైతు యాగాటి వెంకటరమణ పంట పండింది. 50 సెంట్ల విస్తీర్ణంలో ఈ వరిని వేయగా కోతకు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నుంచి ఈ రకాన్ని తీసుకువచ్చి వేశానని వెంకటరమణ తెలిపారు. జూలై నెలలో ఉభాలు చేసినట్లు చెప్పారు. పంట బాగుందని 15 బస్తాల వరకూ దిగుబడి రావచ్చని తెలిపారు. వ్యవసాయాధికారి కె.సునీత మాట్లాడుతూ ఏ రైతు అయినా ఆసక్తి మేరకు బాసుమతి వేయవచ్చని అయితే తొందరగా ఉభాలు చేయాలని అక్టోబర్ నెలాఖరుకే కోతకు వస్తుందని అన్నారు.

'కోలగట్ల సౌమ్యుడు'



కోలగట్ల వీరభద్రస్వామిని సన్మానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు

శ్రీకాకుళం రూరల్: ఆర్య వైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే సౌమ్యులని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని అవోపా కల్యాణ మండపంలో ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పదవీ బాధ్యతలు స్వీకరించిన కోలగట్ల ప్రత్యర్థితో సైతం సున్నితంగా మాట్లాడే సౌమ్యులని ధర్మాన అన్నారు.

అనంతరం సన్మాన గ్రహీత కోలగట్ల మాట్లాడుతూ తనకు ఈ గౌరవం ఇచ్చిన వారందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నిర్ణయం ప్రకారం ఆర్యవైశ్యుల తరపున తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అనేక మంది ఆర్యవైశ్యులకు దేవాలయాల్లో సభ్యత్వం లభిస్తోందన్నారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు చింతామణి నాటకాన్ని రద్దు చేయడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మండవల్లి రవి, భాస్కర్, గుప్తా, నర్సింగరావు, సురేష్, సత్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర చర్చ

మూడు రాజధానుల ఆవశ్యకతపై నరసన్నపేటలో ఆదివారం వికేంద్రీకరణ–మూడు రాజధానులు–అభివృద్ధి అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేధావులంతా అభివృద్ధి వికేంద్రీకరణకు జై కొట్టారు. – నరసన్నపేట

అరసవల్లిలో భానుసప్తమి సందడి



సూర్యనమస్కార పూజలను చేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుడి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. భానుసప్తమి పర్వదినాన ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కేశఖండన శాలలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ప్లాస్టిక్ స్టూళ్లను ఏర్పాటు చేయడంతో తలనీలాలను సులువుగా తీసేందుకు అవకాశం ఏర్పడింది. అలాగే భక్తుల కోసం ఉచిత ప్రసాదాల పంపిణీ, మంచినీటి పంపిణీ తదితర చర్యలను ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ చేపట్టారు. అంతరాలయంలో ప్రత్యేక అలంకరణతో స్వామిని అలంకరించి సర్వదర్శనాలకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఏర్పాట్లు చేశారు. ఇదిలావుంటే వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.1.51 లక్షలు, విరాళాల ద్వారా రూ. 83,166 ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.90 లక్షల మేరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలిపారు.

స్క్రిప్ట్ టీడీపీది.. నటన పవన్ కల్యాణ్‌ది

- పవన్ కల్యాణ్ తీరు సరికాదు
- విశాఖ పరిపాలన రాజధాని కావాల్సిందే
- మంత్రి సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: మూడు పెళ్లిళ్లకు మూడు రాజధానులకు ముడిపెట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సరికావని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన ఆదివారం పలాసలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలకు లోబడి పనిచేయాలని, జనసేన కార్యకర్తల తీరు సరికాదని అన్నారు. విశాఖ గర్జనకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారని, వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. విశాఖలో వైఎస్సార్ సీపీ నాయకులపై జనసేన కార్యకర్తలు దాడికి దిగడం హేయమైన చర్య అన్నారు. కుండపోత వర్షంలోనూ విశాఖ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, ఆ ఉద్యమ స్ఫూర్తిని దెబ్బ తీయడానికి పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నంలా ఆ దాడి ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు ఆడుతున్న నాటకంలో పవన్ అవగాహన లేకుండా పావులా మారిపోతున్నారని వ్యాఖ్యానించారు. టీడీపీ కార్యాలయంలో తయారైన స్క్రిప్ట్‌తో పవన్ చేస్తున్న పనులు ప్రజలు గమనించాలన్నారు. నైతిక విలువలు కోల్పోయి చేస్తున్న ఇలాంటి పనులు హర్షణీయం కాదన్నారు. త్వరలోనే రాష్ట్రంలో అదానీ పెట్టుబడులు పెట్టబోతున్నారని, కియా మోటార్స్ అదనంగా పెట్టుబడులు పెడుతోందని, వీటిని తెలుసుకోవాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో వస్తున్న పెట్టుబడులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ గ్యాప్ టైమ్‌లో ఆదాయం సంపాదించే నాయకుడిగా పవన్ కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఐవైఆర్ కృష్ణారావు చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారాల పేరుతో రాసిన పుస్తకాన్ని పవన్ ఆవిష్కరించిన సంగతిని మర్చిపోవద్దని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని, విశాఖపట్నం పరిపాలనా రాజధాని అయితే ఉత్తరాంధ్రలో అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు.

వింత మేక జననం

వజ్రపుకొత్తూరు రూరల్: చినవంక గ్రామంలోని జోగ జీవన్‌కు చెందిన మేక ఆదివారం వింత మేకపిల్లకు జన్మనిచ్చింది. ఎనిమిది కాళ్లు, రెండు తలలతో జన్మించడంతో విషయం తెలుసుకున్న స్థానికులు ఈ మేకపిల్లను ఆసక్తిగా తిలకించారు. ఈ విషయంపై పశు సంవర్ధక శాఖ ఏడీ మట్ట రవికృష్ణను వివరణ కోరగా జన్యుపరమైన మార్పులు, పిండం రెండుగా విభజన కానప్పుడు ఇలా జరుగుతుందని తెలిపారు.



జన్మించిన వింత మేక

డిసెంబర్ నాటికి ఆస్పత్రి, వాటర్ ప్లాంట్ సిద్ధం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. రానున్న డిసెంబర్ నాటికి కిడ్నీ రోగుల కోసం వాటర్ ప్లాంట్, ఆస్పత్రి సిద్ధం కానున్నాయని తెలిపారు. ఆయన ఆదివారం తన కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రుల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ బాధితులకు అన్ని రకాల పరీక్షలను స్థానిక పీహెచ్‌సీలు, లేదా సీహెచ్‌సీల్లో నిర్వహించి మందులు అందించాలని సూచించారు. పరీక్షలకు అవసరమైన ఎనలైజర్లు, కిట్లు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఉద్దానంలో అందరికీ ఉన్నతమైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. ఉద్దాన ప్రాంతంలోని 18 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ పరిధిలో గల 23 ఎనలైజర్ల పరికరాలపై ఆరా తీసిన కలెక్టర్ కేవలం నాలుగు మాత్రమే పనిచేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వారంలోగా ఎనలైజర్లు, కిట్లు సమకూర్చుకోవాలన్నారు. లేకపోతే తదుపరి వారంలో జిల్లా నిధుల నుంచి కొనుగోలు చేసి నవంబర్ 1 నుంచి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షిని ఆదేశించారు. కిడ్నీ రోగులకు 3 నెలలకు సరిపడే విధంగా కిట్స్, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలపై స్పందనలో ఫిర్యాదులు వస్తే సంబంధిత వైద్యాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.



వైద్య శాఖ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జిల్లాలో మరో నాలుగు డయాలసిస్ యంత్రాల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న కిడ్నీ రోగులకు కోసం ఒక డయాలసిస్ యంత్రం కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. డయాలసిస్ యూనిట్స్ ఏర్పాటుకు స్థలాభావం ఉంటే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. న్యూరాలజిస్ట్ వైద్యులు అందుబాటులో లేరని వైద్యులు సూచించగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దానం కిడ్నీ రోగులకు పరీక్షలు నిర్వహించడంలో అలసత్వం వహించరాదన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ నాయక్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. అనురాధ, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారులు డాక్టర్ జెన్నా, లక్ష్మి ప్రసన్న, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కె.విద్యాసాగర్, ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు ఎం.చంద్రరావు, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు రూ. లక్ష ఆర్థిక సాయం



పిల్లలకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: రక్తహీనతతో బాధపడుతున్న డీఆర్‌వలస గ్రామానికి చెందిన అన్నదమ్ములు పాండ్రంకి తిరుపతి, యశ్వంత్ వైద్య ఖర్చుల కోసం పలువురు సాయం అందజేస్తున్నారు. తాజాగా గ్రామసర్పంచ్ కుమరాపు శాంతమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమరాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు కలిసి లక్ష రూపాయలను చిన్నారుల తల్లిదండ్రులు రామారావు, సుబ్బలక్ష్మిలకు ఆదివారం అందజేశారు. చిన్నారుల కష్టంపై గత నెల 29న రక్త కన్నీరు శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పలువురు ఆర్థిక సహాయం చేశారు. ఎవరైనా సాయం చేయాలనుకుంటే ఫోన్ పే నంబర్ 9063834358కు పంపించగలరని కోరారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు కుమరాపు శ్రీనివాసరావు, సుగుణాకరావు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు



మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గార: ప్లాంటేషన్ పనుల్లో భాగంగా ఎంపిక చేసిన రహదారులకు ఇరువైపులా కొత్తగా మొక్కలను నాటి.. వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. శ్రీకూర్మం, కె.హైరిగాం, వరమవల్లి, అంపోలు తదితర పంచాయతీల్లో ప్లాంటేషన్ పనులను ఆదివారం పరిశీలించారు. కొన్ని మొక్కలకు రక్షణ కంచె లేనట్టు గుర్తించి తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. చనిపోయిన మొక్కల ప్రదేశంలో కొత్తగా మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కలను పాడు చేయకుండా పశువులు, గొర్రెల పెంపకందారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈసీ నారంనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

జలుమూరు: జలుమూరు–నామాలపేట మధ్య ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలాకి మండలం జిల్లేడు మాకివలస గ్రామానికి చెందిన శ్రీరాములు, ఆయన భార్య లక్ష్మి ద్విచక్ర వాహనంపై బుడితి వెళ్తుండగా శ్రీముఖలింగం గ్రామానికి చెందిన రమేష్ శ్రీముఖలింగం నుంచి జలుమూరు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురెదురుగా ఢీకోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శ్రీరాములు తల ముందుభాగంలో గాయమవ్వగా.. లక్ష్మి తలకు వెనుక బలమైన గాయమైంది. అలాగే రమేష్‌కు కుడి పాదంతోపాటు భుజంపై గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ బాలరాజు, పైలట్‌లు రామకృష్ణ తెలిపారు.

'చిన్నచూపు తగదు'



సమావేశంలో సంఘ నాయకులు

శ్రీకాకుళం రూరల్: తూర్పుకాపు సామాజిక వర్గాన్ని అన్ని రాజకీయపక్షాలు చిన్నచూపు చూస్తున్నాయని ఏపీటీటీకేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర తూర్పుకాపు సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రంలో అత్యధిక జనాభా తూర్పుకాపులదే అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ మాట్లాడుతూ.. తూర్పుకాపు జాతి ఐక్యతను చాటి చెప్పాలన్నారు. అనంతరం 2023కు గాను జాతీయ సంఘంగా పెంపొందించేందుకు స్టీరింగ్ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

ఆటకు వేళాయె..





సీటీవోకబడ్డీ శిక్షణలో క్రీడాకారులు

● 19 నుంచి 21 వరకు నియోజకవర్గ స్థాయిలో స్కూల్‌గేమ్స్
● తొలుత అండర్–14, 17 పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్‌గేమ్స్)కు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరగనున్న ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు క్రీడల పోటీలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ కారణంగా 2020, 2021 ఏడాదిల్లో రెండేళ్లపాటు స్కూల్‌గేమ్స్ పోటీలను నిర్వహించలేకపోయారు. దీంతో ఈసారి జరగనున్న పోటీల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హులు ఎవరంటే?

స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–14, 17, 19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్ 14, 17 విభాగాల్లో, ఇంటర్మీడియెట్ విద్యలో అండర్–19 ఎంపికలు నిర్వహిస్తారు. వయో నిబంధనల విషయానికొస్తే.. అండర్–14లో 2009 జనవరి ఒకటి, అండర్–17కు 2006 జనవరి ఒకటి, అండర్–19కు 2004 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి. అలాగే అండర్–14కు ఎనిమిదో తరగతిలోపు, అండర్–17కు ఇంటర్ ఫస్టియర్‌లోపు, అండర్–19కు డిగ్రీ ఫస్టియర్‌లోపు చదవాలి. కబడ్డీ గేమ్‌కు హాజరయ్యే క్రీడాకారుల్లో అండర్–14కు బాలురు 51 కేజీలు, బాలికలు 48, అండర్–17 బాలురు 57, బాలికలు 53, అండర్–19 బాలురు 65, బాలికలు 59 కేజీలలోపు బరువు ఉండాలి.

19 నుంచి నియోజకవర్గ పోరు..

స్కూల్‌గేమ్స్ అండర్–14, 17 విషయానికొస్తే.. జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో తొలుత నియోజకవర్గస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. అక్కడ ఎంపికచేసిన జట్లు/క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో నేరుగా అర్హత సాధిస్తారు. జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు నవంబర్ 7 నుంచి 10 వరకు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా నిర్వహించాలని అధికారులు సూచనప్రాయంగా నిర్ణయించారు.

32 క్రీడాంశాల్లో ఎంపికలు..

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హాకీ, జూడో, రోలర్‌స్కేటింగ్, సెపక్‌తక్రా, తైక్వాండో, టెన్నిస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, రగ్బీ, వెయిట్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నికాయిట్, షటిల్‌బ్యాడ్మింటన్, యోగా, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు/క్రీడాకారులు వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ రాణించినవారు జాతీయ పోటీలకు ఎంపికవుతారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈవో నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌లో నియోజకవర్గస్థాయి ఎంపికలు జరుగుతాయి. అనంతరం 32 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి పోటీలను జరుపుతాం.

– బీవీ రమణ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి



కోవిడ్‌తో రెండేళ్లు స్కూల్‌గేమ్స్ పోటీలు జరగలేదు. ఈ ఏడాది జిల్లాలో నిర్వహిస్తున్నాం. అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు, భోజనాలు కల్పిస్తాం.

– గార పగడాలమ్మ, డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు

ఒత్తిడికి గురి కావద్దు



మాట్లాడుతున్న అప్పారావు

● బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర కమిషనర్ అప్పారావు

లావేరు: బాలికలు ఎటువంటి ఒత్తిళ్లకు గురి కావద్దని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర కమిషనర్ కె.అప్పారావు పిలుపునిచ్చారు. మురపాక గ్రామంలోని పీబీ నగర్ కాలనీలో ఉన్న కేజీబీవీని ఆయన ఆదివారం సందర్శించారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. పిల్లల కోసం వండిన వంటకాలను పరిశీలించారు. వారికి వడ్డించడంతోపాటు కలిసి భోజనం చేశారు. అనంతరం సదస్సు నిర్వహించి బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, బాలల హక్కుల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అడ్డుకుంటామంటూ కొవ్వొత్తులు చేతపట్టి ర్యాలీ చేశారు. సదస్సులో అప్పారావు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. బాలికలు చిన్న వయస్సులో వివాహాలు చేసుకోకుండా బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వలన ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాల రహిత భారతదేశంగా తయారు కావాలంటే బాల్య వివాహాలకు స్వస్తి పలకాలన్నారు. బాలికలకు కొందరు మాయమాటలు చెప్పి వారి ఫొటోలు తీసుకొని తరువాత వాటిని మార్ఫింగ్‌లు చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అటువంటి వారి మాయలో పడి మోసపోవద్దన్నారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీఈవో గార పగడాలమ్మ, ఎస్ఎస్ఏ పీవో ఆర్.జయప్రకాష్, లావేరు ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, ఎస్సై ఎ.కోటేశ్వరరావు, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి బల్ల సుధ, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, బాలల హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ తేనేల విద్యాసాగర్, సీఆర్‌పీలు వి.గోవిందరావు, ఎం.రమేష్, ఏఎస్సై భుజంగరావు, ఏహెచ్‌టీయూ అధికారి ఎస్.కేశవరావు, ఎల్‌సీపీవో టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రీడాకారుడు సిద్ధార్థకు సాయమందిస్తాం



సిద్ధార్థను సన్మానిస్తున్న మంత్రి అప్పలరాజు

● మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: జాతీయస్థాయిలో మందసకు గుర్తింపు తీసుకొచ్చిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు సిద్ధార్థమహరణకు అన్ని విధాలా సాయమందిస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సిద్ధార్థను పలాసలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అప్పలరాజు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధార్థకు క్రీడలతో పాటు విద్యకు కూడా సహకరిస్తామన్నారు. మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఎంతో చరిత్ర ఉన్న మందసలోని శ్రీరాజా శ్రీనివాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. మంచి క్రీడాకారునిగా తయారుచేసిన సిద్ధార్థ కోచ్‌ను కూడా మంత్రి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మండల యువజన కార్యదర్శి శానాపతి కిశోర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బరాటం జయప్రకాశ్, నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, మందస అభివృద్ధి కమిటీ నాయకులు వడ్డి చంద్రశేఖరం, ప్రభాకర్ పట్నాయక్, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, వడ్డి చిన్నబాబు ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,200–00
బంగారం(22సి. 10గ్రా.)	47,850–00
వెండి (కిలో)	66,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 430.00
విజయనగరం	రూ. 434.00
శ్రీకాకుళం	రూ. 434.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 255

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



గాయపడిన సంతోష్ కుమార్



లారీని ఢీకొట్టిన కారు

రణస్థలం: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో నలుగు తీవ్ర గాయాలపాలయ్యారు. కోష్ట గోశాల సమీపంలో జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డులో ఆటోను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు గాయపడినట్టు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. కోష్ట నుంచి రణస్థలం వైపు సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఆర్టీసీ బస్సును బైకుపై ఇద్దరు యువకులు దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న యువకుడు తోలాపి సంతోష్‌కుమార్‌ది లావేరు మండలంలోని రావివలస గ్రామం కాగా వెనుక కుర్చున్న మరో యువకుడు పి.దుర్గాప్రసాద్‌ది రణస్థలం మండలం బంటుపల్లి గ్రామం. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా డ్రైవింగ్ చేసిన సంతోష్‌కుమార్ నిత్యం కళాశాలలు విడిచిపెట్టే సమయంలో స్పోర్ట్స్ బైక్‌పై ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తుంటాడు. ఇతన్ని పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ తీరుమార్చుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు



కారు ప్రమాదంలో గాయపడిన వృద్ధులు

జె.ఆర్.పురం పంచాయతీ పరిధి దన్నానపేట సమీపంలో విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వెళ్లే జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకనుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. కారులో ఉన్న నలుగురులో ఇద్దరికి తీవ్రంగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని తొలుత రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో తీవ్ర గాయాలైన ఇద్దరిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వృద్ధులు ఎ.జానకీరామయ్య, జి.అరుణకుమారిలను విజయనగరానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు.

నిత్యాన్నదానానికి రూ. 51 వేల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథ ఆలయంలో నిత్యం జరుగుతున్న అన్న దానానికి నరసన్నపేటకు చెందిన ఆరంగి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సావిత్రమ్మ రూ. 51 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆలయ ఈవో జి.గురునాథం, పాలక మండలి సభ్యుడు డబ్బీరు వాసులకు ఈ మొత్తాన్ని ఆదివారం అందజేశారు. అలాగే ఆదివారం మధ్యాహ్నం అన్నదానానికి అల్లు సత్యం, మరిశర్ల కృష్ణమూర్తినాయుడులు కలిసి ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పేరిట రూ. 5,116 అందజేశారు.


కరాటే పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన వారితో కోచ్ లక్ష్మణ్‌నాయుడు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన కరాటే క్రీడాకారులు పతకాల పంట పండించారు. విశాఖపట్నంలోని మాకివలస వేదికగా ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో 24 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో ఐదు బంగారు, రెండు రజత, 17 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో డిసెంబర్ నెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు బంగారు, రతజ పతకాలు సాధించిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో మోనీస్, హర్షిత్‌కళ్యాణ్, లలిత్‌మిధున్, ఏకాంత్, ఎన్.ఉధిత, ఎం.జాస్మిన్, శ్రీరాం రుత్విక్ ఉన్నారు. వీరంతా నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు. పాఠశాల డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ ఉషా కిరణ్మయి, కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు క్రీడాకారులను అభినందించారు.

ఆలయ పరిసరాల శుభ్రం



దేవాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: గార మండల పరిధి గోరువానిపేట గ్రామంలో సత్య సాయిబాబా వార్షిక సేవా ప్రణాళికలో భాగంగా ఆదివారం సీతారాముల దేవాలయ పరిసరాలను శుభ్రం చేసినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆలయానికి ఇరువైపులా ఉండే చెత్తచెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ సూర్యనారాయణ, జోనల్ యూత్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, పాపారావు, శ్రావణ్, ధనలక్ష్మి, ఆలయ అర్చకులు అప్పలరాజు పాల్గొన్నారు.


నాలుగు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

సారవకోట: సారవకోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980 – 81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత ఒకేవేదికపై పూర్వ విద్యార్థులు కలుసుకొని సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించి గౌరవించారు. గ్రూపు ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రావాడ వెంకట్రామన్, నిర్వాహకులు బెహర రాజగోపాలరావు, పంగ సూర్యనారాయణ, తాటిపురం శ్రీనివాసరావు, చౌదరి సురేష్ తదితరులున్నారు.

ఈ-క్రాప్ నమోదుపై జేసీ క్షేత్రస్థాయి పరిశీలన



కొచ్చెర్లలో ఈ-క్రాప్ పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్

రణస్థలం: ఈ–క్రాప్ నమోదుపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ రణస్థలం మండలంలో ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పంటల నమోదులో భాగంగా రైతులు బయోమెట్రిక్ (ఈకేవైసీ) వేయడంలో సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. కొచ్చెర్ల, తిరుపతిపాలెం గ్రామాల్లో పర్యటించిన ఆయన రైతులతో మాట్లాడి.. పండించిన పంటలన్నింటికి ఈ–క్రాప్ నమోదు చేయించుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ బయోమెట్రిక్ వేలిముద్రలు కూడా వేయాలని సూచించారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసిన సర్వే నంబర్ పరిశీలించి పంట ఉందో లేదో నేరుగా రైతులతో మాట్లాడారు. ఈకేవైసీ నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పరంగా సక్రమించే అన్ని రాయితీలు వర్తిస్తాయన్నారు. ధాన్యం కొనుగోలు, పంట నష్టం ఇలా అన్నీ వస్తాయని చెప్పారు. మండలంలో ఈకేవైసీ నమోదు 76 శాతం మాత్రమే ఉందని క్షేత్రస్థాయిలో పరిశీలించి శత శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, డీటీ జి.కె.శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏవో డి.విజయభాస్కర్ ఉన్నారు.

క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఎచ్చెర్ల: పశువులకు గాలికుంటువ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణకు టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి కె.రమణ ఆదివారం తెలిపారు. పాడిరైతులు అప్రమత్తతో ఉంటూ విధిగా తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

ఆధ్యాత్మికత కలిగి ఉండాలి



గోష్టిలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ పరతత్వం కలిగి ఉండాలని పలువురు వక్తలు అన్నారు. పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో ఆదివారం తత్వత్రయం, భగవద్గీతపై గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ ఆధ్యాత్మికత కలిగి ఉండాలని, అప్పుడే సమాజం చక్కగా నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: మండలంలోని ఆరోగ్య సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యుడు కిశోర్‌కుమార్ అన్నారు. సిబ్బందితో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్యం లోపించకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

గౌరీదేవి ఉత్సవాలలో వేషధారణలు



పగటి వేషధారణలో గ్రామస్తులు

శ్రీకాకుళం కల్చరల్: జొన్నలపాడు గ్రామంలో జరుగుతున్న గౌరీదేవి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. గ్రామస్తులు పగటి వేషధారణలతో అలరించారు. బుధవారం అనుపోత్సవం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు.


సాధనతో ఆత్మసాక్షాత్కారం సాధ్యం



రామసుబ్బారావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సాధకుడు శ్రవణ, మనన, విధి ధ్యాసనలు చేస్తుంటే చివరకు ఆత్మసాక్షాత్కారం లభిస్తోందని ప్రముఖవక్త రాళ్లపల్లి రామసుబ్బారావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బృహదారణ్యక ఉపనిషత్తు కోసం వివరించారు. మధుకాండ, మునికాండ, బాలకాండలని బృహదారణ్యక ఉపనిషత్తు అంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్తను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మోహనరావు, డాక్టర్ ఎస్.నారాయణమూర్తి, ప్రసాద్, విశ్వేశ్వరరావు, నిష్టల నర్సింహమూర్తి, దుర్గారావు, బాబూరావు పాల్గొన్నారు.

చినలింగాలవలసలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

లావేరు: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, లింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద అన్నారు. చినలింగాలవలస గ్రామంలో ఆదివారం 104 వాహన వైద్య శిబిరం జరిగింది. రోగులకు ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇటుకల తయారీదారులకు వర్షం గుబులు!

ఇటుకల తయారీదారులకు వర్షం గుబులు వెంటాడుతోంది. 20 రోజులుగా పడుతున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని వారు చెబుతున్నారు. లావేరు మండలంలో ఇటుకల తయారీపై పలు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. మండల కేంద్రమైన లావేరులో కుమ్మర్లు ఇటుకల తయారు చేసి విక్రయించగా వచ్చే ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. గతంలో కులవృత్తి అయిన కుండలను తయారు చేసేవారు. అయితే ఆ వృత్తి గిట్టుబాటు కాకపోవడంతో ఇటుకలను తయారు చేస్తున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో తయారు చేస్తున్న ఇటుకలు తడిసిపోయి పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నుంచి ఇటుకులు తడవకుండా కొంతవరకూ పరదాలు కప్పి కాపాడుకుంటున్నామని చెబుతున్నారు.

లావేరు



లావేరులో వర్షానికి తడవకుండా పరదాలతో ఇటుకలను కప్పి ఉంచిన దృశ్యం

మొక్కజొన్న రైతులను ముంచేసిన వర్షాలు



వెంకయ్యపేటలో మొలకెత్తిన జొన్న పొత్తులు

జి.సిగడాం: ఎడతెరిపి లేకుండా 20 రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటకోసి కల్లాలకు చేర్చిన తరువాత వర్షాలు కురవడంతో కండెలు తడిసిపోయాయి. ఎండలేని కారణంగా కండెలన్నీ మొలకలు వచ్చేయడం, రంగమారడంతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో పొలంలోనే పంట ఉండిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు.



జగన్నాథవలసలో పొలంలోనే నాశనమైన పంట

డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు ఘన స్వాగతం

రణస్థలం: శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా నియమితులై.. తొలిసారిగా శ్రీకాకుళం వెళ్లిన కోలగట్ల వీరభద్రస్వామికి రణస్థలం మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించి, పూలమాల వేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మహంతి పెదరామినాయుడు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఈసీ మెంబర్ పచ్చిగుళ్ల సాయిరాం, సంఘ నాయకులు పి.చంద్రశేఖర్, రవి, ముప్పిడి మహేష్, బొర్ర విజయభాస్కర్, పచ్చిగుళ్ల కొండలరావు ఉన్నారు.



వీరభద్రస్వామికి స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య సంఘు సభ్యులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



కథలు చదవడంపై పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు



రణస్థలం: పుస్తక ప్రదర్శనలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి, విద్యార్థులు

లావేరు: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తోందని మురపాక శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు కథలు చదవడంతో పాటు పలు పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పిల్లలు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టిసారించాలన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

రణస్థలం: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరగడంతోపాటు సృజనాత్మకమైన ఆలోచనలు వస్తాయని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పల్లంటి వరలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి కోసం గ్రూప్-2, గ్రూప్-4, కానిస్టేబుల్, ఏపీపీఎస్సీ, కరెంట్ అఫైర్స్ వంటి పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే మానసిక ప్రశాంతతకు ఉపయోగపడే నవలలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. పిల్లలతో పుస్తకాలను చదివించారు. నవల్లోని కథల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయం అసిస్టెంట్ సంతోష్ కుమార్ ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

శ్రీకాకుళం అర్బన్: బాలల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషిచేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. స్థానిక అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల సాధన ద్వారానే వారి భవిష్యత్‌ను కాపాడు కోవాలన్నారు. అనాథ, వీధి బాలల రక్షణ కోసం కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌ల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ సందర్భంగా అప్పారావును జిల్లా బాలల హక్కుల వేదిక సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బాలల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి నరసింహమూర్తి, కార్యదర్శి రౌతు జ్యోతికుమారి, హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ కార్యదర్శి తాండ్ర సునీల్, బద్దెల సురేష్, బీబీఏ రాష్ట్ర కోఆర్డినేటర్ బమ్మిది చంద్రశేఖర్, హాస్టల్ వార్డెన్ మూగి మహందాత, ఉపాధ్యాయలు, విద్యార్థులు ఉన్నారు.



హాస్టల్‌ను సందర్శించిన అప్పారావు

చైతన్యంతో సమస్యలు పరిష్కారం

సోంపేట: ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు సామాజిక చైతన్యంతోనే పరిష్కారమవుతాయని వక్తలు పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సంఘం అధ్యక్షుడు డి.గోవిందరావు అధ్యక్షతన జన సాహితీ సోంపేట మండలశాఖ ఆధ్వర్యంలో 'వర్తమాన సామాజిక సంక్షోభం' 'ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశాలపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసాహితీ ప్రతినిధులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు సంక్షోభం వైపు దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులపై సమాజాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జన సాహితీ జిల్లా కార్యదర్శి మోహనరావు, ప్రజా సాహితీ మాసపత్రిక ప్రతినిధులు పీఎస్ నాగరాజు, కంచారాన భుజంగరావు, చావలి శ్రీనివాస్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

దోమ తెరలు పంపిణీ

పాతపట్నం: మండల కేంద్రంలో గల పీహెచ్‌సీ సమీపంలోని జూబ్లీ రోడ్డులో ఉన్న నవజీవన అనాథ ఆశ్రమం విద్యార్థులకు వరల్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథ విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎస్.కృష్ణవేణి, పి.నరసింహారెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో ఘనంగా నందెన్న ఉత్సవాలు

జలుమూరు: శ్రీముఖలింగంలో గౌరీపౌర్ణమి పురస్కరించుకుని నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పగటి వేషధారణలు పలువురుని ఆకట్టుకున్నాయి. కోయదొరల వేషధారలతో గ్రామంలోని అన్ని వీధుల్లో నృత్యాలు చేశారు. పురాతన సంప్రదాయాలు భావితరాలకు అందించేందుకు గుర్తుగా ఈ వేషధారణలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు, మహిళలు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించారు.

120 మందికి నేత్ర పరీక్షలు

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామంలో భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం శంకర్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎం.రాజేశ్వరి 120 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 43 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులను అందజేశారు. శంకర్ ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి టి.రామరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎం.రాజేశ్వరి

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: పాగిరి గ్రామ సమీపంలోని కుష్టు వ్యాధి నిర్మూలన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 30 మంది వ్యాధిగ్రస్తులకు ఆదివారం అన్నదానం చేశారు. రెడ్డి జేఏసీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యదర్శి, జి.సిగడాం మండల కేంద్రానికి చెందిన చిల్లా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్.లక్ష్మణరావు, తాతంనాయుడు, శంకరావు, కనకదుర్గారావు, సంతు పాల్గొన్నారు.

చిన్నారులకు పొడుపు కథల పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పొడుపు కథల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది చిన్నారులు పొడుపు కథలను ఉత్సాహంగా చెప్పారు. గెలుపు పొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, నటుకుల మోహన్, సాయిప్రసాద్, నిక్కు హరిసత్యన్నారాయణ, అప్పలనాయుడు, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

గౌరీదేవి ఉత్సవాల్లో జానపద గీతాలు



జానపద గీతాలు పాడుతున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నక్కవీధిలోని ఉమాజలలేశ్వరాలయంలో జరుగుతున్న గౌరీదేవి, నందెన్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జానపద గీతాలపనలు జరిగాయి. కొమ్మరిగుంట గ్రామానికి చెందిన వేంకటేశ్వర జానపద బృందం సభ్యులు గీతాలాపనలు చేశారు.

నేడు గుర్రాలపాలెంలో 'గడప గడపకు మనప్రభుత్వం'

లావేరు: గుర్రాలపాలెం పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడపకు గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ షేక్‌బాన్‌బాషా ఆదివారం తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

నీలమణిదుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయం లోపల క్యూలో భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఒడిశాలోని పలు ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం, విజయనగరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. మహిళలు ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీకాంత్‌కు సేవా పురస్కారం ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ వెంపటి వెంకట్ విశేష సేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని ఘంటసాల సంగీత నృత్య కళాశాల వేదికగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్, కూచిపూడి ఆర్ట్ అకాడమీ చెన్నై, జయహో భారతీయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు పద్మభూషణ్ వెంపటి చిన సత్యం జయంతిని పురస్కరించుకొని 3వ ప్రపంచ కూచిపూడి దినోత్సవ నాట్యోత్సవాల సందర్భంగా పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శ్రీకాంత్ కూచిపూడి కళకు చేస్తున్న విశేష కృషిని గౌరవిస్తూ ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా, మల్లాది విష్ణుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. పురస్కారం పొందిన శ్రీకాంత్‌ను పలు కళాసంస్థలు, అభిమానులు అభినందించారు.



మంత్రి రోజా నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్

ఓటీఎస్‌తో ఎన్నో ప్రయోజనాలు



గృహ లబ్ధిదారులకు ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న సీతన్నాయుడు

లావేరు: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు అన్నారు. చినమురపాక పంచాయతీకి చెందిన పలువురు గృహ లబ్ధిదారులకు ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటీఎస్ పథకంలో చేరితే స్థలంతో పాటు ఇంటిని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ పత్రం ఆధారంగా ఇంటిని అమ్ముకోవడానికి, రుణం తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ కె.అప్పలనాయుడు, టీపీ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల వెంకటప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు జీవీ ప్రసాద్, జి.వెంకటేష్, వీఆర్వో దన్నాన స్వామినాయుడు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్లతో టోర్నీ నిర్వాహకులు

జి.సిగడాం: డి.ఆర్.వలస గ్రామంలో వీగస్-11 ఆధ్వర్యంలో దసరా సందర్భంగా ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా విజయనగరం జిల్లా గరివిడి మండలం బొండపల్లి, రన్నర్‌గా దాలెమ్మరాజువలస జట్లు నిలిచాయి. విజేతలకు డి.ఆర్.వలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమరాపు రవికుమార్ ద్వారా ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 20 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. పది వేలు అందజేశారు. కార్యక్రమంలో వీగస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సోంపేట: ప్రపంచ మూడో కూచిపూడి దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన నాట్య పోటీల్లో పట్టణానికి చెందిన నటరాజ నాట్యకళా మండలి సభ్యుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చెన్నై కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు వెంపటి శ్రీమయి, సేవ్ కూచిపూడి నిర్వాహకులు శ్రీకాంత్ నటరాజ నాట్యకళా మండలి శిక్షకురాలు ఇద్ది బిందు (కామేశ్వరి) కళాకారులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రశంసా పత్రాలతో కళాకారులు

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మత్స్యకార ఐక్యవేదిక నాయకులు

కవిటి: కవిటి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలోని మత్స్యకారుల సంక్షేమానికి కలిసికట్టుగా ముందుకు సాగుదామని మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు బైపల్లి మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని మత్స్యకార సంఘం భవనంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బైపల్లి మోహన్, ఉపాధ్యక్షులుగా పి.రామ్మూర్తి, పొట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బడే ఢిల్లేష్, కార్యదర్శులుగా ఎ.మోహనరావు, బి.సన్ని, కె.దీనబంధు, కె.బాలయ్య, కోశాధికారిగా చీకటి కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడిగా కర్రి బాలయ్య, ముఖ్య సలహాదారుగా కర్రి పండయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, మండల మత్స్యకార ఎఫ్‌పీవో అధ్యక్షుడు కాయ భీమసేన్, ఎంపీటీసీ ఎరిపిల్లి రామయ్య, సర్పంచ్ గండుపల్లి హనుమంత్, అర్జాల అప్పన్న, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నదానం వ్యర్థాలతో సేంద్రియ ఎరువు

- గుడుల వద్ద అన్నదానం సమయంలో ఏర్పడే వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ప్లాంట్లు
- డిసెంబర్ నెలాఖరుకల్లా 8 ప్రధాన ఆలయాల వద్ద ఏర్పాటుకు కసరత్తు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో అన్నదానం సమయంలో ఏర్పడే కూరగాయలు, ఇతర ఆహార వ్యర్థాలను గంటల వ్యవధిలోనే సేంద్రియ ఎరువుగా మార్చనున్నారు. ఇప్పటికే శ్రీశైలంలోని ఆలయ అన్నదాన సదన్‌తో పాటు పలు సత్రాల వద్ద రోజుకు గరిష్ఠంగా వెయ్యి కిలోల సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. బెజవాడ దుర్గ గుడి, మహా మండపం, వేద పాఠశాలల వద్ద కూడా రోజుకు వంద కిలోల చొప్పున సేంద్రియ ఎరువు తయారీ యంత్రాలు పని చేస్తున్నాయని దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. అలాగే సింహాచలం ఆలయం వద్ద రోజుకు 200 కిలోల సేంద్రియ ఎరువు తయారీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా 8 ప్రధాన ఆలయాల వద్ద వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం దశలవారీగా దేవదాయ శాఖ పరిధిలో అన్నదానం నిర్వహించే అన్ని ఆలయాల వద్ద ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటికే పలు ఆలయాల వద్ద తయారు చేస్తున్న సేంద్రియ ఎరువును.. ఆలయ ప్రాంతంలోని మొక్కల పెంపకంలో ఉపయోగిస్తున్నట్టు వెల్లడించారు.

● తెలంగాణ

నృసింహుడికి బంగారు సింహాసనం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి మరో బంగారు సింహాసనం వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు దీన్ని బహూకరించాడు. ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల కోసం ఇప్పటికే ఒక బంగారు సింహాసనాన్ని ఓ భక్తుడు అందజేశారు. తాజాగా మరో సింహాసనాన్ని దాత ఇచ్చాడు. ఈ సింహాసనం విలువ ఎంత ఉంటుంది, ఎంత బంగారం పట్టిందనే అంశాలను అధికారులు తెలియనివ్వడం లేదు. ప్రస్తుతం ఈ సింహాసనాన్ని ఆలయ ముఖ మండపంలో భద్రపరిచారు.

ఏపీ స్ఫూర్తితో కేరళలో వ్యవసాయ విస్తరణ

నాణ్యతకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- నియోజకవర్గ, జిల్లా, రీజినల్ స్థాయిల్లో ల్యాబ్‌ల ఏర్పాటుపై కేరళ బృందం ప్రశంసలు
- కేరళలో రాష్ట్రస్థాయిలోనే ల్యాబ్‌లున్నాయన్న సభ్యులు
- ప్రభుత్వ తోడ్పాటుతో ఏపీలో బలమైన ఎఫ్‌పీఓల వ్యవస్థ ఉందని కితాబు
- కంకిపాడు అగ్రిల్యాబ్, చాగంటిపాడులో అరటి ఎఫ్‌పీఓ సందర్శన



కంకిపాడులోని అగ్రిల్యాబ్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కేరళ వ్యవసాయ సంచాలకుడు సుభాష్

సాక్షి, అమరావతి/కంకిపాడు (పెనమలూరు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేరళలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు టీవీ సుభాష్ వెల్లడించారు. ఇక్కడ నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారని అందువల్లే పండ్లు, ఇతర వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల దిగుబడులు, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన పురోగతిని సాధిస్తోందని కొనియాడారు. సుభాష్ సారథ్యంలో కేరళ ప్రైస్‌బోర్డు చైర్మన్ డాక్టర్ రాజశేఖరన్ నాయర్, వ్యవసాయ శాఖ అడిషనల్ సెక్రటరీ సబీర్ హుస్సేన్, అడిషనల్ డైరెక్టర్ సునీల్‌తో కూడిన కేరళ వ్యవసాయ ఉన్నతాధికారుల బృందం రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం కృష్ణాజిల్లా కంకిపాడులోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించింది. ల్యాబ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు ఆక్వాఫీడ్ టెస్టింగ్ విధానాలను స్వయంగా పరిశీలించారు. గతంలో రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిలో 11 ల్యాబ్స్ మాత్రమే ఉండేవని.. సర్టిఫై చేసిన నాణ్యమైన ఉత్పాదకాలను రైతులకు అందించాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం నియోజకవర్గస్థాయిలో 167, జిల్లా స్థాయిలో 13 ల్యాబ్‌లతో పాటు రీజినల్ స్థాయిలో నాలుగు కోడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెద్దం శేఖర్‌బాబు కేరళ బృందానికి వివరించారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలను ఇక్కడ అందుబాటులో ఉంచడమే కాక.. రైతులకు ఉచితంగా సేవలందిస్తున్నామని చెప్పారు. అనంతరం.. టెస్టింగ్ పరికరాలు, టెస్టింగ్ విధానాన్ని కేరళ బృందం పరిశీలించి ప్రశంసించింది. దేశంలోనే కాదు.. బహుశా ప్రపంచంలో ఎక్కడా నియోజకవర్గ స్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటుచేసిన దాఖలాల్లేవని సుభాష్ పేర్కొన్నారు.

ఏపీలో ఎఫ్‌పీఓలు బాగా పనిచేస్తున్నాయి

అనంతరం.. అరటి ప్రాసెసింగ్, ఎగుమతుల్లో జాతీయస్థాయి అవార్డుతో పాటు వైఎస్సార్ లైఫ్‌టైం అఛీవ్‌మెంట్ అవార్డు సాధించిన తోట్లవల్లూరు మండలం చాగంటిపాడులోని శ్రీ విఘ్నేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘం (అరటి ఎఫ్‌పీఓ) కార్యకలాపాలను పరిశీలించారు. సంఘంలోని సభ్యులతో సమావేశమై వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. సంఘ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందించిందని ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ బాలాజీ నాయక్ కేరళ బృందానికి వివరించారు. రాష్ట్రంలో ఎఫ్‌పీఓల వ్యవస్థ చాలా బలంగా ఉందని, ఏటా వందల కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. 100కు పైగా ఎఫ్‌పీఓల పరిధిలో 37వేల మంది రైతులున్నారని చెప్పారు. ఎఫ్‌పీఓగా ఏర్పడిన తర్వాత సాగు ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం 30 శాతం మేర పెరిగిందని ఎఫ్‌పీఓ డైరెక్టర్ కొల్లి చంద్రమోహన్‌రెడ్డి వివరించారు. నేరుగా ట్రేడర్స్‌కు విక్రయించడం ద్వారా రైతులకు గరిష్ఠ ధర లభించేలా కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేరళ వ్యవసాయ శాఖ డైరెక్టర్ సుభాష్ మాట్లాడుతూ.. తమ రాష్ట్రంలో కూడా ఎఫ్‌పీఓలున్నాయని.. కానీ, ఇంత బలంగా లేవని చెప్పారు. ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు, పనివిధానం గురించి ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు వివరించారు.

తుది దశకు ఈ-క్రాప్ నమోదు

- ఈకేవైసీ నమోదుకు నేటితో గడువు పూర్తి
- రేపటి నుంచి ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన
- చేర్పులు, మార్పులకు అక్టోబర్ 31 వరకు అవకాశం

సాక్షి, అమరావతి: ఖరీఫ్‌లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. రైతులు తమ వేలి ముద్రలు (ఈకేవైసీ) నమోదుకు సోమవారం వరకు గడువు ఇచ్చారు. సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ జాబితాలను మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, పంట సాగు తదితర వివరాల నమోదులో ఎక్కడైనా పొరపాట్లు చోటుచేసుకున్నట్టు గుర్తిస్తే వాటిని సరిచేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఇస్తారు. నవంబర్ 1వ తేదీ నుంచి తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు. వాటి ఆధారంగానే పంటల కొనుగోళ్లకు శ్రీకారం చుడతారు. పంటల బీమా, నష్టపరిహారం వంటి సంక్షేమ ఫలాలు కూడా తుది జాబితా ప్రకారమే అందిస్తారు.

పకడ్బందీగా నమోదు

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు వేళ ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఈసారి ఈ-క్రాప్ నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సౌజన్యంతో తయారు చేసిన యాప్ ద్వారా జాయింట్ అజమాయిషీ కింద ఆగస్టు 8న ఈ-క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ గ్రామాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాతో పాటు పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ) డేటా ఆధారంగా ఈ-క్రాప్ నమోదు చేశారు. ఖరీఫ్‌లో 48 లక్షల మంది రైతులు పంటలు సాగు చేస్తుండగా.. ఇప్పటివరకు 41 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో తమ పంట వివరాలను సరిచూసుకుని వేలిముద్రలు (ఈకేవైసీ) నమోదు చేసుకున్నారు. వరితో సహా నోటిఫైడ్ పంట వివరాలు 100 శాతం పూర్తి కాగా, ఈకేవైసీ నమోదు 95 శాతానికి పైగా నమోదైనట్టు చెబుతున్నారు.

● తెలంగాణ

మద్యం 'మత్తు'లో ఎవరెవరు?

- మలుపు తిరుగుతున్న ఢిల్లీ లిక్కర్ స్కాం
- నేడు సీబీఐ విచారణకు ఢిల్లీ డిప్యూటీ సీఎం
- ఢిల్లీలో కదలికలు.. హైదరాబాద్‌లో ప్రకంపనలు



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణంపై దర్యాప్తులో సీబీఐ దూకుడు పెంచింది. మూలాలను శోధించే క్రమంలో తాజాగా ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సోమవారం విచారణకు హాజరవ్వాలని నోటీసులు జారీచేసింది. ఈ పరిణామం అటు ఢిల్లీ, ఇటు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశ రాజధానిలో రాజుకున్న ఈ నిప్పు బోయినపల్లి అభిషేక్‌రావు అరెస్టుతో హైదరాబాద్‌లోనూ మంటలు రేపుతోంది. ఇదే కేసులో నిందితుడైన రామచంద్ర పిళ్లై కూడా సీబీఐ ఎదుట హాజరవ్వాల్సి రావడంతో సరికొత్త పరిణామాలు తప్పవనే సంకేతాలు వెలువడుతున్నాయి. సీబీఐ విచారణలో అభిషేక్‌రావు చెప్పిన నిజాలేంటి? వరుస సోదాల్లో ఈడీ, సీబీఐ సేకరించిన డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాల్లో లభ్యమైన సమాచారమేంటి? రామచంద్ర పిళ్లై పాత్రను నిక్కచ్చిగా చెప్పే సాక్ష్యాలేంటి? అనేవే ఈ కేసులో కీలకాంశాలు. ఢిల్లీ డిప్యూటీ సీఎంను విచారణకు రప్పించడంతోనే దర్యాప్తు సంస్థ వద్ద కీలక ఆధారాలున్నాయని అర్థమవుతోందని న్యాయనిపుణులు అంటున్నారు. దీని తర్వాత దృష్టి తెలంగాణ వైపు మళ్లే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇదే జరిగితే రాష్ట్రంలో కొంతమంది రాజకీయ ప్రముఖులకు ఉచ్చు బిగియవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. రామచంద్ర పిళ్లైకి బెంగుళూరు, ఢిల్లీ, హైదరాబాద్ లిక్కర్ సామ్రాజ్యంతో సంబంధాలున్నాయనేది తెలిసిన విషయమే. అతను నిర్వహిస్తున్న రాబిన్ డిస్టిలరీస్ కంపెనీలో హైదరాబాద్‌కు చెందిన అభిషేక్‌రావు, గండ్ర ప్రేమ్‌సాగర్‌రావు డైరెక్టర్లుగా ఉన్నారు. ఢిల్లీ మద్యం పాలసీల్లో సిండికేట్ అనుకూల మార్పుల తర్వాత రాబిన్ డిస్టిలరీస్ దక్కించుకున్న టెండర్లపైనా సీబీఐ ఆరా తీసింది. ఏదేమైనా 14 మంది నిందితుల్లో ఇప్పటికే ముగ్గురిని సీబీఐ అరెస్టు చేసింది. మిగిలినవారినీ అరెస్టు చేయడం లాంఛనమేననేది తాజాగా వస్తున్న సంకేతాలు. ఈ కేసులో ఎక్సైజ్ ఉన్నతాధికారులకూ త్వరలో నోటీసులు తప్పవని సీబీఐ వర్గాల ద్వారా తెలుస్తోంది.

● తెలంగాణ

ఐఐటీ సీట్లు మొత్తం భర్తీ

- ముగిసిన జోసా కౌన్సెలింగ్
- ఎన్‌ఐటీలకు ప్రత్యేక కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఆరు దశల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) సీట్ల కేటాయింపు చేపట్టింది. విద్యార్థులు వ్యక్తిగత లాగిన్ ద్వారా ఏ సంస్థలో, ఏ బ్రాంచ్‌లో సీటు వచ్చిందనేది తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. ఐఐటీల్లో దాదాపు సీట్ల కేటాయింపు పూర్తయినప్పటికీ, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ చేపట్టి, మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసే వీలుంది. ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌కు దాదాపు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 లక్షల మందికిపైగా పరీక్ష రాశారు. ఇందులో ఐఐటీ సీటు కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది అర్హులైనప్పటికీ పరీక్ష రాసింది మాత్రం కేవలం1.60 లక్షల మందే ఉన్నారు. వీరిలో 42 వేల మంది అర్హులుగా ప్రకటించారు. జేఈఈ మెయిన్స్ ర్యాంకు ఆధారంగా ఎన్‌ఐటీ, ఐఐటీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో సీట్లు కేటాయించారు.

ఆ సంస్థల్లో 54477 ఇంజనీరింగ్ సీట్లు

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్ఐటీల్లో 54477 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. వీరిలో 2971 సీట్లు మహిళలకు సూపర్ న్యూమరరీ పోస్టులుగా కేటాయించారు. ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఈసారి 16598 సీట్ల లభ్యత ఉంది. ఇందులో మహిళలకు 1567 సీట్లున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఐఐటీల్లో మొత్తంగా 500 సీట్ల వరకూ పెరిగాయి. కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో ఈ పెంపు అనివార్యమైంది. ఎన్‌ఐటీలో 23994 సీట్లు ఉంటే, ఇందులో మహిళలకు ప్రత్యేకంగా 749 సీట్లు ఉన్నాయి. ట్రిపుల్ ఐటీల్లో 7126 ఇంజనీరింగ్ సీట్లు (మహిళలకు 625), జీఎఫ్ఐటీల్లో 6759 (మహిళలకు 30) సీట్లున్నాయి.

● తెలంగాణ

హైదరాబాద్‌కు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్



సాక్షి, హైదరాబాద్/సనత్‌నగర్: రెండు రోజుల పర్యటన నిమిత్తం ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బేగంపేట ఎయిర్‌పోర్టులో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వాగతం పలికారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం జరగనున్న ఒడిశా ఇన్వెస్టర్స్ మీట్‌లో ఆయన పాల్గొంటారు. మంగళవారం బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి ముంబైకి వెళ్లిపోనున్నారు. వీలునుబట్టి ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకునే అవకాశం ఉంది.

కంట్రోల్ రూం ఏర్పాటు

పార్వతీపురం: అల్పపీడనం కారణంగా ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు ఆర్డీఓ కె.హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 31వరకు తుఫాన్, అధిక వర్షాలు కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా 24 గంటలు సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లను, మండల పరిషత్ అధికారులను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయంలో 8500525011 నంబరును అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు

గార: ప్లాంటేషన్ పనుల్లో భాగంగా ఎంపిక చేసిన రహదారులకు ఇరువైపులా కొత్తగా మొక్కలను నాటి.. వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. శ్రీకూర్మం, కె.సైరిగాం, వరమవల్లి, అంపోలు తదితర పంచాయతీల్లో ప్లాంటేషన్ పనులను ఆదివారం పరిశీలించారు. కొన్ని మొక్కలకు రక్షణ కంచె లేనట్టు గుర్తించి తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. చనిపోయిన మొక్కల ప్రదేశంలో కొత్తగా మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కలను పాడు చేయకుండా పశువులు, గొర్రెల పెంపకందారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈసీ నారంనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 51 వేల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథ ఆలయంలో నిత్యం జరుగుతున్న అన్న దానానికి నరసన్నపేటకు చెందిన ఆరంగి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సావిత్రమ్మ రూ. 51 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆలయ ఈవో జి.గురునాథం, పాలక మండలి సభ్యుడు డబ్బీరు వాసులకు ఈ మొత్తాన్ని ఆదివారం అందజేశారు. అలాగే ఆదివారం మధ్యాహ్నం అన్నదానానికి అల్లు సత్యం, మరిశర్ల కృష్ణమూర్తి నాయుడులు కలిసి ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పేరిట రూ.5,116 అందజేశారు.

తెప్పోత్సవం ట్రయల్ రన్ సక్సెస్



పెద్దచెరువులో తెప్పోత్సవం ట్రయల్ రన్‌లో పాల్గొన్న ఆలయ ఈఓ కిశోర్‌కుమార్, ఎమ్మార్వో బంగార్రాజు తదితరులు

- 18
-
  తెప్పలో 16 మందికే ఛా
- ఆలయ ఈఓ కిశోర్‌కుమార్

విజయనగరం టౌన్: చల్లని తల్లి సాక్షాత్కరించిన పెద్ద చెరువులో ఈ నెల 18న హంస వాహనంపై అమ్మవారి తెప్పోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఆదివారం తెప్ప ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా భక్తులతో ఆదివారం సాయంత్రం వేడుక నిర్వహించే పెద్దచెరువు పశ్చిమభాగం నుంచి కోటసత్తెమ్మ తల్లి ఆలయం వరకూ చెరువులో ట్రయల్ వేశారు. అనంతరం ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 18న సాయంత్రం 5.30గంటలకు తెప్పోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల తో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం నుంచి రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, స్నపన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ఆవరణలో వేద సభ నిర్వహిస్తామన్నారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పూజలు చేసి అనంతరం పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉంచి సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, పైడితల్లి దీక్షాదారులు, వేదపండితులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, సేవకులు భక్తుల జయజయధ్వానాల నడుమ అమ్మవారిని వనంగుడి నుంచి సున్నంబట్టీ వీధి మీదుగా పెద్ద చెరువులో అప్పటికే సిద్ధం చేసి ఉంచిన హంస వాహనంపై ఆశీనులు చేస్తారన్నారు. అక్కడ నుంచి అమ్మవారు పెద్దచెరువులో హంస వాహనంపై మూడుసార్లు కోటసత్తెమ్మ తల్లి ఆలయం వరకూ వెళ్లి విద్యుత్ కాంతుల నడుమ భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. తహసీల్దార్ చింతా బంగార్రాజు మాట్లాడుతూ 15 మంది గజ ఈతగాళ్లతో పాటూ లైఫ్ జాకెట్లును ఆర్డీఓ, అగ్నిమాపక శాఖ, మత్స్య శాఖ, పోలీస్ శాఖల పర్యవేక్షణలో ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు బలివాడ పార్వతీ, కాశీ, నక్కా జ్యోతి, చిల్లా పుష్పా, గొర్లె ఉమా, రామ్‌సింగ్ సూరమ్మ, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, డి.రామారావు, రమణమూర్తి, వర్మ, రమేష్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

23 ఏళ్లుగా తల్లిసేవలో...



పైడితల్లి అమ్మవారికి హంస వాహన సేవలో 23 ఏళ్లుగా తరిస్తున్నాను. ఇది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. సుమారు 8మంది 5రోజుల పాటూ తెప్పను ఉత్సవానికి సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యాం. ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించుకోగలిగాం. అమ్మ ఆశీస్సులు అందరిపైనా ఉండాలి.

–ఎస్.రాంబాబు, హంసవాహనం తయారీదారుడు, విజయనగరం

ఉత్తరావల్లిలో పులి కలకలం

- పులి దాడిలో ఆవు మృతి
- భయాందోళ

మెరకముడిదాం: గత కొద్ది రోజులు క్రితం నుంచి మండలంలో పెద్దపులి సంచరించడంతో పాటూ ఆవులు, మేకలపై దాడి చేసిన ఘటనలు ఇప్పుడిప్పుడే మర్చిపోతున్న మండల వాసులకు పెద్దపులి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. శనివారం రాత్రి ఉత్తరావల్లి గ్రామంలో ఉత్తరావల్లి దాలిరాజుకు చెందిన ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉత్తరావల్లి గ్రామానికి చెందిన ఉత్తరావల్లి దాలిరాజుకు చెందిన ఆవును ఎప్పటి మాదిరిగానే తన గొడ్లచావిడిలో కట్టే శనివారం సాయంత్రం కట్టేసాడు. ఆదివారం తెల్లవారు జామున ఆవుకు మేత వేసేందుకని దాలిరాజు వెళ్లి చూసేసరికి ఆవు కనిపించకపోవడంతో దాలిరాజు తన కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి వెతికారు. గ్రామానికి సమీపంలో వున్న అగురు తోటలో ఆవు మృతి చెంది వున్న విషయాన్ని గమనించి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ తలచుట్లహరిబాబుతో పాటూ గ్రామపెద్దలకు తెలియజేయగా హరిబాబు వెంటనే అటవీ శాఖాధికారులకు ఫోన్ ద్వారా విషయం తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖాధికారులు పాదముద్రలను పరిశీలించి ఆపాద ముద్రలు పులివేనని నిర్ధారించారు. ఆవుపై పులి దాడి విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



పులి దాడిలో మృతి చెందిన ఆవు

ఎంఆర్ అగ్రహారంలో పులి అలజడి

తెర్లాం: మండలంలోని ఎంఆర్ అగ్రహారం గ్రామంలోని మెట్టు భూముల్లో కొందరు రైతులకు ఆదివారం ఉదయం పెద్దపులి పాదముద్రలు కనిపించాయి. గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆదివారం ఉదయం పశువులకు గడ్డి కోసం వెళ్లగా అక్కడ పులి పాదముద్రలు చూసి భయపడ్డారు. వెంటనే గ్రామానికి వచ్చి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేయడంతో వారంతా భయాందోళనలు చెందుతున్నారు. ఇదే విషయాన్ని గ్రామ వీఆర్ఓకు తెలియజేయగా ఆయన గ్రామంలో దండోరా వేయించి ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, రాత్రి 7 గంటల తరువాత బయట తిరగవద్దని, పశువులను, గొర్రెలను ఇంటికి దగ్గర కట్టుకోవాలని సూచించారు. ఆదివారం ఉదయం ఎంఆర్ అగ్రహారంలో పులి పాదముద్రలు కనిపించిన విషయమై అటవీశాఖకు చెందిన బొబ్బిలి బీట్ ఆఫీసర్ స్వప్న వద్ద స్థానిక విలేకరులు ప్రస్తావించగా శనివారం రాత్రి ఎంఆర్ అగ్రహారం మీదుగా రావివలస వైపు పులి వచ్చినట్లు పాదముద్రలు ఉన్నాయని, వాటిని తాము గుర్తించామని తెలిపారు.



ఎంఆర్ అగ్రహారం పొలాల్లో కనిపించిన పులి పాదముద్రలు

ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు




బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్‌రావు

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బాలాజీ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. బాల్య వివాహాల నిరోధక అధికారులు గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిలుపుదల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1098పై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, జిల్లాన్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి బీ.హెచ్.వీ లక్ష్మీకుమారి, జిల్లా జువెనల్ జస్టిస్ బోర్డు సభ్యులు వి.లక్ష్మణరావు, బచపన్ బచావో ఆందోళన సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్, బాలల సంరక్షణ విభాగం అధికారి ఎం.అరసవిల్లినాయుడు, యాళ్ల నాగరాజు, కళాశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● గిరులను చుట్టేలా.. మంచు మబ్బులు

సీతంపేట మన్యంలోని కొండలను చుట్టేలా మంచు మబ్బులు చూపరులకు ఆదివారం ఉదయం ఇలా కనువిందు చేశాయి. మన్యంలోని రాజన్నగూడ, పెద్దగూడ తదితర గ్రామ పరిసరాల్లో ఉదయం కొండల చుట్టూ ఉన్న మంచు మబ్బులు భానుడు ఉదయించే సరికి అలా కనుమరుగయ్యాయి. – సీతంపేట



ఆత్మీయ ఆదరణ

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ఆత్మీయ ఆదరణ లభిస్తోంది. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అర్హులకు అవి అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు.


నంద్యాల జిల్లా మహానందిలో సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


ప్రకాశం జిల్లా కలుజువ్వలపాడులో ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గంటి గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


పల్నాడు జిల్లా మాచర్లలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

నేడే 'రైతు భరోసా'

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించనున్నారు.

- రైతు భరోసా ద్వారా అన్నదాతలకు ఏటా మూడు విడతల్లో రూ.13,500 సాయంగా ప్రభుత్వం అందచేస్తోంది. వరుసగా నాలుగో ఏడాది తొలి విడత సాయాన్ని మే నెలలో ఖరీఫ్‌కు ముందే రూ.7,500 చొప్పున ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది. సంక్రాంతి సమయంలో మూడో విడతగా మరో రూ.2,000 సాయాన్ని అందచేయనుంది.
- దేశంలో ఎక్కడా లేనివిధంగా సొంత భూమి సాగుచేసుకుంటున్న రైతులతో పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కౌలు రైతులు, ఆర్‌వోఎఫ్‌ఆర్, అటవీ, దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న అన్నదాతలకు కూడా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 చొప్పున అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే కావడం గమనార్హం. 50 లక్షల మందికిపైగా రైతన్నలకు ఏటా సుమారు రూ.7,000 కోట్లను రైతు భరోసా ద్వారా అందచేసి ఆదుకుంటోంది.
- రైతు భరోసా ద్వారా మొదటి విడతగా ఖరీఫ్ పంటలు వేసే ముందు మే నెలలో రూ.7,500 చొప్పున అందిస్తుండగా రెండవ విడతగా అక్టోబర్‌లో పంట కోతలు, రబీ అవసరాల కోసం రూ.4,000 చొప్పున సాయం అందుతోంది. మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ జనవరిలో రూ.2,000 చొప్పున ప్రభుత్వం ఇస్తోంది.
- తాజాగా అందించే రూ.2,096.04 కోట్లతో కలిపితే ఇప్పటివరకు ఒక్క వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ.25,971.33 కోట్ల మేర రైతన్నలకు లబ్ధి చేకూర్చడం గమనార్హం.
- చెప్పిన దానికంటే మిన్నగా రైతన్నలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాయాన్ని అందచేస్తోంది. ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50,000 అందిస్తామని మేనిఫెస్టోలో మాటివ్వగా సీఎం జగన్ ప్రభుత్వం అంతకు మించి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 అందచేస్తోంది. అంటే రైతన్నకు అదనంగా అందిస్తున్నది రూ.17,500.
- గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ పథకాల ద్వారా మూడేళ్ల నాలుగు నెలల్లో రైతన్నలకు సీఎం జగన్ ప్రభుత్వం దాదాపు రూ.1,33,526.92 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చింది. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ రైతు భరోసా, ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు పంట రుణాలు, బీమా రిజిస్ట్రేషన్, సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతుల తరఫున పూర్తి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తూ వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు, రైతులపై పైసా భారం లేకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తోంది. కనీస మద్దతు ధరతో పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. రైతన్నలకు పగటిపూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తూ వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోంది. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల కొరతను నివారించేలా వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని తెచ్చింది. పసుపు, మిర్చి, ఉల్లి, అరటి, బత్తాయి, ఐదు రకాల చిరుధాన్యాలతో సహా 26 పంటలకు పంట వేసినప్పుడే మద్దతు ధరలను ప్రకటించింది. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి భరోసా కల్పిస్తోంది. ఏడాది పొడవునా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండటంతో ఒక్కటి కూడా కరువు మండలంగా ప్రకటించే పరిస్థితి తలెత్తలేదు.
- టీడీపీ హయాంలో రైతన్నలకు కనీసం విత్తనాలు కూడా అందించలేని దుస్థితి నెలకొంది. ఇక ఎరువుల పంపిణీ, బీమా క్లెయిమ్‌లు అగమ్యగోచరమే. శాస్త్రీయ పంట నష్టాల అంచనాతోపాటు అయిన వారికే పరిహారం దక్కేది. నాడు ఏడాది పొడవునా కరువు తాండవించడంతో ఐదేళ్లలో 1,623 కరువు మండలాలను ప్రకటించాల్సి రావడం గత సర్కారు నిర్వాకాలకు నిదర్శనం. ఇక రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఆలోచనే గత పాలకులకు రాలేదు.



నేడు సీఎం పర్యటన ఇలా



- సీఎం జగన్ ఉదయం 9.00 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 10.15 గంటలకు ఆళ్లగడ్డ చేరుకుంటారు.
- 10.45 – 12.10 వరకు వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ నగదు బదిలీని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేస్తారు.
- మధ్యాహ్నం 12.35 గంటలకు తిరిగి బయలుదేరి 2.15 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

రైతు భరోసాతో ఇప్పటిదాకా ఎవరికి, ఎంత సాయం?

బీసీలు 24,61,000 మందికి రూ.12,113.11 కోట్లు	ఎస్సీలు 5,23,000 మందికి రూ.2,653.04 కోట్లు	ఎస్టీలు 3,92,000 మందికి రూ.1,771.13 కోట్లు
మైనార్టీలు 60,000 మందికి రూ.320.68 కోట్లు	కాపులు 7,85,700 మందికి రూ.3,793.44 కోట్లు	ఇతరులు 10,16,300 మందికి రూ.5,319.93 కోట్లు

మొత్తం 52,38,000 మందికి రూ.25,971.33 కోట్లు

క్లుప్తంగా

రాష్ట్రంలో పురోగమిస్తున్న విద్య, వైద్య రంగాలు

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్‌నారాయణ



గుణదల (విజయవాడ తూర్పు): ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదల ఈఎస్‌ఐ రోడ్డులోని రోటరీ క్లబ్ భవనంలో లోక్ సత్తా పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయని, ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు పురోగమిస్తున్నాయని అభినందించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కులం, మతం, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రజలందరికీ సంక్షేమ పాలన అందించాలని కోరారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

2024 ఎన్నికల వరకు సోము వీర్రాజే అధ్యక్షుడు!

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జ్ సునీల్ దేవధర్



సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజే 2024 ఎన్నికల వరకు కొనసాగుతారని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జ్ సునీల్ దేవధర్ పరోక్షంగా స్పష్టం చేశారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోము వీర్రాజు నాయకత్వంలోనే ఏపీలో తమ పార్టీ ఎన్నికలకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్రంలో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని.. ఆ మేరకు జాతీయ నాయకులు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ శూన్యత కనిపిస్తోందని, టీడీపీకి మళ్లీ అధికారం అప్పగించడానికి ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. కాగా, విశాఖలో పవన్‌కళ్యాణ్ పర్యటనను అడ్డుకోవడాన్ని బీజేపీ ఖండిస్తోందని చెప్పారు. పవన్‌తో సోము వీర్రాజు ఫోన్‌లో మాట్లాడారని.. పార్టీ ప్రతినిధిగా ఎమ్మెల్సీ మాధవ్‌ను అక్కడికి పంపామని పేర్కొన్నారు.

ఆర్‌ఎంసీ భేటీ వాయిదా

ఏపీ ఈఎన్‌సీ ప్రతిపాదనకు కృష్ణాబోర్డు ఆమోదం

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ నియమావళి ఖరారే అజెండాగా సోమవారం హైదరాబాద్‌లో జరగాల్సిన రిజర్వాయర్ల నిర్వహణ కమిటీ(ఆర్‌ఎంసీ) సమావేశం వాయిదా వేయాలని ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ప్రతిపాదనకు కృష్ణా బోర్డు ఆమోదం తెలిపింది. కృష్ణా నదికి భారీగా వరదలు వస్తున్న నేపథ్యంలో వరద నియంత్రణ చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని ఆర్‌ఎంసీ కన్వీనర్ ఆర్కే పిళ్లైని ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి కోరారు. దీనిపై ఆర్కే పిళ్లై సానుకూలంగా స్పందించారు. మళ్లీ సమావేశం నిర్వహించడంపై రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు ముందస్తుగా సమాచారం ఇస్తామని తెలిపారు.

బీజేపీ విధానాలపై పోరాటాలు తీవ్రతరం

సీపీఐ జాతీయ మహాసభలో తీర్మానం

సాక్షి, అమరావతి: దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలపై పోరాటాలను తీవ్రతరం చేయాలని సీపీఐ 24వ జాతీయ మహాసభలు తీర్మానం చేశాయి. విజయవాడలో జరుగుతున్న మహాసభల వివరాలను ఆ పార్టీ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, అమర్‌జిత్ కౌర్, అతుల్‌కుమార్ అంజాన్, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలు మీడియా సమావేశంలో వెల్లడించారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చాక సంస్కరణల అజెండా అమల్లో వేగం పెరిగిందని, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రభావం ప్రజల్లో తీవ్రమైన అసమానతలకు దారితీసిందని చెప్పారు. ఫలితంగా కొద్ది మంది చేతుల్లోకే సంపద కేంద్రీకరణకు దారితీసిందన్నారు. కార్పొరేట్‌లకు రాయితీలు పెంచుతున్నారని, అదే సమయంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పేదరికం పెచ్చుమీరి ఆకలి చావులు పెరిగాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని మహాసభ తీర్మానించినట్టు వివరించారు. అలాగే మూడేళ్ల బిడ్డకు తల్లీ, తండ్రి ఎవరో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని, తెలుగు ప్రజలు ఎక్కడికి వెళ్లినా మీ రాజధాని ఏది అంటే చెప్పలేక పోతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చెప్పారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ తీర్మానం చేసినట్టు చెప్పారు.


మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

యువతరానికే నాయకత్వ పగ్గాలివ్వాలి: పార్టీ నిర్మాణంపై ప్రతినిధులు

పార్టీని సంస్థాగతంగా చక్కదిద్దుకోకుండా ఉద్యమ పథంలో రాణించలేమని సీపీఐ జాతీయ మహాసభల్లో పలువురు ప్రతినిధులు తెగేసి చెప్పారు. విజయవాడలోని గురుదాస్ దాస్‌గుప్త నగర్‌లో జరుగుతున్న మహాసభల్లో 'పార్టీ నిర్మాణం'పై ఆదివారం వాడివేడీ చర్చ జరిగింది. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చలో తమ అభిప్రాయాలను స్పష్టం చేశారు. పార్టీలో వృద్ధ నేతల అనుభవాన్ని ఉపయోగించుకుంటూ యువతరానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని కోరారు.

కమ్యూనిజం అజేయం: 17 దేశాలకు చెందిన 31 మంది ప్రతినిధుల ఉద్ఘాటన

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో విస్తరించిన కమ్యూనిజానికి తిరుగులేదని, పీడిత, తాడిత జనం కోసం పోరాడే కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందని 17 దేశాలకు చెందిన 31 మంది ప్రతినిధులు తమ సందేశాన్ని విన్పించారు. మతతత్వ శక్తులను తిప్పికొడదామని, ఆంక్షలు పెడుతున్న అమెరికాకు తగిన గుణపాఠం చెబుతామని, పెట్టుబడిదారీ విధానాలపై రాజీలేని పోరును కొనసాగించాలని వివిధ దేశాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

కర్ణాటక గవర్నర్‌తో విశ్వభూషణ్ భేటీ

సాక్షి, అమరావతి: కర్ణాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లాట్‌తో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బెంగళూరులో ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రస్తుతం కర్ణాటక పర్యటనలో ఉన్న ఆయన బెంగళూరులోని రాజ్‌భవన్‌కు వెళ్లారు. సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై ఇద్దరూ కాసేపు చర్చించుకున్నారు. అనంతరం కర్ణాటక ఒడిశా అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పాల్గొని ప్రసంగించారు.



విమానాశ్రయం రోడ్డు సుందరీకరణ

సాక్షి, అమరావతి: విజయవాడ నుంచి గన్నవరం విమానాశ్రయంవరకు ఉన్న ప్రధాన రోడ్డును హరిత అందాలతో తీర్చిదిద్దేందుకు ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ జాతీయ రహదారికి ఇరువైపులా హరిత వనంలా మార్చే ప్రణాళికలను సైతం గ్రీనింగ్ కార్పొరేషన్ అధికారులు రూపొందించి అమలు చేస్తున్నారు. ముఖ్యంగా రామవరప్పాడు రింగు నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు దాదాపు 14 కి.మీ. రోడ్డుకు ఇరువైపులా 34 రకాల మొక్కలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో మొక్కలు నాటే పనులు సైతం ప్రారంభించారు. ఈ మొక్కల సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని గ్రీనింగ్ కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పెంపకానికి ఉచితంగా చెట్లు, మొక్కలు..

గ్రీనింగ్ కార్పొరేషన్ రూపొందించిన సుందరీకరణ ప్రణాళికలో భాగంగా తొలుత ఇక్కడ ఇమడలేని చెట్లు, మొక్కలను పూర్తిగా తొలగించి ఆసక్తి గల వారు పెంచుకునేందుకు ఇస్తామని ఎండీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తొలగించే చెట్లు, మొక్కల్లో దాదాపు 350 రకాలు ఉన్నాయని వివరించారు. మొక్కలు కావాల్సిన వారు 9346812600 లేదా 0866 2530833 నంబర్లలో సంప్రదించాలని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

కర్నూలులో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల పోలింగ్ కేంద్రం

కర్నూలు (సెంట్రల్): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 350 మంది ఏఐసీసీ డెలిగేట్స్ కోసం కర్నూలులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరుగనుంది.

ఒడిశా సీఎంకు వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ జన్మదినం సందర్భంగా ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నవీన్ పట్నాయక్‌కు భగవంతుడు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షును అందించాలని ట్వీట్ చేశారు.

ఇంటింటికీ స్మార్ట్ మీటర్లు

- కేంద్రం నిర్ణయం మేరకు రాష్ట్రంలో అమలుకు సన్నాహాలు
- ఇంధన శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: సంప్రదాయ విద్యుత్ మీటర్ల స్థానంలో దేశవ్యాప్తంగా దాదాపు 25 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్‌ను ఏపీలో అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలతో మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్, కచ్చితమైన విద్యుత్ బిల్లులు, ఉత్తమ సేవలు అందుతాయని మంత్రి వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరగడంతో పాటు సాంకేతిక, వాణిజ్య నష్టాలు తగ్గేందుకు ఇవి దోహదపడతాయని ఆయన అన్నారు.

బ్రిటన్, కేంద్ర అధికారుల భేటీ

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ.. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గేరేత్ విన్ ఓవెన్, బ్రిటిష్ హై కమిషన్ ఇంధన సలహాదారు సుష్మిత రామోజీ, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ఇంధన శాఖ అధికారులను రెండు రోజుల క్రితం కలిసి ఏపీలో చేపట్టనున్న స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టుపై చర్చించారని మంత్రికి వివరించారు. ఈ మీటర్లు ఇంటర్నెట్‌కు అనుసంధానించడం వల్ల విద్యుత్ వినియోగ వివరాలు డిస్కంలకే గాక వినియోగదారులకు కూడా ఏరోజుకారోజు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ చౌర్యం వంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, వోల్టేజీ హెచ్చుతగ్గులను స్మార్ట్ మీటర్ రికార్డు చేస్తుందని వివరించారు. కాగా, ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలో స్మార్ట్ మీటర్ ప్రాజెక్టు అమలుకు రూ.947.15 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి సమర్పించినట్టు డిస్కం సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్ధనరెడ్డి, ఏపీ ఎస్‌ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర గొంతు నొక్కటానికే
తప్పుడు రాతలు

- విశాఖ రాజధాని కావాలంటున్న గళాలను అణచివేయాలనుకుంటున్నారు
- రియల్ ఎస్టేట్ సామ్రాజ్యం సృష్టించడానికే ఆ పత్రికల తాపత్రయం
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజం



సాక్షి, అమరావతి, శ్రీకాకుళం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు, ఆశయాల కోసం గొంతెత్తి మాట్లాడుతున్నందుకే తమలాంటి వాళ్ల పీక నొక్కాలని కొన్ని పత్రికలు ప్రయత్నిస్తున్నాయని రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. తన నోరు మూయడం కోసమే తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎప్పుడో 2005లో కొన్ని ఎన్‌ఓసీలు ఇచ్చారని, అవన్నీ అప్పట్లో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రయోజనాలకోసమే జరిగాయని పేర్కొంటూ ఇప్పుడు 'ఈనాడు' పత్రిక వరస కథనాలు వేస్తుండటంపై ఆయన స్పందించారు. ''విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ఉండాలని కొన్ని గొంతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. అలాంటి గళాలన్నిటినీ నొక్కి ఆ పత్రికలు ఏం సాధించాలనుకుంటున్నాయో నాకైతే అర్థం కావటం లేదు'' అని వ్యాఖ్యానించారు. ఇలా గొంతులు నొక్కటం ద్వారా అమరావతిలో ఒక రియల్ ఎస్టేట్ మాఫియాను నిర్మించాలనుకుంటున్నారని, అదే వారి ప్రయోజనమని చెప్పారు. రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను సృష్టించి ఆస్తులు సంపాదించాలనే తాపత్రయం తప్ప వారి ఆలోచనల్లో ప్రజల కోణం ఏమీ లేదన్నారు. స్వల్ప ప్రయోజనాల కోసం వాళ్లు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని, తాము విశాల ప్రయోజనాల కోసం పోరాటం మొదలుపెట్టామని స్పష్టంచేశారు. ''నాది 40 సంవత్సరాల రాజకీయ జీవితం. అలాంటి నా క్యారెక్టర్‌పై మచ్చ వేయటం వారి తరం కాదు. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న చంద్రబాబు కుట్రలను ఎదుర్కోవటమే మాకు ముఖ్యం. ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలే మాకు ప్రధానం'' అన్నారు. వాళ్లు ఆరోపిస్తున్న వ్యవహారాలను చూస్తే... ఎన్‌ఓసీలు ఇవ్వటం వంటివి మంత్రి నిర్ణయం తీసుకునేవి కాదని, కలెక్టర్ల స్థాయిలోనే ఆ నిర్ణయాలు జరుగుతాయని వివరించారు. ''చంద్రబాబు కూడా రెవెన్యూ మంత్రిగా పనిచేశాడు. ఆయనకు ఇవన్నీ తెలియదా? మసిపూసి మారేడు కాయ చేయాలనుకుంటే ఎలా?'' అని ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రికి, జిల్లా స్థాయిలో కార్యకలాపాలకు సంబంధం ఉండదని, జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల స్థాయిలోనే ఇదంతా జరుగుతుందని చెప్పారు. వికేంద్రీకరణ కోసం జరుగుతున్న ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికే ఈ తరహా తప్పుడు రాతలు రాస్తున్నారంటూ... ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసం ఇంకా గట్టిగా గళం వినిపిస్తానని స్పష్టం చేశారు.


రాజధానికన్నా పదవి ముఖ్యం కాదు

విశాఖ రాజధాని కావాలా.. మంత్రి పదవి కావాలా..? అని అడిగితే ఉత్తరాంధ్ర ప్రజల కోసం మంత్రి పదవినైనా వదిలేస్తానని ధర్మాన ప్రసాదరావు స్పష్టంచేశారు. శ్రీకాకుళంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పాల్గొని ఉద్వేగంగా మాట్లాడారు. రాష్ట్రం విడిపోయాక శివరామకృష్ణన్ కమిటీ, శ్రీభాగ్ కమిటీ వంటివి అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి అవసరమని ప్రతిపాదించాయని గుర్తు చేశారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం చంద్రబాబు తన ఇంటిలో స్కెచ్ వేసి అమరావతి, గుంటూరు, నూజివీడు ప్రాంతాలనే రాజధానిగా ప్రకటించి ఇతర ప్రాంతాల వారి నోట్లో మట్టి కొట్టారని దుయ్యబట్టారు. రాజధాని కోసం మద్రాసుకు 70 ఏళ్లు, కర్నూలుకు మూడేళ్లు, హైదరాబాద్‌కు 58 ఏళ్ల పరుగులు పెట్టామని, 130 ఏళ్లుగా ఉత్తరాంధ్ర వాసులు రాజధానికి దూరంగానే ఉన్నారని వివరించారు. విశాఖలో వాయు, జల, రైలు మార్గాలు అనువుగా ఉన్నాయని సీఎం వైఎస్ జగన్ నిర్ణయానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా ఉత్తరాంధ్రులంతా ఏకమై విశాఖకు రాజధాని తెప్పించుకోవాలన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అమరావతిలో కేవలం చెట్లు, రేకులు తప్ప ఏమీ లేవన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

తుంగభద్ర జలాలపై కర్ణాటక, ఏపీ ఉన్నతస్థాయి భేటీ

రేపు బెంగళూరులో రెండు రాష్ట్రాల జల వనరుల ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీల సమావేశం

- తుంగభద్ర డ్యామ్‌లో 105.78 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వ
- నవలి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తామంటున్న కర్ణాటక
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న తెలుగు రాష్ట్రాలు



సాక్షి, అమరావతి: తుంగభద్ర జలాశయంలో బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 230 టీఎంసీలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంపై చర్చించేందుకు బెంగళూరు వేదికగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జల వనరుల శాఖల ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు మంగళవారం భేటీ కానున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు ఎగువన కర్ణాటక సర్కార్ ప్రతిపాదిస్తున్న నవలి రిజర్వాయర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న హెచ్చెల్సీ సమాంతర కాలువ అంశంపై ప్రాథమికంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తదుపరి చర్యలు తీసుకుంటాయని అధికార వర్గాలు వెల్లడించాయి. తుంగభద్ర డ్యామ్‌ను 133 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 1953లో నిర్మించారు. డ్యామ్ వద్ద 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్ కర్ణాటకకు 151.49, ఆంధ్రప్రదేశ్‌కు 72, తెలంగాణకు 6.51 టీఎంసీలను కేటాయించింది. పూడిక వల్ల డ్యామ్‌లో నీటి నిల్వ 105.78 టీఎంసీలకు తగ్గింది. దీంతో డ్యామ్‌లో నీటి లభ్యత ఆధారంగా మూడు రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో జలాలను తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తూ వస్తోంది.

వాటా జలాలను వాడుకోవడానికే..

డ్యామ్‌లో పూడిక పేరుకుపోవడం వల్ల మూడు రాష్ట్రాలు ఏటా సగటున 167 నుంచి 175 టీఎంసీలకు మించి వాడుకోలేకపోతున్నామని కర్ణాటక సర్కార్ చెబుతోంది. పూడిక తీయడానికి రూ.12,500 కోట్లు వ్యయం అవుతుందని లెక్కలు వేస్తోంది. దానికి బదులుగా తుంగభద్ర డ్యామ్‌కు ఎగువన నది నుంచి వరద కాలువ తవ్వి నవలి వద్ద కొత్తగా 52 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని చెబుతోంది. దీంతోపాటు విఠల్‌పుర చెరువు సామర్థ్యాన్ని 4.52 టీఎంసీలకు పెంచి శివపుర చెరువు సామర్థ్యాన్ని 1.56 టీఎంసీలకు పెంచి ఎడమ కాలువ కింద ఆయకట్టును స్థిరీకరిస్తామని.. తుంగభద్ర డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటితో మిగతా వాటా జలాలను వాడుకోవచ్చునని కర్ణాటక ప్రతిపాదిస్తోంది. ఈ రిజర్వాయర్ పనులకు రూ.9,500 కోట్ల వ్యయం అవుతుందని.. దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలు భరించాలని తుంగభద్ర బోర్డు సమావేశాల్లో కోరుతూ వస్తోంది. దీన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యతిరేకిస్తున్నాయి. అప్పర్ భద్ర, సింగటలూరు ఎత్తిపోతల ద్వారా ఇప్పటికే కేటాయించిన నీటి కంటే అధికంగా కర్ణాటక వాడుకుంటోందని.. నవలి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే తమ హక్కులకు విఘాతం కలుగుతుందని స్పష్టం చేస్తున్నాయి. తుంగభద్ర హెచ్చెల్సీ(ఎగువ కాలువ)కు సమాంతరంగా వరద కాలువ తవ్వి.. వరద రోజుల్లో వాటా (32.5 టీఎంసీలు) తరలిస్తామని.. డ్యామ్‌లో నిల్వ నీటిని మూడు రాష్ట్రాలు పంచుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో వాటా జలాలను వాడుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది.

సీఎం జగన్‌ను చర్చలకు ఆహ్వానించిన కర్ణాటక సీఎం

నవలి రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకరించాలని, వాటా జలాలను మాత్రమే వాడుకుంటామని, దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్‌లకు ఆరు నెలల క్రితం కర్ణాటక సీఎం బొమ్మై లేఖలు రాశారు. ఇదే అంశంపై నాలుగు రోజుల క్రితం సీఎం వైఎస్ జగన్‌తో కర్ణాటక సీఎం బొమ్మై ఫోన్‌లో చర్చించారు. తుంగభద్ర జలాల వినియోగంపై చర్చలకు ఆహ్వానించారు. తొలుత రెండు రాష్ట్రాల జల వనరుల శాఖల కార్యదర్శుల స్థాయిలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిద్దామని, ఆ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఇద్దరు సీఎంలు నిర్ణయించారు. ఇద్దరు సీఎంలు తీసుకున్న నిర్ణయం మేరకే మంగళవారం రెండు రాష్ట్రాల జల వనరుల శాఖల ఉన్నతాధికారులు సమావేశమవుతున్నారు.



ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో కాంస్యం నెగ్గిన శ్రీను

ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ బుగథ శ్రీను ఆదివారం జరిగిన ఢిల్లీ హాఫ్ మారథాన్ రేసులో (21.097 కిలోమీటర్లు) 65 నిమిషాల 25 సెకన్లలో లక్ష్యానికి చేరి కాంస్య పతకాన్ని సాధించాడు. అవినాశ్ సాబ్లే 64 నిమిషాల్లో లక్ష్యానికి చేరి స్వర్ణం నెగ్గగా... కార్తీక్ కుమార్ రజతం దక్కించుకున్నాడు. విజేత అవినాశ్ సాబ్లేకు రూ. 3 లక్షల 50 వేలు... కార్తీక్‌కు రూ. 2 లక్షల 75 వేలు... శ్రీనుకు రూ. లక్షా 75 వేలు ప్రైజ్‌మనీగా లభించాయి.



నేడు ఆసీస్‌తో భారత్ వార్మప్ మ్యాచ్

ఆస్ట్రేలియాలోని పరిస్థితులకు అలవాటు పడేందుకు అందరికంటే ముందుగా అక్కడికి చేరుకున్న భారత జట్టు స్థానిక జట్లతో రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లాడింది. ఇప్పుడు టి20 ప్రపంచకప్ కోసం ఫించ్ కెప్టెన్సీలోని ఆస్ట్రేలియాతో ఐసీసీ ఏర్పాటు చేసిన వార్మప్ మ్యాచ్ ఆడేందుకు భారత ప్రధాన జట్టు నేడు బరిలోకి దిగనుంది. కెప్టెన్ రోహిత్, కోహ్లి ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తారు. ఉదయం గం. 8: 30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

రన్నరప్‌గా సిక్కి రెడ్డి, రుత్విక




బెంగళూరు: ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణులు గద్దె రుత్విక శివాని, సిక్కి రెడ్డి రజత పతకాలు సాధించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రుత్విక శివాని మహిళల సింగిల్స్‌లో... సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్‌లో ఓడిపోయారు. సింగిల్స్ తుది పోరులో రుత్విక 19–21, 21–17, 17–21తో తాన్యా (భారత్) చేతిలో ఓటమి చవిచూడగా... మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 16–21, 21–11, 18–21తో అశ్విని పొన్నప్ప–సాయిప్రతీక్ (భారత్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సౌరభ్ వర్మ 21–18, 17–21, 21–16తో మిథున్ మంజునాథ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు.

అర్జున్ సంచలనం

ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్‌పై విజయం





చెన్నై: ఎయిమ్‌చెస్ ర్యాపిడ్ ఆన్‌లైన్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో అర్జున్ 54 ఎత్తుల్లో గెలిచాడు. డూడా (పోలాండ్)తో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 45 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. 16 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఎనిమిదో రౌండ్ తర్వాత అర్జున్ 15 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ టోర్నీ నిబంధనల ప్రకారం విజయం సాధిస్తే మూడు పాయింట్లతోపాటు 750 డాలర్లు (రూ. 61 వేలు), 'డ్రా' చేసుకుంటే ఒక పాయింట్‌తోపాటు 250 డాలర్లు (రూ. 20 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

లంకకు నమీబియా షాక్

- 55 పరుగులతో ఆసియా చాంపియన్‌పై అద్భుత విజయం
- ఫ్రయ్‌లింక్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- టి20 ప్రపంచకప్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫ్రయ్‌లింక్

గిలాంగ్: ఆసియా టి20 చాంపియన్ శ్రీలంకకు క్రికెట్ కూన నమీబియా పెద్ద షాకే ఇచ్చింది. టి20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ' తొలి రౌండ్ (క్వాలిఫయర్స్) మ్యాచ్‌లో నమీబియా 55 పరుగుల తేడాతో 2014 టి20 ప్రపంచకప్ విజేత లంకను చిత్తు చేసింది. గతేడాది యూఏఈలో జరిగిన పొట్టి ప్రపంచకప్‌లో ఆకట్టుకున్న నమీబియా ఇక్కడ తొలి మ్యాచ్‌తోనే శుభారంభం చేసింది. మొదట నమీబియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జాన్ ఫ్రయ్‌లింక్ (28 బంతుల్లో 44; 4 ఫోర్లు), స్మిట్ (16 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఒకదశలో 14.2 ఓవర్లలో 93 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన నమీబియాను ఫ్రయ్‌లింక్, స్మిట్ ధాటిగా ఆడి ఆదుకున్నారు. ఇద్దరు చివరి 5.4 ఓవర్లలోనే ఏడో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. లంక బౌలర్లలో మదుషాన్ 2 వికెట్లు పడగొట్టాడు. తర్వాత శ్రీలంక 19 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ దాసున్ షనక (23 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), రాజపక్స (21 బంతుల్లో 20; 2 ఫోర్లు) తప్ప ఇంకెవరూ ఎంతోసేపు క్రీజులో నిలువలేకపోయారు. ఫ్రయ్‌లింక్ (2/26), స్మిట్ (1/16) బంతితోనూ ఆకట్టుకున్నారు. వీస్, బెర్నార్డ్, షికొంగో తలా 2 వికెట్లు తీశారు.

నెదర్లాండ్స్ బోణీ

ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో యూఏఈపై నెదర్లాండ్స్ ఆఖరిదాకా చెమటోడ్చి నెగ్గింది. తక్కువ స్కోర్ల ఈ మ్యాచ్ ఆఖర్లో కాస్త ఉత్కంఠ రేపినా... నెదర్లాండ్స్ 3 వికెట్ల తేడాతో గట్టెక్కింది. తొలుత యూఏఈ 20 ఓవర్లలో 8 వికెట్లకు 111 పరుగులు చేసింది. ఓపెనర్ వసీమ్ (47 బంతుల్లో 41; 1 ఫోర్, 2 సిక్సర్లు) రాణించాడు. బస్ డి లీడే (3/19) ఒక్క ఓవర్‌తో మలుపు తిప్పాడు. 91/2 స్కోరుతో ఒకదశలో పటిష్టంగానే కనిపించిన యూఏఈకు అదేస్కోరుపై వసీమ్ వికెట్‌ను కోల్పోయాక కష్టాలు మొదలయ్యాయి. 18వ ఓవర్లో ఫరీద్ (2) రనౌటయ్యాడు. ధనాధన్ ఆడే డెత్ ఓవర్లలో పరుగులకు బదులు వికెట్లు రాలడంతో యూఏఈ ఊహించనిరీతిలో కట్టడి అయ్యింది. 19వ ఓవర్ వేసిన డి లీడే మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును దెబ్బ తీశాడు. అరవింద్ (18), బాసిల్ హమీద్ (4), కెప్టెన్ రిజ్వాన్ (1)లను లీడే అవుట్ చేశాడు. ఆఖరి ఓవర్లో అఫ్జల్ ఖాన్ (5)ను క్లాసెన్ పెవిలియన్ చేర్చడంతో... కేవలం 19 పరుగుల వ్యవధిలోనే యూఏఈ 6 వికెట్లను కోల్పోయింది. తర్వాత నెదర్లాండ్స్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 112 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ ఓడోడ్ (23; 3 ఫోర్లు, 1 సిక్స్), ఆఖర్లో కెప్టెన్ ఎడ్వర్డ్స్ (16 నాటౌట్), ప్రింగిల్ (5) కుదురుగా ఆడి గెలిపించారు. జునైద్ సిద్దిఖ్ 3 వికెట్లు తీశాడు. చివరి 12 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన దశలో 19 ఓవర్లో ప్రింగిల్‌ను జహూర్ ఖాన్ అవుట్ చేయగా 4 పరుగులే వచ్చాయి. 6 బంతుల్లో 6 పరుగుల విజయ సమీకరణం యూఏఈని ఊరించినప్పటికీ ఎడ్వర్డ్స్, వాన్ బిక్ (4) షాట్ల జోలికి వెళ్లకుండా ఒకట్రెండు పరుగులు తీసి జట్టును గెలిపించారు.

గ్రూప్ 'బి'లో నేటి మ్యాచ్‌లు

స్కాట్లాండ్ X వెస్టిండీస్ (ఉదయం గం. 9:30 నుంచి)
ఐర్లాండ్ X జింబాబ్వే (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

మన గురి అదిరింది

- ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఐదో స్వర్ణం
- 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకం



స్వర్ణాలతో అర్జున్, అంకుశ్, రుద్రాంక్ష్ (ఎడమ నుంచి)

కైరో (ఈజిప్ట్): ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల నిలకడైన ప్రదర్శన కొనసాగుతోంది. ఆదివారం భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం లభించాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్, అర్జున్ బబూటా, అంకుశ్ కిరణ్ జాదవ్‌లతో కూడిన భారత జట్టు పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. చైనాతో జరిగిన ఫైనల్లో భారత బృందం 16–10 పాయింట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. తొలుత 28 జట్లు పాల్గొన్న క్వాలిఫికేషన్ స్టేజ్–1లో భారత జట్టు 945.2 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్ స్టేజ్–1లో టాప్–8లో నిలిచిన జట్లు క్వాలిఫికేషన్ స్టేజ్–2కు అర్హత పొందాయి. స్టేజ్–2లో భారత బృందం 628.5 పాయింట్లు సాధించి రెండో స్థానంలో... చైనా 629.4 పాయింట్లు స్కోరు చేసి తొలి స్థానంలో నిలిచి స్వర్ణ–రజత పతక పోరుకు అర్హత సాధించాయి. ఫైనల్లో భారత షూటర్లు ఏదశలోనూ ఏకాగ్రత కోల్పోకుండా ఆడి విజయాన్ని అందుకున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పలక్, రిథమ్ సాంగ్వాన్, యువికలతో కూడిన భారత జట్టు రజత పతకం సాధించింది. ఫైనల్లో భారత్ 8–16తో చైనా చేతిలో ఓడింది. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సూర్య ప్రతాప్, పంకజ్, సర్తాజ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

తిలక్ వర్మ జోరు

వరుసగా నాలుగో అర్ధ సెంచరీ చేసిన హైదరాబాద్ బ్యాటర్



జైపూర్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ మూడో విజయం నమోదు చేసింది. త్రిపుర జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' నాలుగో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. యువ బ్యాటర్ తిలక్ వర్మ తన అద్భుతమైన ఫామ్ కొనసాగిస్తూ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ అర్ధ సెంచరీ సాధించాడు. త్రిపుర నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ సరిగ్గా 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తిలక్ వర్మ 46 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 67 పరుగులు చేశాడు. మికిల్ జైస్వాల్ (21 బంతుల్లో 32; 1 ఫోర్, 2 సిక్స్‌లు), తనయ్ త్యాగరాజన్ (11 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడి హైదరాబాద్ విజయానికి బాటలు వేశారు. అంతకుముందు త్రిపుర 20 ఓవర్లలో 8 వికెట్లకు 158 పరుగులు చేసింది. రవితేజ, తనయ్ త్యాగరాజన్ రెండేసి వికెట్లు తీశారు.

అశ్విన్ మెరుపులు: ఆంధ్రకు తొలి గెలుపు



అశ్విన్

ఇండోర్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయాన్ని అందుకుంది. నాగాలాండ్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'డి' మూడో లీగ్ మ్యాచ్‌లో శ్రీకర్ భరత్ కెప్టెన్సీలోని ఆంధ్ర జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న నాగాలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 169 పరుగులు సాధించింది. శ్రీకాంత్ ముండే (53 బంతుల్లో 91 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ఆంధ్ర బౌలర్లలో బండారు అయ్యప్ప రెండు వికెట్లు తీశాడు. అనంతరం ఆంధ్ర 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ అశ్విన్ హెబ్బర్ (25 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ చేశాడు. ఆ తర్వాత రికీ భుయ్ (24 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షేక్ రషీద్ (27 బంతుల్లో 37 నాటౌట్; 3 ఫోర్లు), కరణ్ షిండే (15 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఆకట్టుకొని ఆంధ్రను విజయతీరానికి చేర్చారు. వర్షంతో ఆంధ్ర జట్టు తొలి రెండు లీగ్ మ్యాచ్‌లు రద్దయ్యాయి.

10 వికెట్లతో నెగ్గిన ఆంధ్ర

బెంగళూరు: బీసీసీఐ సీనియర్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ రెండో పరాజయం చవిచూసింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 10 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట హైదరాబాద్ 5 వికెట్లకు 52 పరుగులు చేసింది. ఓపెనర్ జి.త్రిష (30; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆంధ్ర బౌలర్ దేవిక రెండు వికెట్లు పడగొట్టింది. అనంతరం ఆంధ్ర 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు ఎస్.అనూష (21 బంతుల్లో 29 నాటౌట్; 5 ఫోర్లు), స్నేహ దీప్తి (15 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

ఏపీ అథ్లెట్ జ్యోతిక శ్రీకి కాంస్యం



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ కాంస్య పతకాన్ని సాధించింది. బెంగళూరులో ఆదివారం జరిగిన మహిళల 400 మీటర్ల ఫైనల్ రేసును జ్యోతిక శ్రీ 53.43 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. శుభ (తమిళనాడు; 52.67 సెకన్లు) స్వర్ణం, సోనియా (రైల్వేస్; 53.38 సెకన్లు) రజతం గెలిచారు. హైదరాబాద్‌లో భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కోచ్ నాగపురి రమేశ్ వద్ద జ్యోతిక శ్రీ శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో జ్యోతిక రజతం సాధించింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఎస్ఎస్‌సీ జాబ్స్

వాతావరణ శాఖలో

సైంటిఫిక్ అసిస్టెంట్

» ఐఎండీలో 990 నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ ప్రకటన
» ఎంపికైతే ప్రారంభంలోనే రూ.60వేల వరకూ వేతనం
» నిర్దేశిత డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

భారత వాతావరణ విభాగం(ఇండియన్ మెటిరియోలాజికల్ డిపార్ట్‌మెంట్–ఐఎండీ)లో గ్రూప్ బి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ పోస్టులైన సైంటిఫిక్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ప్రకటన విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 990 కొలువులను భర్తీ చేయనుంది. సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ సైంటిఫిక్ అసిస్టెంట్ నియామక పరీక్ష–2022 పూర్తి వివరాలు..

అర్హతలు

» ఫిజిక్స్,మ్యాథమెటిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్/10+2 ఉత్తీర్ణత తర్వాత సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత(డిగ్రీలో ఫిజిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ /కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి). లేదా ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్/10+2 ఉత్తీర్ణత తర్వాత ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.

» వయసు: 18.10.2022 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా..

ఈ పరీక్షను రెండు పార్ట్‌లుగా కంప్యూటర్ ఆధారంగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. ఒక్కో పార్ట్ 100 మార్కులకు ఉంటుంది. రెండు పార్ట్‌లకు కలిపి పరీక్ష సమయం 120 నిమిషాలు.

» పార్ట్–1: ఈ సెక్షన్‌కు సంబంధించి నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్–25 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్–25 ప్రశ్నలు,ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్–25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్ నుంచి 25 ప్రశ్నల చొప్పున మొత్తం వంద ప్రశ్నలు–వంద మార్కులకు అడుగుతారు.

» పార్ట్–2: ఈ విభాగంలో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ /ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌ల నుంచి 100 ప్రశ్నలు–వంద మార్కులకు పరీక్ష ఉంటుంది.

» నెగిటివ్ మార్కులు: ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25శాతం కోత విధిస్తారు.

» అభ్యర్థులు పార్ట్ 1, పార్ట్ 2.. రెండు విభాగాలను రాయాల్సి ఉంటుంది. పార్ట్ 2 పరీక్ష అభ్యర్థులు దరఖాస్తు సమయంలో ఎంచుకున్న సబ్జెక్టుపై ఉంటుంది. ఉదాహరణకు ఫిజిక్స్‌ను తమ సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్న వారికి పార్ట్ 2 పూర్తిగా ఫిజిక్స్‌పై ఉంటుంది.

సిలబస్ ఇలా..

» జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్: ఈ విభాగంలో వెర్బల్–నాన్ వెర్బల్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అనాలజీస్, సిమిలారిటీస్, డిఫరెన్సెస్, స్పేస్ విజువలైజేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, అనాలిసిస్, జడ్జిమెంట్, డెసిషన్ మేకింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.

» జనరల్ అవేర్‌నెస్: ఇందులో జనరల్ ఫిజికల్, జాగ్రఫికల్, టోపోగ్రఫికల్, ఎకనామిక్ అండ్ క్లయిమెట్ ఫీచర్స్ ఆఫ్ ఇండియా, కరెంట్ ఈవెంట్స్, రోజువారీ వార్తాంశాలు, మ్యాథమెటిక్స్ బేసిక్స్, కెమిస్ట్రీ,ఫిజిక్స్, భారత దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్య్ర ఉద్యమం, భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు, ఆర్థిక, సామాజిక అంశాలు ఉంటాయి.

» క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఈ విభాగంలో ముఖ్యంగా నెంబర్స్ వినియోగంపై అభ్యర్థుల సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. ఇందులో కంప్యూటేషనల్ నంబర్స్, డెసిమల్స్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్, ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్ తదితర అంశాల నుంచి ప్రశ్నలను అడుగుతారు.

» ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్: ఈ విభాగంలో.. ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, స్పెల్లింగ్స్, సినానిమ్స్, యాంటోనిమ్స్, కాంప్రహెన్షన్, కరెక్ట్ అండ్ ఇన్‌కరెక్ట్ యూసేజ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.


» పార్ట్–2: ఈ పరీక్షలో పోస్టులకు అనుగుణంగా సంబంధిత విభాగమైన ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లపై ప్రశ్నపత్రం ఉంటుంది.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 18.10.2022
» ఎడిట్ ఆప్షన్: 25.10.2022
» పరీక్ష తేదీ: డిసెంబర్, 2022
» వెబ్‌సైట్: https://ssc.nic.in

అంతర్జాతీయ నైపుణ్యాలకు ఐఐఎఫ్‌టీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్.. సంక్షిప్తంగా.. ఐఐఎఫ్‌టీ!! కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ(డీమ్డ్ టు బి యూనివర్సిటీ) అందించే..ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్)కు అంతర్జాతీయంగా మంచి పేరుంది. ఐఐఎఫ్‌టీ ఎంబీఏ(ఐబీ) ప్రవేశ పరీక్షలో విజయం ద్వారా అడ్మిషన్ లభిస్తుంది. 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ(ఐబీ)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఐఐఎఫ్‌టీ ప్రత్యేకత, సీట్లు, ఎంపిక ప్రక్రియ, ప్రవేశ పరీక్ష వివరాలు తెలుసుకుందాం..



ఎంబీఏ స్పెషల్

» అంతర్జాతీయ వాణిజ్యంలో ఎంబీఏ కోర్సు
» ఢిల్లీ, కోల్‌కతలలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌లు
» 2023–25కుగాను ప్రారంభమైన ప్రవేశ ప్రక్రియ
» డిసెంబర్ 18న పరీక్ష నిర్వహించనున్న ఎన్‌టీఏ

ఐఐఎఫ్‌టీ.. దాదాపు అరవై ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్. అంతర్జాతీయ వాణిజ్య నిర్వహణకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రత్యేకంగా నెలకొల్పిన విద్యాసంస్థ ఇది. ప్రస్తుతం ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ(ఐబీ) పూర్తిచేసిన విద్యార్థులకు అంతర్జాతీయ అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి.

రెండు క్యాంపస్‌లు

ఢిల్లీ ప్రధాన క్యాంపస్‌గా ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్.. తర్వాత కోల్‌కతలోనూ మరో క్యాంపస్‌ను నెలకొల్పింది. రెండు క్యాంపస్‌లలో కలిపి ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్)లో 725 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలోనూ కొత్తగా క్యాంపస్‌ను నెలకొల్పారు. ఇక్కడ ఇంకా ఎంబీఏ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టలేదు. ప్రస్తుతం అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సును మాత్రమే అందిస్తున్నారు.

ఎంట్రన్స్ ద్వారా ప్రవేశం

ఐఐఎఫ్‌టీ–ఢిల్లీ, కోల్‌కత క్యాంపస్‌లలోని ఎంబీఏ(ఐబీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ప్రతి ఏటా ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. తాజాగా 2023–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్స్‌కు సంబంధించి ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో డిసెంబర్ 18న ఈ పరీక్ష జరుగనుంది.

నాలుగు విభాగాలు

ఐఐఎఫ్‌టీ–ఎంబీఏ(ఐబీ)ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో మొత్తం నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. క్వాంటిటేటివ్ అనాలసిస్, రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

మలి దశలో.. జీడీ, పీఐ

- ఎంబీఏ(ఐబీ) ప్రవేశ పరీక్షలో నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. సదరు అభ్యర్థులకు మలి దశలో మరో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- మలి దశ ఎంపిక ప్రక్రియలో రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి. • ఈ ప్రక్రియలోనూ విజయం సాధించిన వారికి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

వెయిటేజీ విధానం

- ఐఐఎఫ్‌టీ ఎంబీఏ(ఐబీ)లో మలి దశ ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నారు.
- ఐఐఎఫ్‌టీ ప్రవేశ పరీక్ష స్కోర్‌కు 73 పాయింట్లు, పదో తరగతిలో పొందిన మార్కులకు పది స్కోర్ పాయింట్లు, ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులకు పది స్కోర్ పాయింట్లు, అకడమిక్ డైవర్సిటీ పేరిట నాన్–ఇంజనీరింగ్ అభ్యర్థులకు అయిదు స్కోర్ పాయింట్లు, జండర్ డైవర్సిటీ పేరుతో మహిళా అభ్యర్థులకు రెండు స్కోర్ పాయింట్లు చొప్పున కేటాయించారు.
- ఈ వెయిటేజీ విధానానికి అనుగుణంగా అభ్యర్థులను మలిదశ ఎంపిక ప్రక్రియకు పిలుస్తారు.

తుది జాబితాలోనూ

- మలి దశలో జీడీ, పీఐ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లు ముగిసిన తర్వాత తుది జాబితా రూపకల్పనలోనూ వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నారు.
- ఐఐఎఫ్‌టీ స్కోర్‌కు 45 పాయింట్లు, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌కు 10 పాయిట్లు, గ్రూప్ డిస్కషన్‌కు 10 పాయింట్లు, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 పాయింట్లు, జండర్ డైవర్సిటీకి 2 పాయింట్లు, అకడమిక్ డైవర్సిటీకి 2 పాయింట్లు, పని అనుభవానికి 3 పాయింట్లు, పదో తరగతిలో మార్కులకు 4 పాయింట్లు, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభకు 4 పాయింట్లు చొప్పున మొత్తం 100 పాయింట్లకు వెయిటేజీని గణిస్తారు.
- ఈ వెయిటేజీ విధానానికి అనుగుణంగా..అభ్యర్థులు పొందిన స్కోర్‌ను క్రోడీకరించి తుది జాబితా రూపొందించి ఎంబీఏ(ఐబీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు ఖరారు చేస్తారు.

విజయానికి ఇలా

ఐఐఎఫ్‌టీ–ఎంబీఏ(ఐబీ) ఎంట్రన్స్ టెస్ట్‌లో విజయానికి అభ్యర్థులు విభాగాల వారీగా నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్వాంటిటేటివ్ అనాలిసిస్

ఈ విభాగం మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ఉంటుంది. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలంటే.. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్–టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ వెర్బల్ ఎబిలిటీ

ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రాణించాలంటే.. అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా వెర్బల్ ఎబిలిటీలో స్కోర్ కోసం యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై దృష్టిపెట్టాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పారాగ్రాఫ్స్‌లను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్

అభ్యర్థుల్లోని విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణను పరిశీలించే విభాగం ఇది. ఇందులో మెరుగైన స్కోర్ సాధించేందుకు టేబుల్స్,గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో రాణించేందుకు క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగానికి సంబంధించి అభ్యర్థులు సమకాలీన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా జాతీయ,అంతర్జాతీయంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లోని తాజా పరిణామాలు, ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ చర్యలు, బ్యాంకింగ్ విధానం తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

మలి దశ కూడా ముఖ్యమే

- రిటెన్ ఎబిలిటీ టెస్ట్: నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని అభ్యర్థుల అభిప్రాయం చెప్పమంటారు. దీనికోసం సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సొంతం చేసుకోవాలి. ఇంగ్లిష్ దినపత్రికల వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.
- గ్రూప్ డిస్కషన్: గ్రూప్ డిస్కషన్‌లో రాణించేందుకు.. కోర్ నుంచి కాంటెంపరరీ వరకు ముఖ్యమైన అంశాలపై పట్టుసాధించాలి. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- పర్సనల్ ఇంటర్వ్యూ: గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన వారు చివరిగా ఎదుర్కోవాల్సిన ప్రక్రియ.. పర్సనల్ ఇంటర్వ్యూ.సదరు అభ్యర్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంచుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. కాబట్టి అభ్యర్థులు ఐఐఎఫ్‌టీలో చేరడానికి కారణాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి స్పష్టత పెంచుకోవాలి.

ఆకర్షణీయ ప్యాకేజీలతో ఆఫర్లు

ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ(ఐబీ) పూర్తి చేసిన అభ్యర్థులకు అద్భుత ప్యాకేజీలతో ఆఫర్లు లభిస్తున్నాయి. గతేడాది క్యాంపస్ డ్రైవ్స్‌లో సగటు వార్షిక వేతనం రూ.21 లక్షలుగా నమోదైంది. అత్యధిక వార్షిక వేతనం రూ.46.5 లక్షలుగా ఉంది. దాదాపు 117 సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఆఫర్లు ఖరారు చేశాయి. ఇంటర్న్‌షిప్ కోసం నిర్వహించే సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లోనూ సగటు స్టయిఫండ్ రూ.1.61 లక్షలుగా ఉండటం విశేషం. అత్యధిక స్టయిఫండ్ రూ.3.2 లక్షలుగా ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 14, 2022
- దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం: నవంబర్ 16 – నవంబర్ 20
- ఐఐఎఫ్‌టీ ప్రవేశ పరీక్ష తేదీ:డిసెంబర్18, 2022
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://iift.nta.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	685	57,918
నిఫ్టీ ▲	171	17,186

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,321	▽	328
డోజోన్స్	29,635	▽	404
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,859	▲	9
డాక్స్	12,438	▲	82
షాంఘై	3,072	▲	56
నికాయ్	27,091	▲	853

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

రక్షణ 'ఫిక్స్‌డ్'.. రాబడి కాదు!



ఫిక్స్‌డ్ డిపాజిట్ ఎంతో సురక్షితం. ఎక్కువ మంది ఇలానే భావిస్తుంటారు. రాబడి తక్కువే అయినా, భద్రత పాళ్లు ఎక్కువ కదా అన్న భరోసా వారిది. అందుకే ఇప్పటికీ సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంటారు. గతంలో మాదిరి ఇప్పుడు బ్యాంకు శాఖకు వెళ్లి డిపాజిట్ చేయాల్సిన అవసరం కూడా తప్పింది. ఉన్నచోట నుంచే నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ డిపాజిట్ చేసుకోవడం, ఆన్‌లైన్‌లోనే రద్దు చేసుకోవడం అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఎఫ్‌డీ మరింత సౌకర్యవంతంగా మారిందని చెప్పుకోవాలి. ఒకవేళ బ్యాంకు సంక్షోభం పాలైనా.. రూ.5 లక్షల వరకు తిరిగి చెల్లించే ఆర్‌బీఐ 'డిపాజిట్ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్' ఉంది. కానీ, ఇవన్నీ నాణేనికి అనుకూల ముఖమే. రెండో వైపు తిప్పి చూస్తే.. అసలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రాబడి వస్తుందా..? ద్రవ్యోల్బణం, పన్ను పోను మిగిలేది ఎంత? అసలు ఇది మెరుగైన పెట్టుబడి సాధనమేనా..? ఈ అంశాలన్నీ చర్చించే కథనమే ఇది.

ఇటీవలి కాలంలో ఇన్వెస్టర్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) నుంచి తమ పెట్టుబడులను ఇతర సాధనాల వైపు మళ్లిస్తుండడాన్ని పరిశీలించొచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో డెట్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్ వైపు వారు అడుగులు వేస్తున్నారు. ఇక్కడ రెండు అంశాలను గమనించాలి. ఇలా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు దూరంగా వెళ్లడానికి కారణాలను చూస్తే.. ఒకటి వడ్డీ రేట్లు తక్కువగా ఉండడం, రెండోది ఇన్వెస్టర్లలో వివిధ సాధనాలు, వాటిల్లోని రిస్క్, రాబడుల పట్ల పెరుగుతున్న అవగాహనే. ఫిక్స్‌డ్ డిపాజిట్ ఎన్నో తరాల నుంచి నమ్మకమైన పెట్టుబడి సాధనంగా ఉంటూ వస్తోంది. కానీ, టెక్నాలజీ అందుబాటు, పెట్టుబడులకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు ఇన్వెస్టర్లలో అవగాహనను పెంచుతున్నాయి. దీంతో పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లను మ్యూచువల్ ఫండ్స్ రాబడులతో పోల్చి చూసుకునే వారు పెరుగుతున్నారు. అందుకే ఇతర సాధనాలతో పోలిస్తే నేడు ఎఫ్‌డీలు అంత ఆకర్షణీయమైనవిగా ఇన్వెస్టర్లకు అనిపించడం లేదు.

నికర రాబడి సున్నా..

ఏ రాబడికి అయినా ముందు చూడాల్సింది ద్రవ్యోల్బణమే. ఇది పోను మిగులు రాబడి ఎంత అన్నదే ఇన్వెస్టర్‌కు ప్రామాణికం అవుతుంది. ప్రస్తుతం బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు వివిధ కాల వ్యవధుల ఆధారంగా 2.50 శాతం నుంచి గరిష్ఠంగా 7 శాతం వరకు ఉన్నాయి. కానీ, సెప్టెంబర్ నెలకు సంబంధించి వినియోగ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (రిటైల్) 7.3 శాతంగా ఉంది. అంటే ఇంతకుమించి వడ్డీ రేటు ఉంటేనే అసలు రాబడి వచ్చినట్టు అర్థం చేసుకోవాలి. అంతెందుకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సగటు ద్రవ్యోల్బణం 6.7 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇలా చూసినా 7 శాతం వడ్డీనిచ్చే ఎఫ్‌డీపై నికర రాబడి 0.3 శాతమే అవుతుంది. మరింత వివరంగా చూస్తే.. ఏడాది ఎఫ్‌డీపై ఎస్‌బీఐ ఆఫర్ చేస్తున్న రేటు 5.65 శాతమే. అంటే ద్రవ్యోల్బణం కంటే ఒక శాతం తక్కువ. కెనరా బ్యాంకు, పీఎస్‌బీ బ్యాంకులు సైతం 5.5 శాతం రేటును ఇస్తున్నాయి. ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులోనూ ఏడాది కాల ఎఫ్‌డీపై రేటు 5.75 శాతానికి మించి లేదు. రెండేళ్ల కాల వ్యవధికి చూసినా.. కెనరా బ్యాంకు 5.60 శాతం, యూనియన్ బ్యాంకు 5.45 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు 6.50 శాతం చొప్పున ఆఫర్ చేస్తున్నాయి.

•••

మూడేళ్ల ఎఫ్‌డీలపై ఎస్‌బీఐ ఇస్తున్న రేటు 5.60 శాతం. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు 6.50 శాతం, యాక్సిస్ బ్యాంకు 5.70 శాతం చొప్పున ఆఫర్ చేస్తున్నాయి. ఇక ఐదేళ్ల కాల ఎఫ్‌డీలపై ఎస్‌బీఐలో రేటు 5.65 శాతం ఉంటే, యాక్సిస్ బ్యాంకు, కెనరా బ్యాంకులో 5.75 శాతం చొప్పున ఉంది. అంటే ఐదేళ్ల వరకు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు, ఆర్‌బీఐ అంచనా వేస్తున్న ద్రవ్యోల్బణ రేటు 6.7 శాతం కంటే తక్కువే ఉన్నాయి. అంటే ఈ మేరకు ఎఫ్‌డీపై నష్టపోతున్నట్టు అర్థం చేసుకోవాలి. ఇక పన్ను పరిధిలో ఉన్న వారికి ఎఫ్‌డీలతో మరింత నష్టమే అని చెప్పుకోవాలి. 30 శాతం పన్ను పరిధిలో ఉంటే 7 శాతం ఎఫ్‌డీ రేటు రాబడి నుంచి పన్ను చెల్లించగా మిగిలే నికర రాబడి 4.9 శాతమే. ద్రవ్యోల్బణం 6.7 శాతం ఉండడంతో నికరంగా 2 శాతం నష్టాన్ని ఎఫ్‌డీ రూపంలో తెచ్చుకున్నట్టు అవుతుంది.



- లాభాలకు ద్రవ్యోల్బణం చిల్లు
- పన్ను పరిధిలోని వారికి నష్టం
- పెట్టుబడికి ఎన్నో ప్రత్యామ్నాయాలు
- స్వల్ప కాలానికి పలు డెట్ సాధనాలు
- దీర్ఘకాలానికి ఈక్విటీలే మెరుగైనవి

రక్షణ ఒక్కటే కాదు..



నిజానికి పెట్టుబడి ఏదైనా రక్షణ పాళ్లు ఎంతన్నది చూడాలి. కానీ, అదే సమయంలో రాబడి కూడా చూడాలి. అసలు రాబడి లేకుండా, రక్షణ ఉన్న సాధనం వల్ల ఒరిగేదేమి ఉంటుంది? ఎఫ్‌డీలు లిక్విడ్ సాధనం. అవసరమైనప్పుడు వేగంగా రద్దు చేసుకుని నగదుగా మార్చుకోవచ్చు. స్వల్పకాల అవసరం ఏర్పడితే అదే ఎఫ్‌డీపై రుణం (లోన్ ఎగైనెస్ట్ డిపాజిట్/ఓవర్‌డ్రాఫ్ట్) తీసుకోవచ్చు. అదే సమయంలో ఎఫ్‌డీలు ఒక్కటే లిక్విడ్ సాధనం అనుకోవడానికి లేదు. డెట్ మ్యూచువల్ ఫండ్స్ కూడా లిక్విడ్ సాధనాలే. మూడు రోజుల వ్యవధిలో నగదుగా మార్చుకోవచ్చు. డెట్ సాధనాల్లో ద్రవ్యోల్బణం మించి రాబడి అందుకోవచ్చు. మూడేళ్ల పాటు కొనసాగితే ద్రవ్యోల్బణ ప్రభావం పోను మిగిలిన రాబడిపైనే పన్ను పడుతుంది. ఫండ్స్‌లో వైవిధ్యానికి చోటు కల్పించుకోవచ్చు.

లక్ష్యానికి అనుగుణంగానే..



కాల వ్యవధికి అనుకూలమైన సాధనం ఎంపిక చేసుకోవడం పెట్టుబడికి కీలకం అవుతుంది. వ్యవధి మూడేళ్లకు మించి లేనప్పుడు ఈక్విటీలను ఎంపిక చేసుకోకపోవడమే సరైనది. 3–5 ఏళ్ల కాలానికి హైబ్రిడ్ పథకాలు, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ పథకాలు అనుకూలం. 5–10 ఏళ్లు, అంతకంటే ఎక్కువ కాలానికి లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాలు, ఈటీఎఫ్‌లు, ఈఎల్ఎస్ఎస్‌లు, 10 ఏళ్లకు మించిన దీర్ఘకాలం కోసం స్మాల్‌క్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. మూడేళ్లలోపు అయితే రాబడి పెద్దగా లేకపోయినా డెట్ సాధనాలకే పరిమితం కావాలి. ఇక అత్యవసర నిధి అయితే ఎఫ్‌డీలు, లిక్విడ్ ఫండ్స్, లో డ్యురేషన్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయాలు చాలానే ఉన్నాయి. దీనికంటే ముందు ఎఫ్‌డీల్లో పెడుతున్న మొత్తం దేనికి ఉద్దేశించినది? అని ప్రశ్నించుకోవాలి. అత్యవసర నిధి అయితే ఎఫ్‌డీలలో పెట్టుకోవడం సరైనదే అవుతుంది. అత్యవసరం చెప్పి రాదు. ఏ సమయంలో అయినా వెంటనే వెనక్కి తీసుకోవడానికి వెసులుబాటుతో ఉండాలి.

ప్రత్యామ్నాయాలు

ఇక్కడ రాబడి ప్రామాణికం కాదు. కనుక ఎమర్జెన్సీ ఫండ్‌ను ఎఫ్‌డీలలో పెట్టుకోవచ్చు. అలాగే, ఏడాది కాలం కోసం కూడా ఎఫ్‌డీలను పరిశీలించొచ్చు. ఏడాదికి మించిన కాలవ్యవధి కోసం ఇన్వెస్ట్ చేసుకునేందుకు.. భిన్న కాలాలతో కూడిన వైవిధ్యమైన డెట్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్, డెట్ ఈక్విటీ కలగలిసిన హైబ్రిడ్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు ఇలా ఎన్నో అందుబాటులో ఉన్నాయి.

షార్ట్ డ్యురేషన్ ఫండ్స్

ఇవి ఏడాది నుంచి మూడేళ్ల కాల మనీ మార్కెట్, డెట్ ఇనుస్ట్రుమెంట్లలో పెట్టుబడులు పెడుతుంటాయి. వీటిల్లో సగటు వార్షిక రాబడి 7 శాతం స్థాయిలో ఉంటుందని ఆశించొచ్చు. ఇంతకంటే మెరుగైన రాబడులు, తక్కువ రాబడులకు అవకాశం లేకపోలేదు. ఎంపిక చేసుకునే పథకాల పనితీరు ఆధారంగా రాబడి ఉంటుందని మర్చిపోవద్దు. రెండు నుంచి మూడేళ్ల కాలానికి వీటిని ఎంపిక చేసుకోవచ్చు.

మీడియం టు లాంగ్ డ్యురేషన్

నాలుగు నుంచి ఏడేళ్ల కాల వ్యవధి కలిగి సాధనాల్లో పెట్టుబడులు పెడతాయి. వీటిల్లోనూ రాబడులు ఇంచుమించుగా మీడియం డ్యురేషన్ ఫండ్స్ స్థాయిలోనే ఉంటాయి.

లాంగ్ డ్యురేషన్ ఫండ్స్

ఏడేళ్లకు మించిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. చారిత్రక రాబడులు 6 శాతం నుంచి 18 శాతం మధ్య ఉన్నాయి.

ఇవి గుర్తు పెట్టుకోవాలి..

డెట్ ఫండ్స్‌లో పెట్టుబడి, రాబడికి గ్యారంటీ ఉండదు. దీన్నే క్రెడిట్ రిస్క్ అంటారు. అంటే ఫండ్స్ తీసుకెళ్లి ఇన్వెస్ట్ చేయగా, ఆయా పత్రాలకు సంబంధించి తిరిగి చెల్లింపులు జరగకపోవడం. ఆర్థిక సంక్షోభ సమయాల్లో, అస్థిరతల్లో వడ్డీ రేట్ల రిస్క్ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో లిక్విడిటీ రిస్క్ కూడా ఎదురుకావచ్చు. నాణ్యమైన డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే పథకాల్లో లిక్విడిటీ రిస్క్ దాదాపుగా ఉండదనే చెప్పుకోవచ్చు. కానీ, రాబడి కోసం రిస్క్ తీసుకుని డెట్‌లో పెట్టుబడులు పెట్టడం కంటే.. ఈక్విటీలను ఆశ్రయించడం మెరుగైన మార్గం అవుతుంది. ఎందుకంటే ఎలానూ రిస్క్‌కు సిద్ధ పడ్డాం కనుక, ఈక్విటీల్లో మెరుగైన రాబడిని సొంతం చేసుకోవచ్చు. ఆయా విషయాల్లో నిపుణుల సలహాలను తీసుకొని నడచుకోవడం వల్ల వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

కార్పొరేట్/ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్లు


కార్పొరేట్, ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల డిపాజిట్లను కూడా పరిశీలించొచ్చు. కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు తమ వ్యాపార కార్యకలాపాల కోసం సెక్యూరిటీల జారీ ద్వారా నిధులు సమీకరిస్తుంటాయి. వీటిపై 7.5–8.5% మధ్య రాబడులు ఆశించొచ్చు. ఏఏఏ రేటెడ్ కలిగిన బాండ్లనే ఎంపిక చేసుకోవాలి. లేదంటే రాబడి మాటేమో కానీ, పెట్టుబడి కూడా సంక్షోభంలో పడిపోతుంది.

మీడియం డ్యురేషన్ ఫండ్స్

ఇవి మూడు నుంచి ఐదేళ్ల కాల వ్యవధితో ఉండే డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. ఎంపిక చేసుకునే పథకాల ఆధారంగా ఈ విభాగంలో మూడేళ్ల కాలానికి వార్షిక సగటు కనిష్ఠ రాబడి 3 శాతంగాను, గరిష్ఠ రాబడి 17 శాతం వరకు ఉంది. కనుక ఎంపిక చేసుకునే పథకం ఇక్కడ ప్రామాణికం అవుతుంది. ఏడు శాతానికి పైనే రాబడి ఆశించొచ్చు.

పీపీఎఫ్

అసంఘటిత రంగంలోని వారు, 15–20 ఏళ్ల కాల లక్ష్యాలకు పీపీఎఫ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో చేసే పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందులో వచ్చే రాబడులపైనా పన్ను ఉండదు. అన్ని విధాలుగా పన్ను ప్రయోజనం కలిగిన సాధనం. ప్రస్తుతం వడ్డీ రేటు 7.1%గా ఉంది.



వీపీఎఫ్

ప్రైవేటు రంగంలోని ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో కింద భవిష్యనిధి స్కీమ్ ఉంటుంది. దీనికి అదనంగా స్వచ్ఛంద ప్రావిడెంట్ ఫండ్ (వీపీఎఫ్) పేరుతో అదనపు పెట్టుబడి చేసుకోవచ్చు. పీఎఫ్‌కు అమలయ్యే వడ్డీ రేటే వీపీఎఫ్ పెట్టుబడులకూ వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరానికి పీపీఎఫ్ బ్యాలన్స్‌పై 8.10 శాతం వడ్డీ రేటును కేంద్రం ప్రకటించింది. కాకపోతే వీపీఎఫ్‌లో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ ఉంటుంది. అంటే ఐదేళ్ల తర్వాతే ఉపసంహరించుకోగలరు. ఒకవేళ ఉద్యోగానికి రాజీనామా చేసినా, రిటైర్ అయినా అటువంటి సందర్భాల్లో ఈపీఎఫ్‌తోపాటు వీపీఎఫ్ కూడా తీసేసుకోవచ్చు.

డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్

డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ లేదా బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్‌తో ఒక సానుకూలత ఉంది. మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టు డెట్ నుంచి ఈక్విటీకి, ఈక్విటీ నుంచి డెట్‌కు పెట్టుబడులను బదలాయిస్తుంటాయి. తద్వారా రిస్క్ తగ్గించి, అధిక రాబడులను ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటాయి. 9–18 శాతం మధ్య దీర్ఘకాలంలో వార్షిక రాబడులను వీటి నుంచి ఆశించొచ్చు.

హైబ్రిడ్ ఫండ్స్

ఐదేళ్లు అంతకుమించిన కాలానికి హైబ్రిడ్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్ మెరుగైనవి. ద్రవ్యోల్బణం, పన్ను బాధ్యతలు తీసేసి చూసినా.. ఈక్విటీ ఫండ్స్‌లో రాబడి మెరుగ్గానే ఉంటుందని అందుబాటులోని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అని రెండు రకాలు ఉన్నాయి. ఈక్విటీల్లో 65 శాతం నుంచి 80 శాతం వరకు ఇన్వెస్ట్ చేసేవి అగ్రెస్సివ్ హైబ్రిడ్ పథకాలు. నూరు శాతం ఈక్విటీ రిస్క్ వద్దనుకునే వారు, ఈక్విటీ డెట్ కలయిక కోరుకునే వారికి ఇవి అనుకూలం. వీటిల్లో వార్షిక రాబడి దీర్ఘకాలంలో 12–18 శాతం మధ్య ఆశించొచ్చు. వీటికి ఈక్విటీ పథకాలకు మాదిరే పన్ను విధానం వర్తిస్తుంది. లాభాలు స్వల్పకాల, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తాయి. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఈక్విటీలకు 10–25% మధ్య కేటాయింపులు చేస్తాయి. వీటిల్లో రాబడులకు డెట్ ఫండ్స్ పన్ను విధానం వర్తిస్తుంది. రిస్క్ తక్కువ తీసుకునే వారికి ఇవి అనుకూలం. కొంత భాగం ఈక్విటీలకు కేటాయించడం వల్ల దీర్ఘకాలంలో వార్షిక రాబడి 9–12% మధ్య ఉంటుంది. ఇక బ్యాలన్స్‌డ్ హైబ్రిడ్ ఫండ్స్ అన్నవి ఈక్విటీలు, డెట్‌కు సమానంగా కేటాయింపులు చేస్తుంటాయి.

లార్జ్‌క్యాప్/మిడ్‌క్యాప్/స్మాల్‌క్యాప్

లార్జ్‌క్యాప్ కంపెనీలు ఎలాంటి మార్కెట్ పరిస్థితులను అయినా, ఆర్థిక సంక్షోభాలను అయినా తట్టుకోగలవు. ఎందుకంటే ఆయా రంగాల్లో అవి పెద్ద స్థాయికి చేరినవి కనుక. రిస్క్ తక్కువగా ఉండాలని భావించే వారు ఐదేళ్లు అంతకుమించిన కాలానికి లార్జ్‌క్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. సగటు వార్షిక రాబడులు 12–18 శాతం మధ్య ఉంటాయి. మోస్తరు రిస్క్ తీసుకునే వారు మిడ్‌క్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో దీర్ఘకాలంలో రాబడులు 12–22 శాతం మధ్య ఉంటాయి. స్మాల్‌క్యాప్ పథకాలను పదేళ్లు అంతకుమించిన కాలానికి, అధిక రిస్క్ ఉన్నా ఫర్వాలేదు అధిక రాబడులు కోరుకునే వారు పరిశీలించొచ్చు. వీటిల్లో రాబడులను 18 శాతానికి పైన ఆశించొచ్చు.

మిరే అసెట్ నుంచి టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా రెండు టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్స్‌ను ప్రారంభించింది. అవి, మిరే అసెట్ నిఫ్టీ ఎఎఎ పీఎస్‌యు బాండ్ ప్లస్ ఎస్‌డీఎల్ ఏప్రిల్ 2026 50:50 ఇండెక్స్ ఫండ్, మిరే అసెట్ క్రిసిల్ ఐబీఎస్ గిల్ట్ ఇండెక్స్– ఏప్రిల్ 2033 ఇండెక్స్ ఫండ్. మొదటిది 2026 ఏప్రిల్ 30తో మెచ్యూర్ అయ్యే ప్రభుత్వ రంగ సంస్థల బాండ్లు, రాష్ట్ర అభివృద్ధి రుణాల్లో (ఎస్‌డీఎల్) ఇన్వెస్ట్ చేస్తుంది. ఇక రెండోది 2033 ఏప్రిల్ 29 నాటికి మెచ్యూర్ అయ్యే గవర్నమెంట్ సెక్యూరిటీల్లో మదుపు చేస్తుంది. కార్పొరేట్ బాండ్లతో పోలిస్తే తక్కువ క్రెడిట్ రిస్కుతో మెరుగైన రాబడి అందుకునేందుకు ఇవి ఉపయోగకరంగా ఉండగలవని సంస్థ తెలిపింది. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు అక్టోబర్ 18న ముగుస్తాయి. కనీసం రూ. 5,000 ఇన్వెస్ట్ చేయాలి. సంస్థ సీఐవో (ఫిక్స్‌డ్ ఇన్‌కం) మహేంద్ర జాజూ ఈ ఫండ్‌లను నిర్వహిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-10-2022	
విశాఖ	440–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
16-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	395–00
వరంగల్	397–00
రిటైల్ ధర	4.55

వృద్ధి గతిని మార్చిన డిజిటల్ బ్యాంకింగ్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని 75 డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లను జాతికి అంకితం చేస్తున్న దృశ్యం

- కస్టమర్ల వద్దకే బ్యాంకింగ్ సేవలు
- నిరర్థక ఆస్తుల సమస్యకు పరిష్కారం
- డిజిటల్ లావాదేవీలు మన బలం
- ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ: భారత్ స్థిరమైన వృద్ధి సాధించడం వెనుక బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రధాన కారణాలుగా ప్రధాని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. 2014కు ముందున్న ఫోన్ బ్యాంకింగ్ స్థానంలో గత ఎనిమిది సంవత్సరాల్లో డిజిటల్ బ్యాంకింగ్ ప్రవేశ పెట్టడం స్థిరమైన వృద్ధికి దోహదపడినట్టు చెప్పారు. యూపీఏ సర్కారు హయాంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలి, నియమ నిబంధనలపై ఆదేశాలు ఫోన్ ద్వారా వెళ్లేవన్నారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థ అయినా.. దాని బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత బలంగా ఉంటే అంత పురోగమిస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 75 డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లను (డీబీయూలు) ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫోన్ బ్యాంకింగ్ విధానంలో ఫోన్ ద్వారానే బ్యాంకుల నిర్వహణను నేతలు నిర్దేశించే వారని వ్యాఖ్యానించారు. ఫోన్ బ్యాంకింగ్ రాజకీయాలు బ్యాంకులను సంక్షోభం పాలు చేశాయని, వేలాది కోట్ల రూపాయిల స్కామ్‌లకు దారితీశాయని విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకతపై దృష్టి పెట్టి బ్యాంకింగ్ రంగాన్ని మార్చేసినట్టు చెప్పారు. ''నిరర్థక ఆస్తులను (ఎన్‌పీఏలు) గుర్తించడంతో పారదర్శకత వల్ల వేలాది కోట్ల రూపాయిలను తిరిగి బ్యాంకింగ్ రంగంలోకి తీసుకొచ్చాం. బ్యాంకులకు నిధుల సాయం అందించాం. ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై చర్యలు తీసుకున్నాం. అవినీతి నిరోధక చట్టాన్ని సంస్కరించాం'' అని ప్రధాని వివరించారు. దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) చట్టాన్ని తేవడం ఎన్‌పీఏల సమస్యకు పరిష్కారం లభించినట్టు చెప్పారు. కస్టమర్లు బ్యాంకుల దగ్గరకు వెళ్లడం కాకుండా, వారి దగ్గరకే బ్యాంకులు వచ్చేలా డిజిటల్ బ్యాంకింగ్‌తో మార్పులను తీసుకొచ్చినట్టు వివరించారు. మారుమూల ప్రాంతాలకూ బ్యాంకు సేవలను చేరువ చేయడానికి అధిక ప్రాధాన్యం చూపించినట్టు చెప్పారు.

చిన్న వర్తకులూ డిజిటల్‌కు మారాలి..

గ్రామాల్లోని చిన్న వర్తకులు సైతం పూర్తిగా డిజిటల్ లావాదేవీలకు మళ్లాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రతీ బ్యాంకు శాఖ 100 మంది వర్తకులను తమతో అనుసంధానించాలని కోరారు. ఈ చర్య మన ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తు సన్నద్ధంగా మార్చేస్తుందన్నారు. ''డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు అన్నవి నేడు మన ఆర్థిక వ్యవస్థకు, స్టార్టప్ ప్రపంచానికి, భారత్‌లో తయారీకి, స్వావలంబన భారత్‌కు గొప్ప బలం''అని ప్రధాని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ కలయిక అవినీతి నిర్మూలనకు సాయపడుతున్నట్టు తెలిపారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారులకు రూ.25 లక్షల కోట్లను బదిలీ చేసినట్టు ప్రకటించారు. పీఎం–కిసాన్ పథకం కింద మరో వాయిదా ప్రయోజనాన్ని సోమవారం బదిలీ చేయనున్నట్టు చెప్పారు. ఈ పథకం కింద ఒక్కో రైతుకు ఒక ఎకరానికి రూ.6,000 (మూడు వాయిదాలుగా) ప్రయోజనం లభించనుంది. బ్లాక్‌చైన్ ఆధారిత డిజిటల్ కరెన్సీని తీసుకురావాలన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ''డిజిటల్ కరెన్సీ అయినా, డిజిటల్ లావాదేవీలు అయినా ఇందులో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయి. ఈ చర్య పొదుపులను పెంచుతుంది. భౌతిక కరెన్సీని తగ్గిస్తుంది. తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు''అని వివరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 11,125 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22%ఎగసి రూ. 11,125 కోట్లను అధిగమించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 20 శాతం పుంజుకుని రూ. 10,606 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 8,834 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 19 శాతం బలపడి రూ. 21,201 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ 4.1 శాతంగా నమోదయ్యాయి.

ఎన్‌పీఏలు మెరుగు

ప్రస్తుత క్యూ2లో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.35 శాతం నుంచి 1.23 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీల కేటాయింపులు రూ. 3,925 కోట్ల నుంచి తగ్గి రూ. 3,240 కోట్లకు పరిమితమయ్యాయి. కాగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంపై వాటాదారుల సమావేశ నిర్వహణకు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 40 బిలియన్ డాలర్ల విలువైన ఈ డీల్‌కు 2022 ఏప్రిల్ 4న తెరలేచిన విషయం విదితమే.

డీమార్ట్ నికర లాభం హైజంప్

సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 686 కోట్లు



న్యూఢిల్లీ: రెండో త్రైమాసికంలో డీమార్ట్ స్టోర్ల నిర్వాహక కంపెనీ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 64 శాతంపైగా జంప్‌చేసి రూ. 686 కోట్లకు చేరింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 418 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం దాదాపు 37 శాతం ఎగసి రూ. 10,638 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 7,789 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు 37 శాతం పెరిగి రూ. 9,926 కోట్లను తాకాయి. స్టోర్ల సందర్శకుల సంఖ్య తగ్గినప్పటికీ సరుకు కొనుగోళ్ల(బాస్కెట్) విలువ పుంజుకున్నట్లు సంస్థ సీఈవో, ఎండీ నెవిల్లే నొరోన్హా పేర్కొన్నారు.

మైక్రో బ్రాంచ్‌ల ఏర్పాటులో వర్తన ఫైనాన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విద్యా రుణాల సంస్థ వర్తన ఫైనాన్స్ చిన్న పట్టణాల్లోకి కూడా కార్యకలాపాలువిస్తరిస్తోంది. ఇందులో భాగంగా మైక్రో బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈవో స్టీవ్ హార్డ్‌గ్రేవ్ తెలిపారు. తొలి దశలో సుమారు 20 ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 5 శాఖలు కలిపి 16 రాష్ట్రాల్లో మొత్తం 36 శాఖలు ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యా సంస్థలు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చుకునేందుకు కూడా రుణాలు అందిస్తున్నామన్నారు. 3,000 మంది విద్యార్థులకు దాదాపు రూ. 30 కోట్లు, 2,000 పాఠశాలలకు రూ. 900 కోట్ల మేర రుణాలు అందించినట్లు వివరించారు.



సీఈవో స్టీవ్

భారీగా పెట్టుబడుల ఆకర్షణకు ప్రణాళిక

ఫిబ్రవరిలో విశాఖపట్నంలో అంతర్జాతీయ సదస్సు



- ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు
- దేశంలోని ఐదు ప్రధాన నగరాలతో పాటు ఎనిమిది దేశాల్లో రోడ్‌షోలకు ఏపీఈడీబీ కసరత్తు
- పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ఏపీ బ్రాండింగ్‌పై దృష్టి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతల గురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ పెట్టుబడుల సమావేశం విజయవంతం అయ్యేందుకు దేశవిదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దేశంలోని ఐదు ప్రధాన పట్టణాలైన ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీలతో పాటు తైవాన్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్, యూఏఈ, అమెరికా, ఆస్ట్రేలియా/న్యూజిలాండ్, దావోస్‌ల్లో రోడ్‌షోలు నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. దేశంలో జరిగే రోడ్‌షోల్లో మంత్రులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొనిసుదీర్ఘ తీరప్రాంతంతో పాటు మూడు పారిశ్రామిక కారిడార్లలో అభివృద్ధిచేస్తున్న పారిశ్రామిక పార్కులు, ప్రభుత్వ కల్పిస్తున్న మౌలిక వసతులు, పెట్టుబడి ప్రతిపాదన దగ్గర నుంచి ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ప్రభుత్వం అందించే హ్యాండ్ హోల్డింగ్ వంటి వివరాలను తెలియజేయనున్నారు. అదే విధంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వివిధ దేశాలతోపాటు జనవరిలో జరిగే దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంను వేదికగా వినియోగించుకోనున్నారు. ఇక అంతర్జాతీయంగా వివిధ దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, రాయబారులు హాజరయ్యే ఈ సమావేశాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర అధికార బృందం వెళ్లి ఏపీలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సు నిర్వహణ బాధ్యతలను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్‌కు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం.. రోడ్‌షోలను పరిశ్రమల శాఖతో కలిసి ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) నిర్వహించనుంది. రోడ్‌షోల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రణాళికను సిద్ధంచేశామని, వచ్చే మూడునెలల్లో వీటిని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీఈడీబీ వైస్ ప్రెసిడెంట్ ఎస్. ప్రసాద్ 'సాక్షి'కి వివరించారు.

సామాజిక మాధ్యమాల వేదికగా..

మరోవైపు.. కేవలం రోడ్‌షోలే కాకుండా రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించేందుకు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలనూ ప్రచారానికి వినియోగించుకోనున్నారు. వీటిద్వారా ఎప్పటికప్పుడు రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు, యూనిట్లు ఏర్పాటుచేసిన వారి అభిప్రాయాలను తెలియజేయనున్నారు. అలాగే, పెట్టుబడుల సదస్సుకు ప్రచారం కల్పించేందుకు వివిధ రాష్ట్రాల పత్రికలు, జాతీయ ఛానల్స్‌లో కూడా ప్రచారం కల్పిస్తారు.

తీర్థయాత్రలో మృత్యుఘోష

- కర్ణాటకలో ఘోర ప్రమాదం.. 9 మంది దుర్మరణం
- టెంపో ట్రావెలర్‌ను ఢీకొన్న ట్యాంకర్
- మిల్క్ ట్యాంకర్, ఆర్టీసీ బస్సు మధ్య నుజ్జునుజ్జయిన టెంపో

బనశంకరి: కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో నలుగురు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నారు. శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో మరో 12 మందికి తీవ్ర గాయాలు కాగా.. వారిని హాసన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతులంతా కర్ణాటకలోని హాసన్ జిల్లా బాణవార తాలూకా హళ్లికెరె గ్రామానికి చెందిన వారు. టెంపో ట్రావెలర్‌లో పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా పాల ట్యాంకర్, కేఎస్ఆర్టీసీ బస్సు మధ్య చిక్కుకుని టెంపో ట్రావెలర్ నుజ్జునుజ్జయింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హళ్లికెరె గ్రామానికి చెందిన 14 మంది టెంపో ట్రావెలర్ వాహనంలో శనివారం ధర్మస్థల దేవస్థానానికి వెళ్లారు. అక్కడినుంచి సాయంత్రం హాసన్‌లో గల హాసనాంబ దర్శనం చేసుకుని స్వగ్రామానికి బయలుదేరారు.

రెండు వాహనాల మధ్య చిక్కుకుపోయి..

టెంపో ట్రావెలర్ హాసన్ జిల్లా అరసికెరె తాలూకా బాణావర పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-69పై వెళ్తుండగా.. అక్కడి మలుపు వద్ద పాల ట్యాంకర్ రాంగ్‌రూట్‌లో ఆకస్మాత్తుగా హైవే మీదకు వచ్చింది. టెంపో ట్రావెలర్ దానిని ఢీకొట్టి బోల్తా పడింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు టెంపో ట్రావెలర్ మీదకు దూసుకెళ్లింది. మిల్క్ ట్యాంకర్, ఆర్టీసీ బస్సు మధ్యలో చిక్కుకుపోయి టెంపో ట్రావెలర్ నుజ్జునుజ్జు కాగా.. అందులోని 9 మంది మరణించారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో హైవేను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారిలో డైవర్షన్‌పై గందరగోళంగా ఉందని.. రాత్రి జరిగిన ప్రమాదానికి ఇదే కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.



గుర్తు పట్టలేని విధంగా ధ్వంసమైన టెంపో

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.